ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శ్రీకాకుళం
epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
17-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 45 పేజీలు: 16 వెల: 6.50



అంగరంగ వైభవంగా 'ఆస్కార్' వేడుక
ఉత్తమ చిత్రం వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్‌కు ఆరు అవార్డులు
4లో



సోమవారం ఇరాన్ ఛాబహార్ ఎయిర్‌పోర్టుపై దాడితో దగ్ధమవుతున్న భవనాలు

# పోరు ఉధృతం

## ప్రత్యర్థులపై ఇరాన్ 'డాన్సింగ్ మిసైల్ ప్రయోగం'

## హార్ముజ్ జలసంధిపై నాటో దేశాల వైఫల్యం: ట్రంప్

## దుబాయ్, అబుదాబి ఎయిర్‌పోర్టులపై ఇరాన్ క్షిపణి దాడులు

## ఇరాన్ ఛాబహార్ ఎయిర్‌పోర్టుపై ఇజ్రాయెల్, అమెరికా జెట్ దాడులు

**టెహ్రాన్,జెరూసలెం,వాషింగ్టన్, మార్చి 16:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలురోజురోజుకూ ఉధృతం అవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్‌లు బాంబులు, క్షిపణుల వర్షం కురిపిస్తుంటే ఇరాన్‌కూడా తానేమీ తగ్గేదిలేదంటూ గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాలతోపాటు ఆదేశాల ఎయిర్‌పోర్టులనూ టార్గెట్‌చేస్తూ దాడులుచేస్తోంది. దుబాయ్, యుఎఇల్లోని ఎయిర్‌పోర్టులపైమళ్లీ దాడులుచేయడంతో తాత్కాలికంగా సేవలు నిలిచిపోయాయి. అలాగే ఇరాన్‌కు ఆయువుపట్టులాంటి ఖర్గ్ ద్వీపంలోని మొత్తం చమురు స్థావరాలు, ఆస్తులన్నింటినీ ధ్వంసంచేస్తామనిప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ఇపుడు భూతల దాడులతో హోరెత్తిస్తున్నారు. ఇప్పటివరకూ 2300 మందికిపైగా చనిపోయిన ఈ పశ్చిమాసియా దేశాల్లో హార్ముజ్‌జల సంధిని తెరిపించేందుకు ఇపుడు నాటోపై ట్రంప్ అస్త్రంప్రయోగించారు. ఈ జలసందిగుండా నాటో దేశాల నౌకలు కూడా వెళుతున్నందున తక్షణమే స్పందించాలని లేనిపక్షంలో నాటో వైఫల్యం స్పష్టం అవుతోందంటూ నాటోపై విమర్శలతో ధ్వజమెత్తారు. మొత్తంగా తాము ఏడు వేల టార్గెట్లు నాశనంచేసామని, ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసంచేసామని ప్రకటించుకున్న ట్రంప్ వందకుపైగా ఇరాన్ నౌకలను ముంచివేయడం లేదా ధ్వంసంచేయడమో చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ ఇరాన్‌అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్; ఓమన్,కువైట్ వంటి దేశాలపై డ్రోన్లు, బాలిస్టిక్‌క్షిపణులతో దాడులుచేస్తోంది. ఇదిలా ఉంటే అమెరికా యుద్ధవిమానాలు ఇరాన్‌లోని ఛాబహార్ పోర్టువద్ద ఉన్న వాణిజ్యకేంద్రంపై దాడులుచేసాయి. ఇదిలా ఉంటే తాము హార్ముజ్ జలసంధిని రక్షించుకోవడంలో సహకరిస్తామని,అయితే ముందు ఇరాన్‌పైయుద్ధం విరమించి ఆపై తమతో కలిసిరావాలని చైనాఅమెరికాకు షరతుపెట్టింది.అయితేట్రంప్‌నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

# అమరావతిలో 'అమరజీవి'



సోమవారం పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, మంత్రులు, తదితరులు

## పొట్టి శ్రీరాములు మహావిగ్రహం ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

## 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'

## మూడేళ్లలో నం-1 రాజధానిగా అమరావతి

## వైశ్యులందరిని 'ఆర్యవైశ్యులు'గా పరిగణించేలా జీవో తెస్తాం

## వేలాది రైతుల త్యాగఫలమే అమరావతి మహానగరం: సిఎం

## శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం

**విజయవాడ,మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి:**తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణాలను అర్పించిన అమరజీవి త్యాగం చరిత్ర పుటల్లో చెరగని ముద్రగా నిలిచిందని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భాషా,సాంస్కృతికపరంగా తెలుగువారి ఘనతను ప్రపంచానికి చాటింది అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు అన్నారు. అమరావతిలో అమరజీవి 125వజయంతి సందర్భంగా ' స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్ పేరిట ఏర్పాటు చేసిన 58 అడుగుల విగ్రహావిష్కరణ ఒక చరిత్రగా నిలిచిపోతుందని అభివర్ణించారు. పొట్టి శ్రీరాములు అందరివాడని భావించి ప్రతి ఒక్కరూ ఈ విగ్రహావిష్కరణ కోసం కృషి చేశారన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి పూర్తయితే ఈ విగ్రహం మరింత అద్భుతంగా కనిపిస్తుందన్నారు. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌లు ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా 58 అడుగుల భారీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. అమరావతిలో తొలి భారీ విగ్రహంగా అమరజీవి కాంస్య విగ్రహం ఏర్పాటైంది. శాఖమూరులో 6.8ఎకరాల విస్తీర్ణంలో అమరజీవి స్మృతివనం నిర్మించనున్నారు. 6 నెలల్లోనే రికార్డ్ స్థాయిలోనే ప్రాజెక్ట్ మొదటి దశ పనులు పూర్తి చేశారు. పొట్టి శ్రీరాములు భారీ విగ్రహం కోసం 26టన్నుల కాంస్యం, 42టన్నుల ఐరన్ స్ట్రక్చర్‌ను వినియోగించారు. రెండోదశలో మ్యూజియం, ఆడిటోరియం, >>2

# గ్యాస్‌ను బ్లాక్ చేస్తే కొరడా

## ఇండక్షన్ స్టౌలవంటి ప్రత్యామ్నాయాలు వాడండి

## ఆస్పత్రులు, స్కూళ్లు, ఆలయాలకు ఇబ్బంది రానివ్వొద్దు

## గ్యాస్ నిల్వలు, సరఫరాపై సిఎం చంద్రబాబు

**విజయవాడ మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి:** గృహ వినియోగానికి సంబంధించిన వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలకు ఇబ్బంది రాకుండా నిరంతర సరఫరా ఉండాలని సీఎం సూచించారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, బుకింగ్, సరఫరా వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సమావేశానికి ఓఎన్జీసీతోపాటు భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలి యం, ఇండియన్ ఆయిల్ సహా గ్యాస్ సర >>2



# టెన్త్ పరీక్షలు ప్రారంభం

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రారం భమయ్యాయి. విద్యార్థులను ఆయా కేంద్రాల్లో గంట ముందుగానే పరీక్షా కేంద్ర ఆవరణలోకి అనుమతించారు. అరగంట ముందు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ప్రవేశించేందుకు వీలు కల్పించారు. గతంలో మాదిరి ఒక నిమిషం ఆలస్యమైతే వెనక్కు తిప్పి పంపే నిబంధన ఈ పర్యాయం పరీక్షల్లో తొలిగించారు. దీంతో విద్యార్థులు కంగారు లేకుండా పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు పరీక్ష మొదలైంది. మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాలవరకు పరీక్ష జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,415 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో గుర్తించిన 210 సమస్యాత్మక >>2

# సిట్ కస్టడీలో అవినాశ్ రెడ్డి

## ఎపి లిక్కర్ స్కాం కేసు

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం స్కాం కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్‌రెడ్డిని సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. గుంటూరుజిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న అతన్ని విజయవాడలోని సిట్ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. మద్యం ముడుపుల వ్యవహారంలో షెల్ కంపెనీల ద్వారా భారీగా నగదు లావాదేవీలు జరిగాయని సిట్ అధికారులు ఇప్పటికే వెల్లడించారు. ఈ నేపథ్యంలో ముప్పిడి అవినాశ్‌రెడ్డి పాత్రపై అధికారులు మరింత సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. మద్యం కేసులో అరెస్టయిన ముప్పిడి అవినాశ్‌రెడ్డి గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కోర్టు అనుమతితో ఆయనను సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం భద్రతా ఏర్పాట్ల మధ్య అవినాశ్‌రెడ్డిని విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించారు. అక్కడ ప్రత్యేక విచారణ గదిలో >>2

## పొట్టి శ్రీరాములు పేరుతో

# త్వరలో ప్రత్యేక నాణెం



## ఆయన విగ్రహం ఏర్పాటుకు యువగళం పాదయాత్ర హామీని నిలబెట్టుకున్నా: మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** మరణం లేని గొప్ప శక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం ఈ స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్ అని అన్నారు. తాను తెలుగువాడిని అని గర్వంగా చెప్పుకునే గౌరవం అందించిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అనతికాలంలోనే పొట్టిశ్రీరాములు విగ్రహం అమరావతిలో ఏర్పాటు చేశామని తెలిపారు. పొట్టి శ్రీరాములు చరిత్ర భావితరాలు గుర్తు పెట్టుకునేందుకే ఈ భారీ విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని మంత్రి వివరించారు. నిస్వార్థ పోరాటం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని అన్నారు. వస్తే రాష్ట్రం, పోతే ప్రాణం అన్నట్లుగా నిరాహార దీక్ష చేపట్టి ఆంధ్ర రాష్ట్రం సాధించారని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కోసం తొలి అడుగు వేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ప్రపంచ చిత్రపటాన్ని రూపొందించిన మర్కటర్ తరహాలో ఆంధ్ర రాష్ట్ర రూపానికి పొట్టిశ్రీరాములు కారకులయ్యారని తెలిపారు. పొట్టి శ్రీరాములు పేరుతో ప్రత్యేక కాయిన్ విడుదల చేసేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి లోకేష్ తెలిపారు. అనంతరం తపాలా శాఖ రూపొందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోస్టల్ కవర్‌లను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్‌లు >>2

# అమరావతిలో హజ్ హౌస్

## వక్ఫ్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నాం

## ఇమామ్, మోజన్‌ల గౌరవవేతన బకాయిలు విడుదల చేస్తాం

## విజయవాడ ఇఫ్తార్ విందులో సిఎం చంద్రబాబు



సోమవారం విజయవాడలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సిఎం చంద్రబాబు

**విజయవాడ మార్చి 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఇమామ్, మోజన్‌లకు ఇచ్చే గౌరవ వేతన బకాయిలు రూ.45 కోట్లు వెంటనే విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలో నూతనంగా హజ్ హౌస్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింలకు 21 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు అందించిందని వివరించారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రభుత్వం తరపున ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కడపలో అసంపూర్తిగా ఉన్న హజ్ హౌస్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇస్తున్నాం. అన్ని జిల్లాల్లోనూ, నియోజకవర్గాల్లోనూ ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాం. రంజాన్ పండుగను పురస్కరించుకుని పేదలకు దానం చేస్తే సంతోషంగా ఉంటారని మహ్మద్ ప్రవక్త బోధించారు. పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన సూక్తి. ముస్లింలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధిలోకి తేవటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముస్లింలలో 4.38 లక్షల మందికి ఇస్తూ ఏడాదికి రూ.3,511 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 4.5 లక్షల మంది ముస్లిం విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తున్నాం. పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు 19,215 మందికి రూ.264 కోట్లు విడుదల చేశాం. దీపం2.0 పథకంకింద 6.20లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లతో సిలిండర్లకు ఖర్చు చేస్తున్నాం. ఇమామ్ లకు రూ.5వేలు, మోజన్లకు రూ.10 వేల చొప్పు న గౌరవ వేతనంగా రూ.180 కోట్లు అందిం చామన్నారు. మరో రూ.45 కోట్ల >>2



## అమరజీవి జలధార పేరుతో ముందుకు..

## నీరుతాగే ప్రతి ఒక్కరు అమరజీవిని స్మరించుకుకోవాలి: డి.సిఎం పవన్

# రూ.10వేల కోట్లతో 7 వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు

**విజయవాడ,మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి:** భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆద్యుడు పొట్టిశ్రీరాములు అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అమరావతిలో స్టాట్యూ ఆఫ్ సాక్రిఫైజ్ ఆవిష్కరణ సందర్భంలో పవన్ మాట్లాడుతూ తెలుగు జాతి ఉనికి కోసం ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆంధ్రరాష్ట్రం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవటానికి కారకులైన మహనీయుడిని స్మరించుకోవటం అందరి బాధ్యత అని అన్నారు. త్యాగానికి ప్రతిరూపంగా 58 అడుగుల విగ్రహం రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయటం గొప్ప విశేషమన్నారు. అమరజీవి జలధార పేరుతో జలజీవన్ మిషన్‌ను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని పవన్‌కల్యాణ్ వెల్లడించారు. నీరు తాగే ప్రతి ఒక్కరూ పొట్టిశ్రీరాములు పేరును స్మరించుకోవాలనే ఈ పేరు పెట్టామన్నారు. దాదాపు రూ.10వేల కోట్లతో 7వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరజీవి జలధార పేరుతోనే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పొట్టి శ్రీరాములు వారసులతో కూర్చుని కార్యక్రమంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నన్నారు. రాజధాని నడిబొడ్డున 58 అడు >>2

## అత్యాచారం, హత్య కేసు

# నలుగురికి జీవిత ఖైదు

**రాజమహేంద్రవరం, మార్చి16, ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంక గ్రామంలో జరిగిన రౌతు కస్తూరి అత్యాచారం,హత్య కేసులో నలుగురు ముద్దాయిలకు కోర్టు జీవిత ఖైదు మరియు జరిమానా విధించింది.ఎస్పీ డి నరసింహ కిషోర్ తెలిపిన వివరాలు ప్రకారం బుర్రిలంక గ్రామానికి చెందిన వివాహిత రౌతు కస్తూరి 2024 అక్టోబర్ 15న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో నర్సరీ పనుల కోసం పాఠంశెట్టి రాముడు నర్సరీకి వెళ్లి, సాయంత్రం 6 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్‌గా వచ్చిందన్నారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో అక్టోబర్ 16న కడియం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు >>2



# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు

**హైదరాబాద్,మార్చి16,ప్రభాతవార్త:** ప్రజాకవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. కోవిడ్19 సమయంలో సమాజంలోని వేదన, భయం, మానవీయ కోణాలను వ్యక్తపరుస్తూ సిధారెడ్డి రచించిన అనిమేష్ గ్రంథానికి గాను ఈ అవార్డు ప్రకటించినట్లు అకాడమీ తెలిపింది.ఈ నెల 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. సిధారెడ్డి మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘం ఏర్పాటుచేసి, అన్ని వర్గాల ప్రజా సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచ నలు చేస్తూ తమ కలాన్ని, గళాన్ని విప్పారరు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం >>2

17-3Pg2exHMNWJQE.qxd:17-3Pg2exHMNWJQE.qxd 1/1/02 6:44 AM Page 1



# అమరావతిలో 'అమరజీవి'

>> స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు నిర్వాహకులు ప్రారంభ కార్యక్రమంలో పొరేపల్లి దూండీ రాకేష్ తెలిపారు.అమరజీవి విగ్రహం.ఆయన పేరిట ఏర్పాటు చేసి ప్రత్యేక పోస్టల్ కవర్ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఇక రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతోమంది రైతుల త్యాగం ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి 29 వేల మంది రైతులు.. 33 వేల ఎకరాల భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారీ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించారని వివరించారు. రాజధాని లేని రాష్ట్రంలో వైసీపీ.. మూడు ముక్కలాట ఆడిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిని గత పాలకులు స్మశానం అని అవహేళన చేశారని తెలిపారు.పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. 6 నెలల్లో మొదటి దశ పనులు పూర్తి చేశారని వివరించారు. రెండో దశ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం పాలనతో బ్రాండ్ దెబ్బతిన్నదని.. తెలుగు జాతి ఇబ్బంది పడిందని గుర్తించి తాను, పవన్ కళ్యాణ్ ఇద్దరం కలసి నిలబడి.. బీజేపీతో కలిసి కూటమిగా జత కట్టామని వివరించారు. గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందు పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అమరావతిని మూడేళ్లలో ఒక స్థాయికి తీసుకు వస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో ఖర్చు ప్రభుత్వం డబ్బు కాదని.. ఇది ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని ఏపీ సీఎం వివరించారు. రూ. 10 సంపాదిస్తే అందులో రూ.2 దానం చేసేది ఆర్య వైశ్య కులమని తెలిపారు. ఆర్య వైశ్యులను అనేక విధాలుగా పిలుస్తారని.. అందరిని అదే పేరుతో పిలిచేలా త్వరలోనే జీవో జారీ చేస్తామని ప్రకటించారు. ఈ ప్రభుత్వం అందరి ప్రభుత్వం... ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. గడచిన ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకునేందుకు భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎలాంటి భయాందోళనలు లేకుండా వ్యాపారాలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా చేపడుతున్నాం. వాసవీ మాత పుట్టిన ప్రాంతం పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చామన్నారు. ఇంటింటికీ నీళ్లిచ్చే జల జీవన్ మిషన్ పథకానికి




పొట్టి శ్రీరాముల స్మారక పోస్టల్ కవర్ ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కళ్యాణ్

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అమరజీవి జలధార అని పేరు పెట్టారు. నీరు తాగే ప్రతి ఒక్కరూ అమరజీవిని స్మరించుకునేలా పవన్ కళ్యాణ్ చొరవ చూపారన్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, సవిత సహా పలువురు ప్రజా ప్రతినిధులు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. అమరజీవి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. విగ్రహావిష్కరణ సభలో అమరావతి అభివృద్ధి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో చేపట్టబోయే కార్యక్రమాలపై ఏవీ ప్రదర్శించారు. తపాలా శాఖ రూపొందించిన పొట్టి శ్రీరాములు పోస్టల్ కవర్ ను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేదికపై సన్మానించారు. అమరజీవి స్ఫూర్తితోనా రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునేలా రాజధానిని తీర్చిదిద్దుతామన్నారు.మూడేళ్లలో అమరావతి ఎలా అభివృద్ధి చేస్తామో మీరే చూస్తారన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు.మస్యలు వచ్చినా... ఇబ్బందులు వచ్చినా ప్రజలంతా సమిష్టిగా పని చేయాలి అన్నారు.వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రధాని మోదీ పని చేస్తున్నారు.దేశంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్1 చేసేలా మనం పని చేయాలి అన్నారు.

**రాజధాని రైతుల పోరాటం ఓ చరిత్ర**

తెలుగు జాతి గతంలోనూ ఇప్పుడూ అనేక సమస్యలు ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్ర రాజధాని కర్నూలు, ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ గా ఏర్పాటు చేసుకుని తెలుగు జాతి మనుగడ సాగించిందన్నారు. ఆ తర్వాత అమరావతి రాజధానిగా నవ్యాంధ్ర రాష్ట్రం ఏర్పడిందని చంద్రబాబు స్పష్టం చేశారు.

తెలుగు జాతి వివిధ సమయాల్లో విడిపోయి ఉంది, వివిధ సందర్భాల్లో కలిసి ఉందన్నారు. తెలుగు జాతికి రెండు రాష్ట్రాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాజధానితో గత పాలకులు ఆటలాడటం బాధేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ముందుగా ఎవ్వరూ గుర్తించని విధంగానే, ఇక్కడి రైతుల త్యాగాన్ని కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైతుల త్యాగం ఓ స్ఫూర్తి, చరిత్ర అని గుర్తు చేసుకున్నారు. 2019-24 మధ్య కాలంలో రాజధాని రైతుల పోరాటం ఓ చరిత్రని కొనియాడారు. పొట్టి శ్రీరాములకు నిజమైన నివాళి ఇవ్వడమంటే.. ఏపీని నెంబర్ వన్‌గా నిలపడమేనని సీఎం చంద్రబాబు ఈ సం దర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, టీజీ భరత్, సవిత, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే శ్రావణ్‌లు పాల్గొన్నారు.

# పోర్టుల నుంచి నౌకలద్వారా భారీగా సరకు రవాణా

## నూతన పోర్టుల్లో త్వరితగతిన ఆపరేషన్లు

## రెండో దశ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం వేగవంతం

## పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్షలో ముఖ్యమంత్రి

**విజయవాడ, మార్చి 16, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్ల ద్వారా ఈస్ట్ వెస్ట్ కార్గో కారిడార్గా ఏపీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితం అవుతున్న మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల్లో త్వరితగతిన కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్లు ప్రారంభం కావాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మూడు పోర్టుల నుంచి పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్ఘఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణా, కర్ణాటకల హింటర్ ల్యాండ్ నుంచి కార్గో రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు 2026 డిసెంబరు నాటికి పూర్తి అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ కూడా ఏర్పాటైన అనంతరం కంటైనర్, బల్క్ కార్గో పోర్టుగా రామాయపట్నం మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రామాయపట్నం నుంచి కడప స్టీల్ ప్లాంట్ వరకూ ప్రత్యేక మార్గాన్ని వేసేందుకు కూడా రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. మూడు పోర్టులకు సమీపంలోనూ పోర్టు టౌన్ షిప్ ఏర్పాటు చేయడం ద్వారా వాణిజ్య పరమైన లావాదేవీలు కూడా పెరుగుతాయని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు పోర్టులకు సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లు కూడా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉందన్నారు. రెండో దశలో బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్లను కూడా వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సమీప భవిష్యత్తులో ప్రతీ 50 కిలోమీటర్లకు పోర్టు, ఫిషింగ్ హార్బర్లు రానున్న నేపథ్యంలో ఈస్ట్ కోస్టు లాజిస్టిక్స్ హబ్ గా ఏపీ మారుతుందన్నారు. ఏపీలో ఉన్న పోర్టులు కార్గో హ్యాండ్లింగ్‌లో గేమ్ ఛేంజర్‌గా మారాలని సీఎం సూచనలు చేశారు. ప్రస్తుతం యుద్ధం కారణంగా దుబాయ్, గల్ఫ్ దేశాల్లోని ఓడరేవులు ఇబ్బందుల్లో పడ్డాయని.. ఇప్పుడు భారత్ లోని ఈస్ట్ కోస్ట్ లో ఉన్న పోర్టులే సురక్షితం అన్న అభిప్రాయం వచ్చిందని ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి కృష్ణబాబు,మారిటైమ్‌బోర్డుసీఈఓ అభిషేక్‌కుమార్ హాజరయ్యారు.

## టిటిడి చైర్మన్ బస చేసిన హోటల్‌పై దాడి : వైసిపి నేతలపై కేసులు

**తిరుపతి,మార్చి 16ప్రభాతవార్త:** ప్రశాంత తిరుపతి నగరంలో చిచ్చుపెట్టేందుకు వైసిపి నేతలు కుట్ర పన్నుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న వేళ సోమవారం మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కుటుంబంతో విశ్రాంతి తీసుకున్న ఓ హోటల్‌పై వైసిపి నేతలు దాడికి దిగారు. ఇటీవల టిటిడి ఛైర్మన్‌పై, టిటిడిపై దురుసుగా వ్యాఖ్యలు చేయడం, పదజాలం వాడటం చేస్తున్న వైసిపి నేతలు తాజాగా సోమవారం మధ్యాహ్నం ఆయన తిరుపతి -తిరుచానూరులో ఓ హోటల్‌లో విశ్రాంతి తీసుకున్నారు. సమాచారం అందుకున్న వైసిపి నేతలు పసుపులేటి సురేష్ ,ఆరే అజయ్ కుమార్ , గీతా యాదవ్ ,మద్దాలి శేఖర్ రాయల్, సాయి కుమారి, మల్లం రవి కుమార్ ,ఉదయ్‌వంశీ , కట్టా గోపి యాదవ్ ,రాజేంద్ర ,విజయ్ ,కుమారి, కోటి,పద్మ తదితరులు హోటల్‌పై దాడికి ప్రయత్నించారనేది ఫిర్యాదు. అంతేస్థాయిలో అకకడకు టిడిపి కార్యకర్తలు చేరుకోవడంతో వైసిపి నేతలు పరారయ్యారు. దీనిపై అందిన ఫిర్యాదుతో వైసిపి నేతలపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనివెనుక కుట్ర ఎవరిదైనా కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి పట్టుబడుతోంది. అయితే టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు బసచేసిన హోటల్ దగ్గర నిరసన తెలియజేయడానికి వెళ్లిన వైసిపి మహిళలపై కూటమి నాయకులు అమానుషంగా దాడి చేయడాన్నీ ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్షి ్మ ఖండించారు.

# అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా 55 శాతం డ్రిప్ సబ్సిడీ

## రాష్ట్రాలు అవసరమైతే 90 శాతం టాప్ అప్ సబ్సిడీ ఇవ్వచ్చు

## వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డికి కేంద్ర వ్యవసాయ మంత్రి భగీరథ్ చౌదరి స్పష్టం



**రాజంపేట, మార్చి16 ప్రభాతవార్త:** దేశంలోని అన్ని రాష్ట్రాలకు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఒకే విధమైన సబ్సిడీ అమలు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ సంక్షేమ శాఖ మంత్రి భగీరథ చౌదరి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వాలు అవసరం అనుకుంటే 90 శాతం వరకు టాప్ అప్ సబ్సిడీ ఇవ్వచ్చని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న, సన్నకారు రైతులకు, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని కరువు పీడిత జిల్లాల్లో సూక్ష ్మ నీటిపారుదల కోసం కేంద్ర సబ్సిడీ మద్దతును 55 శాతం కేంద్ర సబ్సిడీని 90 శాతానికి పెంచే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించిందా అని ఆయన ప్రశ్నించారు. అందుకు కేంద్ర మంత్రి సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న"పర్ డ్రాప్ మోర్ క్రాప్ " పథకం కింద చిన్న , సన్నకారు రైతులకు 55!! సబ్సిడీ, ఇతర రైతులకు 45!! సబ్సిడీ అందజేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం పత్తా పొందిన లబ్ధిదారులకు 90!! వరకు సబ్సిడీ అందిస్తారు. ఈ సబ్సిడీ విధానం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా అమలవుతుంది. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైతే అదనపు సబ్సిడీ (టాప్‌అప్ సబ్సిడీ) ఇచ్చి రైతులకు 90!! వరకు సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పిడిఎంసి పథకం కింద ప్రారంభంలో 241.91 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఆ కేటాయింపును 291.91 కోట్లకు పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.ఇంకా మైక్రో ఇరిగేషన్ విస్తరణకు సహాయం చేయడానికి నాబార్డ్ ద్వారా"మైక్రో ఇరిగేషన్ ఫండ్ " ఏర్పాటు చేసినట్లు కూడా కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఫండ్ ద్వారా రాష్ట్రాలు రుణం తీసుకొని అదనపు సబ్సిడీ ఇవ్వడానికి అవకాశం ఉందని వెల్లడించింది. మైక్రో ఇరిగేషన్ విస్తరణ ద్వారా నీటి సంరక్షణతో పాటు రైతుల ఆదాయం పెరగడానికి ఇది ఉపయోగపడుతుందని ఎంపీ మేడా రఘునాథ రెడ్డి పేర్కొన్నారు.

# అమరావతిలో హజ్ హౌస్

>> బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించాను."అని ముఖ్యమంత్రి ప్రకటించారు. **ముస్లింల మనోభావాలను కూటమి ప్రభుత్వం గౌరవిస్తుంది:** "అర్హత కలిగిన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమిస్తున్నాం. వివాహ లైసెన్స్ గడువు 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచాం. 347 మంది ముస్లింలు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నాం. 33,275 మందికి ఆర్థిక చేయూత కింద రూ.193 కోట్లు ఇచ్చాం. యువతకు నైపుణ్యాలు అందించి మెరుగైన ఉపాధి ఉద్యోగాలు దక్కేలా చేస్తున్నాం. గత పాలకులు జీవో 47 ద్వారా వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టారు. ఆ జీవోను రద్దు చేసి వక్ఫ్ బోర్డును పునర్వ్యవస్తీకరణ చేశాం. 1500 వక్ఫ్ ఆస్తులను సర్వే చేశాం. వక్ఫ్ ఆస్తులను కాపాడుతున్నాం. నూర్ బాషా ఫెడరేషన్ పేరును దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పోరేషనుగా మార్పు చేసి రూ.100 కోట్లు కేటాయించాం. గత బడ్జెట్లో మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయిస్తే. ఈసారి రూ.6,090 కోట్లు కేటాయించాం. ఉర్దూ అకాడమీకి గత పాలకులు రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కూటమి ప్రభుత్వంలో రూ.7 కోట్లు మంజూరు చేశాం. అబ్దుల్ హక్ అవార్డు కింద రూ.1 లక్ష నుంచి రూ.1.25 లక్షలు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఉర్దూ ఘర్, షాధీ ఖానాల నిర్మాణానికి రూ.2.85 కోట్లు కేటాయించాం. ముస్లిం జీవన ప్రమాణాలు పెంచేలా చేస్తున్నాం. అన్ని మతాలను గౌరవిస్తా... అందరివాడిలా ఉంటా. పేదలను ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చామన్నారు. ఈ విందులో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు నజీర్, బోండా ఉమ, గద్దె రామ్మోహన్, పలువురు ప్రజా ప్రతినిధులు, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు పేరుతో త్వరలో ప్రత్యేక నాణెం

>> ఆవిష్కరించారు. అమరావతి అభివృద్ధి, అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో చేపట్టబోయే కార్యక్రమాలపై ఏవీ ప్రదర్శించారు. ఒక మనిషి త్యాగం ఒక జాతికి గౌరవంగా నిలిచింది. ఒక దీక్ష ఒక రాష్ట్రాన్ని ఇచ్చింది. పొట్టి శ్రీరాములు గారు మరణం లేని మహనీయుడు, త్యాగానికి మానవరూపం. ఆయన 125వ జయంతి రోజున 58 అడుగుల విగ్రహం రూపంలో మనకోసం మళ్లీ జన్మించారు. ఈ విగ్రహానికి ఏం పేరు పెట్టాలని దూండి రాకేష్ అడిగినప్పుడు, ఆయన త్యాగం గుర్తుకురావాలనే ఉద్దేశంతో ఖిస్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ఖి అని సూచించాను. ఈ విగ్రహం తెలుగుజాతి గొప్పతనాన్ని అమరావతి నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతుంది" అని వివరించారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ వ్యాసాన్ని ఉటంకిస్తూ, "పొట్టి శ్రీరాములు గారి దీక్ష తర్వాతే భారతదేశ చిత్రపటంపై భాషా ప్రయుక్త రాష్ట్రాల రేఖలు ఏర్పడ్డాయని గుహ అన్నారు. అందుకే ఆయనను ఖిభారతదేశ మెర్కాటర్ఖిగా అభివర్ణించారు. 16వ శతాబ్దంలో ప్రపంచ పటాన్ని రూపొందించిన భౌగోళిక శాస్త్రవేత్త మెర్కాటర్. అంతటి గొప్ప వ్యక్తి చరిత్రను దేశం గుర్తుంచుకునేలా ఈ విగ్రహం దోహదపడుతుంది" అని లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి రోశయ్య ను స్మరించుకున్న లోకేశ్, ఆయన రాజకీయాలకు అతీతంగా పనిచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ కోరిక మేరకు పొట్టి శ్రీరాములు పేరు మీద స్మారక నాణెం విడుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని లోకేష్ వెల్లడించారు. రాబోయే 12 నెలల్లో స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పొట్టి శ్రీరాములు ట్రస్ట్ ద్వారా ఎలాంటి లాభాపేక్ష లేకుండా వైద్య సేవలు అందిస్తామని ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ వెల్లడించారు. ఇందుకు పది ఎకరాల స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

# 7 వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు

>> గుల విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన చంద్రబాబు, లోకేశ్‌లకు పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. 'శ్రీరాములు లాంటి వారు 11 మంది ఉంటే చాలు, ఒక ఏడాదిలోనే దేశానికి స్వాతంత్రం తీసుకురాగలను' అని గాంధీజీ అన్నారంటే, ఆయన సంకల్ప బలం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చని కొని యాడారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.




సోమవారం కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఎస్పీ డి.నరసింహ కిషోర్

# నలుగురికి జీవిత ఖైదు

>> చేశారు. పోలీసులు మహిళ అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో అక్టోబర్ 17న చొప్పెల్ల లాకుల సమీపంలో కస్తూరి మృతదేహం గుర్తించినట్లు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి,కేసును హత్య కేసుగా నమోదు చేశారు. దర్యాప్తులో బుర్రిలంక గ్రామానికి చెందిన దేవర యేసు (26), వెలుబుడి ప్రవీణ్ (21), లోకిన జయప్రసాద్ (19) పొట్టిలంక గ్రామానికి చెందిన దాసరి సురేష్ (22)లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్టు వారు అంగీకరించారని ఎస్పీ చెప్పారు. నిందితులు మద్యం సేవించి కస్తూరిని సామూహిక అత్యాచారం చేసి,హత్య చేసి, కాలువలో మృతదేహాన్ని పడేసినట్లు తమ విచారణలో తేలినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ నేతృత్వంలో పోలీసులు నిందితులను అరెస్టు చేసి అక్టోబర్ 30, 2024న జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారన్నారు.తదుపరి ఈ కేసును విచారించిన రాజమండ్రి ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి వై. బెన్నం నాయుడు వాదోపవాదాల అనంతరం సోమవారం నలుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.6,000జరిమానా విధించారని తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వ తరపున ఏపీపీ కే. రాధ కృష్ణ రాజు,దర్యాప్తు అధికారి డీఎస్పీ భవ్య కిషోర్,ఎస్ఐ బి. నాగదుర్గ ప్రసాద్, కోర్టు కానిస్టేబుళ్లు కె. శ్రీని వాస్ తదితరులు పోలీస్‌సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు.

# నందిని సిధారెడ్డికి కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు

>> జరిగిన ఉద్యమంలో తన పాట, సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్యమ కవిగా తెలంగాణ ప్రజల అభిమానాన్ని సిధారెడ్డి చూరగొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే, అత్యున్నత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 ఈసారి ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, నందిని సిద్ధారెడ్డి కి దక్కడం పట్ల, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు.కరోనా సందర్భంగా ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను కవిత్వం ద్వారా హృద్యంగా చిత్రీకరించిన, దీర్ఘ కవితా సంపుటి 'అనిమేష'కు ఈ అవార్డు రావడం గొప్ప విషయమని అన్నారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా, తన సాహిత్యం ద్వారా తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిన తెలంగాణ గర్వించదగ్గ కవి, నందిని సిధారెడ్డి అని కెసిఆర్ కొనియాడారు. ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం యావత్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అత్యున్నత పురస్కారం లభించడం ఈ సందర్భంగా సిధారెడ్డికి తన తరపున, పార్టీ తరపున మనస్ఫూర్తిగా అభినందనలు అంటు కెటిఆర్ తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన శక్తివంతమైన పాటలతో చాటుతూ, తెలంగాణ ఉద్యమానికి ఒక గొప్ప ఊపునిచ్చిన ప్రజా కవిగా ఆయనను అభివ ర్ణించారు.సాహిత్య రంగంలో అత్యున్నత పురస్కారమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును సిధారెడ్డి గెలుచుకోవడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తి త్వాన్ని, సంస్కృతిని తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన ఆయనకు ఈ పురస్కారం దక్కడం సముచితమని అన్నారు.

# గ్యాస్‌ను బ్లాక్ చేస్తే కొరడా

>> ఫరా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, సరఫరా వంటి అంశాలపై పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17,209 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ అందుబాటులో ఉందని ఉన్నతాధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్ పీసీఎల్,బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థలకు చెందిన 1154 ఏజెన్సీల నుంచి గ్యాస్ సరఫరా అవుతోందని అధికారుల వెల్లడించారు. ఈ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు తరలి పోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి వినియోగదారు నుంచి ఓటీపీ తీసుకునే విధానాన్ని అవలంభించడం ద్వారా డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు. 90 శాతానికి పైగా ఓటీపీలతోనే గ్యాస్ సరఫరా చేస్తోందని అధికారులు తెలిపారు. ఓటీపీల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే... స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుంటూ..ఆర్టీజీఎస్ నుంచి సాంకేతిక సాయాన్ని ఆయా గ్యాస్ సరఫరా కంపెనీలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు.

**కీలక వ్యవస్థలకు ఇబ్బంది కలగకూడదు:** కొన్ని కీలక వ్యవస్థలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అన్నక్యాంటీన్లకు గ్యాస్ సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 సెంట్రల్లీ కిచెన్ల ద్వారా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా జరుగుతోందని వాటికి ఎలాంటి ఇబ్బందుల్లేవని అధికారులు చెప్పారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో మానిటర్ చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో పాటు ఆస్పత్రులు, స్కూళ్లు, దేవాలయాలు వంటి వాటిల్లో రోజు వారీ కార్యకలాపాలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

## టెన్త్ పరీక్షలు ప్రారంభం

>> కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు.మాల్ ప్రాక్టీస్ జరగకుండా 156 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియ మించారు. హాల్ టికెట్ చూపి విద్యార్థులు ఉచి తంగా ఆర్టీసీలో ప్రయాణించే అవకాశం కల్పిం చారు.పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావ రణంలో మొదలయ్యాయి. నేటి నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. నిర్దేశించిన సమయం కంటే ముందే విద్యార్థులు,వారికి తోడుగా తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చారు. సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాత ఒక్కరిని పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించారు. ఈ పరీక్షలకు బాలురు 3,28,652 మంది, బాలికలు 3,12,264 మంది హాజరుకావాల్సి ఉంది. తొలిరోజు ఎంత మంది పరీక్షలకు హాజరయ్యారనేఅంశంపై వివరాలే వెల్లడికావాల్సి ఉంది.

## సిట్ కస్టడీలో అవినాశ్ రెడ్డి

>> అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. ఈ విచారణ రెండు రోజుల పాటు కొనసాగనుంది. రేపు, ఎల్లుండి కూడా ముప్పిడి అవినాశ్‌రెడ్డిని ప్రశ్నించనున్నారు. ఆయన నుంచి మరిన్ని కీలక వివరాలు రాబట్టాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఈ కేసులో ముప్పిడి అవినాశ్‌రెడ్డి ఏ7 నిందితుడిగా ఉన్నారు. మద్యం ముడుపుల వ్యవహారంలో అతను కీలక పాత్ర పోషించినట్లు సిట్ విచారణలో బయటపడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అక్రమంగా వచ్చిన డబ్బును షెల్ కంపెనీల ద్వారా తరలించడం, లావాదేవీలు నిర్వహించడం వంటి కార్యకలాపాల్లో అతని పాత్ర ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం వ్యాపారంలో వచ్చిన ముడుపులను వివిధ మార్గాల్లో తరలించేందుకు ప్రత్యేకంగా కొన్ని కంపెనీలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

## 'అన్‌లైన్ సమస్యను పరిష్కరించండి'

**విజయవాడ, మార్చి 16, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచితంగా 25శాతం సీట్లకు ధరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ ఇబ్బందులు పరిష్కరించాలని దిపేరెంట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షులు మలిరెడ్డి కోటిరెడ్డి మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేసారు.

## వారం - వర్జ్యం

17-03-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
త్రయోదశి ఉ.9.21
ధనిష్ఠ ఉ.6.12
వర్జ్యం : మ.12.36-మ.2.13
దు.ఉ.8.40-9.28, 2)రా.11.08-11.56
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ప్రజా సంబంధాలు వృద్ధి చేసుకోవటానికి విశేషంగా కృషి చేస్తారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**వృషభం:** సన్నిహితులు, నిపుణులతో సంప్రదించకుండా ఏ ముఖ్య కార్యక్రమాన్నీ అమలుచేయకండి. గృహం కొనుగోలు యత్నాలు.

**మిథునం:** వివాహాది శుభకార్యాలలో మీ అభిప్రాయాలను, మీ సన్నిహితులు సమర్థించరు. కుటుంబ సభ్యులతో భేదాభిప్రాయాలు వస్తాయి.

**కర్కాటకం:** సంగీత, సాహిత్య కళారంగాలలో ప్రత్యేక అభిరుచి కనబరుస్తారు. ఉద్యోగంలో ప్రమోషన్లు వచ్చే సూచనలు.వాహన సౌఖ్యం.

**సింహం:** కనుమరుగైన కొన్ని సెంటిమెంట్ వస్తువులు దరికిచేరతాయి. చెప్పదగిన సూచన. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** ఎవ్వరినీ తక్కువగా అంచనా వేయకండి. మితిమీరిన ఆత్మవిశ్వాసం మంచిదికాదు. ప్రముఖుల కలయిక.

**తుల :** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారంలో మీ స్థాయి పెరుగుతుంది. వస్త్రలాభం కలదు.

**వృశ్చికం:** సోదరులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు ఆదిలోనే తృంచివేయండి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**ధనుస్సు:** విలాస వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు. చాకచక్యంగా కొన్ని వ్యవహారాలను చక్కదిద్దుకుంటారు.

**మకరం:** ముఖ్యమైన విషయాలలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దల సలహాలు పాటించడం అన్ని విధాలా మంచిది.శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం ఎంతైన కలదు.

**మీనం:** సులువుగా అవుతుందనుకున్న ఒక పని వాయిదా పడుతుంది. జీవిత భాగస్వామి సలహాలు పాటిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

17-03Pg3exHMNWJQERP.qxd:17-03Pg3exHMNWJQERP.qxd 1/1/02 6:55 AM Page 1



## టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన మాజీ సిఎం జగన్

**విజయవాడ,మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షలు నేడు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు వైసీపీ అధినేత జగన్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ స్పందిస్తూ, విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్తు అని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో ఉండాలని, తమపై తాము నమ్మకం ఉంచి కష్ట పడితే కచ్చితంగా విజయం లభిస్తుందన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ సభలో సవిత

## పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం : మంత్రి సవిత

**విజయవాడ,మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి:** అమరజీవి ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహం ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత కొనియాడారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరులో సోమవారం నిర్వహించిన అమరజీవి పొట్టి శ్రీరాముల 58 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ సభలో ఆమె మాట్లాడారు. పొట్టి శ్రీరాముల ఆత్మార్పణ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావించిందన్నారు. నేటి తెలుగు ప్రజల ఉనికి పొట్టి శ్రీరాముల పోరాటంతోనే సాధ్యమైందన్నారు. పొట్టి శ్రీరాముల త్యాగం భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్న లక్ష్యంతోనే భారీ విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిన అభినందనీయమన్నారు. విగ్రహం ఏర్పాటు చేసిన అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులను మంత్రి సవిత అభినందించారు. పొట్టి శ్రీరాముల భారీ విగ్రహం భావి తరాలకు ఎంతో స్ఫూర్తిని ఇస్తుందన్నారు. అమరజీవ తరవాత తెలుగు వారి సత్తాను ఢిల్లీ చాటిన ఘనత ఎన్న ఎన్టీఆర్ దన్నారు. పొట్టి శ్రీరాముల ఆశయ సాధన, ఎన్టీఆర్ స్ఫూర్తితో ఆంధ్రుల రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఆయన రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. దేశంలోనే ఏపీని నెంబర్ వన్ గా నిలబెట్టడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

# కాంట్రాక్టర్లకు దోచి పెట్టేలా మోడీ కొత్త చట్టం

## ప్రధాని తెచ్చిన రామ్ జీ చట్టంతో గ్రామ స్వరాజ్యం వినాశనం :పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**ఆముదాలవలస/రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), మార్చి 16 ప్రభాతవార్త :** మోడీ తెచ్చిన గ్రామజీ చట్టంతో గ్రామ స్వరాజ్యం వినాశనం చేస్తోందని, ఈ చట్టం కాంట్రాక్టర్లకు దోచి పెట్టేలా మోడీ కొత్త చట్టం చేశారని రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి అన్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలంలోని కొర్లకోట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాటా మంతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ 125 రోజులు పని కల్పన పచ్చి అబద్ధమని సగటున 52 రోజులు పని కల్పించలేకపోయారని అన్నారు. గ్రామాలకు హాని చేసే చట్టానికి చంద్రబాబు, పవన్ మద్దతు తెలపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. రాష్ట్ర హక్కులపై మోడీ కాలర్ పట్టుకుంటా అని చెప్పిన జగన్ మోదీకి బానిసగా మారారని అన్నారు. ముగ్గురు కలిసి ఆంధ్ర రాష్ట్ర ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే మన్రేగా చట్టాన్ని పునరుద్ధరిస్తాం. 150 రోజులకు పని దినాలను పెంచుతామని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ నిర్వీర్యం చేసిందని, గాంధీ పేరు తొలగించడం దారుణమన్నారు. పేద ప్రజల పొట్టగొట్టే చట్టం మన్రేగా చట్టానికి గ్రామ్ జి చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని అన్నారు. మన్రేగా చట్టం కింద పనుల నిర్ణయాధికారం గ్రామసభలది, మోడీ తెచ్చిన



కొత్తచట్టంలో పనులు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గ్రామాల్లో ఏం పనులు చేయాలో ఢిల్లీలో కూర్చున్న వాళ్లకు ఏం తెలుస్తుందని అన్నారు. 40 శాతం నిధులు రాష్ట్రంపై మోపడం ఏపీ భరిస్తుందా, గ్రామ్ జి చట్టం రాష్ట్రానికి 5 వేల కోట్ల భారం గ్రామ్ జి చట్టంతో రాష్ట్రంపై భారం పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గం అని అన్నారు. ఇప్పటికే రాష్ట్రం 12 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అప్పుల రాష్ట్రంలో ఉపాధికి 5 వేల కోట్లు కేటాయిస్తారా అని ప్రశ్నించారు. చట్టానికి మద్దతు ఇచ్చి మోడీ దగ్గర నిధులు ఇవ్వాలని ఎందుకు దేహి అంటున్నారని మండిపడ్డారు. మోదీ చట్టానికి జగన్ సైతం వ్యతిరేకించడం లేదని,జగన్ సైతం మోదీకి బానిస, కీలు బొమ్మగా మారారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలు మోదీకి గులాం గిరి చేసే పార్టీలగా తయారయ్యారని అన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే మార్పు వస్తుందని,కాంగ్రెస్ అధికారంలో వస్తే రాష్ట్రం బాగుపడుతుంది కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రంలో సువర్ణ అధ్యాయం మొదలు అవుతుందని పిసిసి అధ్యక్షురాలు షర్మిల అన్నారు. వైయస్సార్ హయాంలో ఆనాడు రాష్ట్రంలో 1.10 కోట్ల కార్డులు ఉండేవని, గడిచిన 5 ఏళ్లలో 50 లక్షల కార్డులు తొలగించారని షర్మిల అన్నారు. గ్రామ్ జి చట్టం పేదల పొట్ట కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపుతుందని అన్నారు. 80 వేల కోట్లను మోదీ తరుపు బడా కాంట్రాక్టర్లకు దోచి పెట్టేలా కొత్త చట్టం ఉందని తెలిపారు. పని గంటలు 12 గంటలకు పెంచడం దారుణం అని అన్నారు. మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామ్ జి చట్టం రద్దు చేసేవరకు కాంగ్రెస్ ఉద్యమం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, మాజీ కేంద్రమంత్రి జెడి శీలం, జిల్లా డిసిసి అధ్యక్షులు సనపల అన్నారావు, పేడాడ పరమేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, బసవ షణ్ముఖరావు, బొత్స రమణ, జిల్లా నాయకులు, మండల నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## విజయవాడలో హోటళ్లపై వంట గ్యాస్ ప్రభావం

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని స్టార్‌హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, అల్పాహార హోటళ్లు, క్రీపాయింట్లపై వంట గ్యాస్ ప్రభావం ఎక్కువగా ఉంది. చిన్న హోటళ్లు , బండ్లపై వ్యాపారం చేసేవాళ్లు ముందస్తుగా వారం రోజులకు సరిపడా గ్యాస్‌ను ఉంచుకుంటారు. ఆదివారానికి ఈ గ్యాస్ అయిపోవడంతో కొరత ప్రభావం స్పష్టంగా కనిపించింది. చాలామంది చిరు వ్యాపారులు ఆదివారం దుకాణాలు మూసేశారు. తెరిచినవాళ్లు కూడా పదార్థాలను తగ్గించేశారు. బ్లాక్‌మార్కెట్‌లోనూ గ్యాస్ సిలిండర్లు దొరక్కపోవడంతో సోమవారం నుంచి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారబోతోంది. స్టార్, పెద్ద హోటళ్లలోనూ ఆహార పదార్థాల సంఖ్యను తగ్గించేయడంతో స్విగ్గీ జొమాటో లాంటి ఫుడ్ డెలివరీ సంస్థల ద్వారా జరిగే వ్యాపారంపైనా ప్రభావం పడింది. విజయవాడలోని స్టార్ హోటళ్లపై గ్యాస్ కొరత ప్రభావం స్పష్టంగా పడింది. ఇప్పటికే ప్రభుత్వ సూచనల మేరకు బఫే మెనూలోని ఆహార పదార్థాల సంఖ్యను కుదిస్తున్నారు. ఇప్పటివరకూ 45 రకాలకు పైగా మెనూలో ఉండగా ప్రస్తుతం 15కు తగ్గించారు.

చికెన్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, కొన్నిరకాల మాంసాహార, శాకాహార కూరలు, రోటీలు ఇలాంటి వాటితోనే మెనూ సిద్ధం చేస్తున్నారు. యుద్ధం ప్రభావం తగ్గేవరకూ ఇదే పరిస్థితి ఉంటుందనే బోర్డులు కూడా త్వరలో పెట్టబోతున్నారు.



## రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే రాజధాని నిర్మాణం

### - మంత్రి పి.నారాయణ

**విజయవాడ,మార్చి 16,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు ఇచ్చిన మాట ప్రకారమే రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో హెచ్ఓడీ (బీవీడీ) టవర్ల నిర్మాణంలో కీలక ఘట్టం చోటు చేసుకుంది. టవర్ 1కు మొదటి స్టీల్ డయాగ్రిడ్‌ను అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రారంభించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అమరావతిలో జీఏడీ, హెచ్ఓడీలకు మొత్తం 5 టవర్లు డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మిస్తున్నామని తెలిపారు. జీఏడీ టవర్ మొత్తం 47 అంతస్తులతో మిగిలిన టవర్లు 40 అంతస్తులతో నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. మొత్తం 53 లక్షల చదరపు అడుగు బిల్ట్ ఏరియాతో ఈ ఐదు టవర్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. అధికార యంత్రాంగం మొత్తం ఒకేచోట ఉండేలా ఈ టవర్ల నిర్మాణం ప్లాన్ చేశామన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఒకే చోట అన్ని కార్యాలయాలు ఉండేలా డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. 2028 అక్టోబర్ నాటికి అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ ప్రకటించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని తెలిపారు. ట్రంక్ రోడ్లు, లేఅవుట్ రోడ్లతోపాటు ప్రైవేట్ సంస్థల నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయన్నారు. రాజధాని అమరావతిలో డయాగ్రిడ్ విధానంలో ఐదు ఐకానిక్ భవనాలనుప్రభుత్వంనిర్మిస్తుంది.

### కేంద్రం పరిశీలనలో విశాఖ మెట్రో ప్రాజెక్టు :మంత్రి

విశాఖ నగరాభివృద్ధి హడ్కో సహకారం కీలకమని మంత్రి నారాయణ అన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదాయ మార్గాలను అన్వేషిస్తామన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్టును కేంద్రం పరిశీలిస్తోందని చెప్పారు. విశాఖ మెట్రోను రైడర్స్ సంస్థ అధ్యయనం చేస్తోందని, రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. హైదరాబాద్ ఓఆర్‌ఆర్‌లా విశాఖకు సెమీ రింగ్‌రోడ్డు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

రాంబిల్లి–భోగాపురం ప్రాజెక్టును వీఎంఆర్‌డీయే పరిశీలిస్తోందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఒక రోడ్డుకు అటవీ భూమి అడ్డంకిగా ఉందని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తాను మాట్లాడి సమస్యను పరిష్కరించామని నారాయణ తెలిపారు.

## భక్తులకు విశ్రాంతి గృహాల్లో మరిన్ని సౌకర్యాలు

### - అదనంగా దుప్పటి, దిండ్లు, చాపలు అద్దెకు..

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి దర్శనార్థం వస్తున్న లక్షమంది భక్తులకు వసతి సౌకర్యంకల్పించలేకపోతున్నా...యాత్రికుల వసతి సముదాయాల్లో డార్మిటరీలు,విశ్రాంతి హాళ్ళు బసచేసేందుకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడ భక్తులు తమతో తెచ్చుకున్న దుప్పట్లు, చాపలను హాళ్ళలో క్రిందవేసుకుని విశ్రాంతి తీసుకోవడం, బసచేయడం చేస్తున్నారు. అలా తెచ్చుకోలేని యాత్రికులకోసం టిటిడినే స్వయంగా అవసరమైన సౌకర్యాలను కల్పిస్తుంది. ఇందుకు నామమాత్రపు అద్దె చెల్లిస్తే యాత్రికులకు అందిస్తున్నారు. విశ్రాంతి గృహాల్లో, కాటేజీల్లో గదులు దొరికిన భక్తులు కూడా అదనంగా దుప్పటి, దిండ్లు, చాపలు అవసరమైతే అదే విశ్రాంతి భవనాల్లో అద్దెకు తీసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. తిరుమలలో ఇప్పటికే నందకం విశ్రాంతి భవనంలో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. యాత్రికుల నుండి స్పందన ,ఆదరణ రావడంతో దీన్ని మరికొన్ని వసతి,విశ్రాంతి గృహాల్లో సేవలను విస్తరించాలని టిటిడి అధికారులు ఆలోచన. తిరుమలలో 7,500వరకు గదులు భక్తులకు అందు బాటులో ఉన్నాయి. వీటిల్లో వెయ్యి వరకు పద్మావతి విచారణ కార్యాలయం పరిధిలో ఉంటే మిగిలినవి ఎంబిసి, సిఆర్ఒ,సిఆర్ఒ జనరల్, టిబి కౌంటర్లలో గదులు కేటాయిస్తుంటారు.



తిరుమలకు వచ్చిన భక్తు లకు వసతి గృహాల్లో ,కాటేజీ గదుల్లో దిండు,దుప్పటి, చాప,బెడ్‌షీట్లు అవసరమనుకుంటే అద్దెకు అందించేందుకు టిటిడి చర్యలు చేపట్టింది. ప్రస్తుతం నందకం విశ్రాంతి భవనంలో ఈ సౌకర్యం అమలవుతోంది. రోజుకు దుప్పటికి 10రూపాయలు, రెండు దిండ్లుకు10 రూపాయలు, చాపకు 10 రూపాయలు, బెడ్‌షీట్‌కు 20రూపాయలు చెల్లించి తీసుకునే వెసలూ బాటు ఉంది. భక్తుల నుండి విశేష ఆదరణ వస్తుండ టంతో దీన్ని వకుళమాత, పాంచ జన్యం, కౌస్తుభం తదితర విశ్రాంతి భవనాల్లో కూడా ఈ సేవలను అందు బాటులోకి తీసుకు రావా లని టిటిడి అధికారుల ఆలోచన. దీనివల్ల గదుల్లో ఒక బృందంగా వచ్చిన అదనపు భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే తిరుమలలో చాలావరకు సామాన్య భక్తులు బసచేసే కాటేజీల్లోనూ వేడినీటి సదు పాయం కూడా ఉంది. నెలవారీగా 23లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తుండగా వీరిలో అత్యధికశాతం సామ్యాభక్తులే కావడం విశేషం.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

**వింజమూరు (నెల్లూరు), మార్చి 16, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఇందిరానగర్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు వింజమూరులోని ఎర్రబల్లిపాలెంకు చెందిన మూలి జనార్ధన్‌రెడ్డి సోమవారం ఉదయగిరికి కోర్టు పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఇందిరానగర్ సమీపానికి రాగానే బైకు అదుపు తప్పి కింద పడటంతో తలకు బలమైన గాయం కావడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చేజర్ల గ్రామానికి చెందిన వాడిని వింజమూరులో నివాసం చేసుకుని ఇక్కడే కాపురం ఉంటున్నారన్నారు. హైదరాబాద్‌లో వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకుంటూ ఉండేవాడిని కోర్టు నిమిత్తమై రావాల్సి వచ్చి ఈ ప్రమాదానికి గురైనట్లు వారు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కలిగిరి వెంకట నారాయణ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సమాచారాన్ని సేకరించారు.

## యుద్ధ ప్రభావంతో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం!

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిది:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వినియోగంపై కూడా పడుతోంది. వంట గ్యాస్ వినియోగాన్ని తగ్గిస్తూ చాలా మంది ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. మార్చి 7న రికార్డు స్థాయిలో 274.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ వినియోగం 9.15 శాతం అధికంగా ఉంది. మార్చి 12,13,14 తేదీల్లో వరుసగా సుమారు 272 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో పాటు యుద్ధ ప్రభావం కూడా విద్యుత్ డిమాండ్ పెరగడానికి కారణమవుతోంది. ముఖ్యంగా ఉదయం 8 నుంచి 12 గంటల మధ్య విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. గత ఐదేళ్లలో వేసవి కాలంలో గరిష్ట విద్యుత్ వినియోగం 256 మిలియన్ యూనిట్లుగా ఉండగా ఈ ఏడాది మే నాటికి అది 280 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అంచనా వేస్తోంది. అయితే మార్చి నెల సగం పూర్తికాకముందే వినియోగం 274 మిలియన్ యూనిట్లను దాటడం అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇదే ట్రెండ్ కొనసాగితే మే నాటికి విద్యుత్ వినియోగం 300 మిలియన్ యూనిట్లకు చేరినా ఆశ్చర్యపోనక్కరలేదని అధికారులు చెబుతున్నారు.

## డ్రైవర్ సుబ్రమ్మాణ్యం హత్య కేసు..

### సిట్ విచారణకు హాజరైన అనంతబాబు భార్య

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గ సిట్ విచారణకు హాజరయ్యారు. ఈ కేసు విచారణాధికారిగా వ్యవహరిస్తున్న ఎస్‌డీపీవో మనీశ్ పాటిల్ దేవరాజ్ కార్యాలయంలో ఆమెను విచారిస్తున్నారు. తమ దగ్గర డ్రైవర్‌గా పనిచేసి, మానేసిన సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన కేసులో అనంతబాబుతో పాటు లక్ష్మీదుర్గ పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు ఇటీవలి విచారణలో గుర్తించారు. ఆమెను ఏ2గా చేర్చి రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ వేశారు. కోర్టు ఆమెపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. దీనిని కొట్టేయాలని లక్ష్మీదుర్గ హైకోర్టును ఆశ్రయించగా ఈ నెల 16 నుంచి 30 వరకు సిట్ ఎదుట, 30న రాజమహేంద్రవరం కోర్టులో విచారణకు హాజరవ్వాలని తీర్పునిచ్చింది.

దీంతో ఇన్నాళ్లూ అజ్ఞాతంలో ఉన్న ఎమ్మెల్సీ భార్య సోమవారం ప్రత్యేక దర్యాప్తు బృందం ముందుకు వచ్చారు. 2022 మే 19న రాత్రి సుబ్రహ్మణ్యం హత్య జరిగిన సమయంలో లక్ష్మీదుర్గ అక్కడే ఉన్నట్లు, తర్వాత భర్తతో కలిసి కారులో తమన నివాసానికి వచ్చినట్లు సీసీ టీవీ ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. ఫోరెన్సిక్ నివేదికల్లోనూ ఆమె పాత్రను స్పష్టంగా పేర్కొన్నారు. హత్య జరిగిన రోజున తాను లేనని ఆసుపత్రిలో బంధువుల పరామర్శకు వెళ్లాలని గతంలో పోలీసులకు ఆమో వాంగ్మూలమిచ్చారు.

అవీన్న అబద్దాలేనని సాంకేతిక ఆధారాలతో తేల్చారు. వీటిపైనే తొలిరోజు విచారణ కొనసాగే అవకాశముంది.

## రాష్ట్రంలో గృహావసరాలకు గ్యాస్ కొరత లేదు

**సచివాలయం,మార్చి 16,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సి న పరిస్థితి లేదని,పుకార్లు నమ్మి గ్యాస్ బుకింగ్‌ల కోసం ఏజెన్సీల వద్ద క్యూలు కట్టవద్దని రోజువారి సగటు కంటే ఎక్కువ గ్యాస్ సిలిండర్లు గృహ వినియోగదారులకు అందిస్తున్నామని పౌర సరఫరాలు ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశం వివరాలను మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలోని ప్రచార విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## స్వామివారి దర్శనంతో సకలశుభాలు

### - బిసివై అధ్యక్షుడు రామచంద్రయాదవ్

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని బిసివై రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామ చంద్రయాదవ్ తెలిపారు. స్వామివారి దర్శనం భక్తులకు మంచిగా జరుగు తోందని అన్నారు. స్వామివారి అను గ్రహంతోనే అంతా మంచి జరుగు తుందని ఆకాంక్షించారు.



సోమవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో కుటుంబసభ్యులతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జూన్ నెల దర్శన కోటా రేపు ఆన్‌లైన్‌లో విడుదల

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆర్జితసేవల దర్శనాల ఆన్‌లైన్ కోటా 18వతేదీ బుధవారం ఉదయం టిటిడి విడుదల చేయనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. రానున్న జూన్ నెలకు సంబంధించి వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచనుంది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ కు సంబంధించిన జూన్ నెల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం మార్చి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన భక్తులు మార్చి 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవు తాయి. ఇక ఆర్జిత సేవా టికెట్ల విడుదల కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, జ్యేష్ఠాభిషేకం టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవల కోటా విడుదల వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగ ప్రదక్షి ణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది.శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 24న ఉదయం 10 గంటలకుప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా (300రూపాయలవి)విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.భక్తులు "టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి.ఇన్" వెబ్‌సైట్ ద్వారానే ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి :జడ్జి వీరేందర్‌సింగ్

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై కలగాలని వేడుకున్నట్లు జార్ఖండ్ పూర్వ న్యాయమూర్తి జస్టిస్ వీరేందర్‌సింగ్ తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన



సమయంలో టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఈ జన్మలో ఇదో గొప్పమహద్భాగ్యం

### - తిరుమలేశునికి పరదాలు వితరణ చేస్తున్న శంకర్

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతి నిధి:** సాక్షాత్తు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి తనకు ఇచ్చిన అపూర్వ అవకాశం. మహద్భాగ్యం స్వామివారికి పరదాలు వితరణ చేయడమని దాత శంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తిరుపతికి చెందిన శంకర్ టైలర్.స్వయంగా ఆయనే స్వామివారికి పరదాలు కుట్టి సిద్ధం చేస్తారు. ప్రతి ఏటా ఆలయంలో నాలుగుసార్లు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తరువాత ఈ పరదాలను అందజేస్తారు. ఈ పరదాలను ఆనంద నిలయంలోని బంగారువాకిలిలో, కులశేఖరపడి ద్వారంకు, రాములవారిమేడకు,



శయనమండపం ఇలా పరదాలు ఆధ్యాత్మిక భావంతో కూడుకున్నట్లు తయారుచేస్తాడు. ఆలయంలో నాలుగుసార్లు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రోజు వాటిని తిరుమల ఆలయ అధికారులకు అందజేస్తాడు. గత 28సంవత్సరాలుగా ఆ దేవదేవుడు తనకు ఇచ్చిన ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాడు. నేడు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా సోమవారం తిరుమలకు తీసుకువచ్చాడు.

## గోవిందరాజస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరు పతి గోవిందరాజస్వామి ఆలయంలో 19వ తేదీ ఉగాది ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించు కుని సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తరువాత ఉదయం 7 గంటలనుండి 9 గంటల వరకు గోవిందరాజ స్వామి సన్నిధి, పార్థసారథి స్వామి సన్నిధి, ఆండాల్ అమ్మవారు, కల్యాణ వేంకటేశ్వరస్వామి,



పుండరికవల్లీ ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఉదయం 9.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, అర్చక బృందం పాల్గొన్నారు.

## శ్రీవారి ఆశీస్సులతో సంతోషం

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకోవడం సంతోషంగా ఉందని తమిళసినీనటుడు శశికుమార్ తెలిపారు.సోమవారం ఉదయంశ్రీవారి ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి విఐపి బ్రేక్‌లో స్వామివారి దర్శనం చేయించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఎన్‌హెచ్‌ఏఐ ఫాస్టాగ్ వార్షిక పాస్ ఫీజు పెంపు

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీ రహదారులపై ప్రయాణించే వాహనదారుల ఫాస్టాగ్ వార్షిక పాస్ ఫీజును రూ.3వేల నుంచి రూ.3075 కు పెంచుతున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికర సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేది నుంచి కొత్త ఫీజు అమల్లోకి రానుంది. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో మొత్తం 1150 రాష్ట్ర పరిధిలో ఉన్న 35 టోల్‌ప్లాజాలకు ఈ ఫీజు పెంపు వర్తిస్తుంది. ఫాస్టాగ్ తరచూ రీచార్జి చేసుకునే ఇబ్బంది లేకుండా గతేడాది ఆగస్టు 2025 నుంచి వార్షిక ఫీజు పథకాన్ని ఎన్‌హెచ్‌ఏఐ తీసుకొచ్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ పథకంలో 56 లక్షల మంది వినియోగదారులున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ చిట్ టెండరు నోటీసు
సంఖ్య: 687/2025-26, తేది: 12.03.2026
శ్రీకాకుళం జిల్లాలో ఒక పనికి అంచనా విలువ: రూ.9.00 లక్షలకు అర్హత గల గుత్తేదారుల నుండి టెండర్లు కోరబడుచున్నవి. గ్రాంట్: ZP. టెండరు డాక్యుమెంట్ స్వీకరించు తేది: 16.03.2026 ఉ.11.00గం.ల నుండి 30.03.2026, మ.3.00గం.ల వరకు. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్ నెం. 9100120666.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పా.శాఖ, డివిజన్ కార్యాలయం, శ్రీకాకుళం.
DIPR.NO. 19363/CL/ADVT/1/1/2022-23 తేది: 16.03.2026

# ఎన్నికలు రాజకీయాల వరకే.. అభివృద్ధిపై దృష్టి పెడదాం

## • ధర్మవరం మున్సిపల్ కౌన్సిల్‌లో మంత్రి సత్యకుమార్



ధర్మవరం మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బందితో మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, మార్చి 16 ప్రభాతవార్త: ధర్మవరం మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ చివరి సమావేశానికి రాష్ట్రమంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పట్టణ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై కౌన్సిల్ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమని, అయితే మిగిలిన సమయంలో ప్రజల అభివృద్ధి కోసం అన్ని పార్టీల కౌన్సిల్ సభ్యులు కలిసి పనిచేయాలని మంత్రి సూచించారు. రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా ధర్మవరం ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రజలకు స్థిరమైన నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పలు కీలక ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ సిటీస్ మిషన్, అమృత్ మిషన్ పథకాల ద్వారా మున్సిపాలిటీల అభివృద్ధికి సుమారు రూ.4,000 కోట్ల నిధులు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ నిధులతో పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో గతంలో సరైన రహదారులు లేకపోవడం, విద్యుత్ స్తంభాల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉండేవని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కొత్త రహదారులు నిర్మించడం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి పనులను మున్సిపల్ కౌన్సిల్ ద్వారా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడానికి సుమారు రూ.110 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో కొత్త ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. దీని వల్ల వోల్టేజ్ సమస్యలు తగ్గి తాగునీటి సరఫరా వ్యవస్థ కూడా మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని వెల్లడించారు. రవాణా, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేతు బంధన్ స్కీమ్ పథకం కింద మంజూరు చేసిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహారాన్ని దశలవారీగా పంపిణీ చేయడం ద్వారా కోర్టు వివాదాలను పరిష్కరించామని చెప్పారు. పట్టణంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులతో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ వ్యవస్థను ఆధునీకరించామని మంత్రి తెలిపారు. అలాగే పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయిన సుమారు 8 లక్షల టన్నుల చెత్తను తొలగించి పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ధర్మవరం పట్టణానికి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను తీసుకువచ్చామని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా రేగటిపల్లెలో ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేయించడం ద్వారా ఈ ప్రాంతాన్ని విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు కూడా పన్నులు చెల్లిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# 'గోలు అండ్ పప్పా ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవ్వరి హోమ్'

# పుస్తకం ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు



విజయవాడ, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో "గోలు అండ్ పప్పా ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్" అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) గురించి అందరికీ అర్థమయ్యేలా కథల రూపంలో చక్కగా వివరించినందుకు పుస్తక రచయిత డాక్టర్ జావేద్ అష్రఫ్‌ను చంద్రబాబు అభినందించారు. న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఇంటాబయట ప్రమాదాలు లేదా ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిపుణుడైన డాక్టర్ దగ్గరకు లేదా ఆసుపత్రికి తీసుకెళ్లేదాక పేషంటును రక్షించడానికి అవసరమైన ప్రథమ చికిత్సను కథల రూపంలో పిల్లలకు వివరించడం చాలా బాగుందన్నారు. ఈ పుస్తకం ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరి దగ్గర ఉండవలసిన పుస్తకమని అన్నారు. ఈ పుస్తకం చదివిన వారిలో ఆత్మ విశ్వాసం పెరిగి ఇంటి వారిని బయటివారిని రక్షించడానికి ముందుకు వస్తారన్నారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ జావేద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నవైపోయాయని, ఏదైనా జరిగితే ఆదుకునే వాళ్లు కరువైనారని, అలాగే సరైన అవగాహనలేనందువల్ల దారిలో ఎవరైనా పడిపోతే ఏమిచేయాలో తెలియక చాలా మంది ప్రేక్షకులుగా ఉండిపోతున్నారని అన్నారు. అందువల్ల ప్రజల్లో ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెంపొదించి వారు అవసరమైనపుడు తమ వాళ్లకు, ఇతరులకు సహాయపడేలా చూడాలనే ఉద్దేశ్యంతోనే తాను అందరికీ అర్థమయ్యేలా కథల రూపంలో ప్రథమ చికిత్సపై ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందని పేర్కొన్నారు. తన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రోత్సహించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి ఫరూక్‌లకు డాక్టర్ జావేద్ కృతజ్ఞతలు తెలిపారు.

# విమానాశ్రయం కోసం రైతుల భూములు ఆక్రమించుకుంటారా!

## - కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో విమానాశ్రయం కోసం రైతుల నుండి భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకోవడం పద్ధతికాదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌బాబు, చిత్తూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కిరాయల్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం డిసిసి అధ్యక్షులు రమేష్‌బాబు అధ్వర్యంలో సోమవారం కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తంచేశారు. రైతుల నుండి భూములను బలవంతంగా తీసుకోవడంతో ఓ రైతు ఆత్మాహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన రైతు కుటుంబంను ప్రభుత్వం ఆదుకోవాలని, అతని వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. రైతుల భూములకు బదులుగా ఇతర భూములు ఇవ్వాలని, లేకుంటే భూములకు ధర నిర్ణయించి చెల్లించాలన్నారు. అనంతరం డిసిసి అధ్యక్షులు రమేష్‌బాబు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కిరాయల్‌లు జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్‌ను కలిసి కుప్పంలో విమానాశ్రయం నిర్మించడానికి జరిగే భూసేకరణ వివరాలను వివరించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన రైతు కుటుంబంను వారం రోజుల్లో కలిసి వారికి సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ ఆవుల గోపి, పూతలపట్టు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ప్రభాకర్, నగరి నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కార్తీక్, చిత్తూరు నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మధురాయల్, ఉదయ్‌కుమార్‌లు, మాజీ డిసిసి ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, పూతలపట్టు మహిళా కాంగ్రెస్ నాయకురాలు కుమారి తదితరులు పాల్గొన్నారు.





# అదనపు ఆదాయం వైపు రైతులను మళ్లించాలి

## • వ్యవసాయ సహాయకులకు జిల్లా కలెక్టర్ పిలుపు • కొట్టాలపల్లిలో రైతన్నా మీ కోసం నిర్వహణ

## • అన్నదాతలతో కలెక్టర్ ఆనంద్ ముఖాముఖీ • రైతులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్ ఆనంద్

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో: ప్రభుత్వం నుంచి రైతన్నకు సమగ్ర ప్రోత్సాహం అందించడం జరుగుతోందని, రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, కార్యక్రమంలో రైతులకు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, అన్ని విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసమే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఈనెల 16, 17, 18, 23, 24, 25వ తేదీలలో ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో పెద్దగా నీరులేదని, వరికాకుండా వేరే ఇతర పంట ఏదైనా పండించగలుగుతారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంతవరకు కొత్త పంటలు సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటలు సాగు చేస్తే ప్రభుత్వం నుంచి మైక్రో ఇరిగేషన్ ఏర్పాటు ఇతర రకాల సహకారం అందిస్తామన్నారు. రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్‌ఎం, పిఎంఈజీపి లాంటి పథకాలు అమలు చేస్తోందని, ఇందులో 35 శాతం సబ్సిడీ పోగా, 10 శాతం రైతు వాటా చెల్లించాల్సి ఉంటుందని, మిగిలినది రుణం తీసుకోవచ్చన్నారు. రైతులు వాల్యూ అడిషన్ యూనిట్ పెట్టేందుకు ముందుకు రావాలన్నారు. రైతులను వాల్యూ అడిషన్ వైపు మరల్చాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు. ఏపీఏఐఎంఎస్ అగ్రి యాప్ ను రైతుల మొబైల్ లో డౌన్లోడ్ చేయించగా, ఎలా వాడాలి అర్థం కావడం లేదని, రైతులకు డెమోన్‌స్ట్రేషన్ చేయించాలన్నారు. యాప్ లో రైతులకు కావాల్సిన సలహాలు, సూచనలు, పథకాలు, సాంకేతిక విషయాలు అన్నీ ఉంటాయని, యాప్ ను ఉపయోగించేలా చూడాలని, రైతులకు అన్ని విషయాలు తెలపాలన్నారు. ఈ సందర్భంగా పలు రైతులు పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎం.రవి మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పరిశీలించడానికి ఇక్కడికి రావడం జరిగిందన్నారు. రైతులకు వ్యవసాయంలో మెలకువలు, విధివిధానాలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి తెలియజేయాలని, ఏ పంటలు వేసుకోవాలి, ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, తదితర వాటి గురించి ఈ కార్యక్రమంలో వివరించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో సల్మాన్ దాస్, సర్పంచ్ పార్వతి, హౌసింగ్ డిఈ రామ్మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, పిఎసిఎస్ చైర్మన్ కేశన్న, ఎంపిటీసీ ఆదికేశవులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు..

# కాంట్రాక్టరు వేధింపులు భరించలేక ముగ్గురు సెక్యూరిటీ గార్డ్స్ ఆత్మహత్యాయత్నం





అయితే కాంట్రాక్టరు మాత్రమే నూతనంగా వచ్చిన నిబంధన ప్రకారము డిగ్రీ ఉంటేనే సూపరువైజర్లుగా ఉండాలని, అందుకే వారికి డిగ్రీ లేదు కాబట్టే డిమోట్ చేశామంటున్నారు.

నంద్యాల, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్స్‌గా పని చేస్తున్న ముగ్గురు వ్యక్తులు సెల్ఫ్ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన కలకలం రేపుతుంది.. వివరలోకి వెళ్లితే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరువైజర్లుగా 2014 నుండి ముగ్గురు వ్యక్తులు చెన్నయ్య, నాగన్న, ఆది పనిచేస్తున్నారు. అయితే వీరికి నెలకు రూ.12,099 మాత్రమే జీతం ఇస్తున్నారు. జీతాలు పెంచాలని గత కొద్దిరోజుల క్రితం ధర్నా చేశారు. చివరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను కూడా కలిసి వచ్చారు. దీనితో కాంట్రాక్టరు కక్షగట్టి వీరిని సూపరువైజర్ల స్థాయి నుండి గార్డ్స్‌గా మార్చారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సూపరింటెండెంట్‌కు, డిసికి కూడా తెలిపాము, కాని స్పందించలేదు. చివరకు ఇతర జిల్లా అయిన తిరుపతికి బదలీ చేస్తున్నామని చెప్పారు. అయితే నిబంధన ప్రకారము బదలీ చేయడానిక రూల్స్ ఒప్పుకోవు, దీంతో కాంట్రాక్టరు నిలదీయగా ససేమిరా అన్నారు. దీనితో తాము ముగ్గురు సెల్ఫీ వీడియో తీసుకుని ఫినాయిల్ తాగామని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వాపోయారు. ప్రస్తుతము ముగ్గురికి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉంది.

# సురక్షిత తాగునీటి అందించడమే లక్ష్యం

## 20సూత్రాల అమలు ఛైర్మన్ లంక దినకర్



సచివాలయం, మార్చి 16 ప్రభాతవార్త: జల్ జీవన్ మిషన్ 2.0ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో చర్యలు తీసుకుంటుందని 20సూత్రాల అమలు కార్యక్రమాల ఛైర్మన్ లంక దినకర్ తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలిక త్రాగునీటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మొత్తం రూ.8.69 లక్షల కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని అమలుచేయానిలని ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతి కుటంబానికి సురక్షిత త్రాగునీరు అందించి ఆరోగ్యవంతమైన వికసిత్ భారత్ నిర్మాణమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన స్వర్ణాంధ్రగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన తెలిపారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ జల్ జీవన్ మిషన్ 2.0ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక నీటి వనరులు,నిల్వలు, శుద్ధి వ్యవస్థలు, పైప్‌లైన్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి 2028డిసెంబర్ నాటికి ప్రతి గ్రామీణ కుటుంబానికి సురక్షిత త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి మౌలిక సదుపాయలు మెరుగుపడటం వల్ల ఆరోగ్యం, పరిశుభ్రత, మహిళల గౌరవం, పిల్లల విద్య, గ్రామీణ జీవనోపాధి అవకాశాలు కూడా గణనీయంగా మెరుగుపడతాయని ఆయన తెలిపారు. జల్ జీవన్ మిషన్ 2.0ద్వారా సమగ్ర ప్రభుత్వ విధానంతో గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థను స్థిరంగా, దీర్ఘకాలికంగా నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



# రైలు ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

## - దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

సచివాలయం, మార్చి 16 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ భద్రత అవశ్యకతను నొక్కి చెబుతూ వేసవి దృష్ట్యా భద్రతా ప్రోటోకాల్‌ను పాటించడంలో అందరూ అధికారులు సిబ్బంది క్రమశిక్షణను పాటించాలని ఆయన ఆదేశించారు. రైళ్ళలో అనధికారికంగా మండే స్వభావం గల వస్తువులను తీసుకెళ్ళడంపై తనిఖీలు ముమ్మరం చేయాలని, స్టెబిలింగ్ యార్డులు, గూడ్స్ షెడ్ల వద్ద అదనపు సిసిటివిలను ఏర్పాటు చేయడం ద్వారా నిఘాను బలోపేతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్, జోన్ పరిధిలోని మలుపులు, బహుళ ట్రాక్ ప్రాంతాల్లో సిగ్నల్స్ స్పష్టంగా కనిపించేలా ఉండడంపై ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. జనరల్ మేనేజర్ ఆర్‌యుబిల వద్ద నీరు నిలిచిపోయే సమస్యలపై ప్రస్తావిస్తూ, డిఆర్ఎమ్‌లు ఈ సమస్యను ప్రాధాన్యతా ప్రాతిపదికన పరిష్కరించాలని, అలాగే శాస్త్రీయ పద్ధతులు, నీటి పంపింగ్ యంత్రాంగాలను ఉపయోగించడం ద్వారా సమస్యను సరిదిద్దాలని ఆదేశించారు.

# అంగరంగ వైభవంగా 'ఆస్కార్' వేడుక

## ఉత్తమ చిత్రం: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్‌కు ఆరు అవార్డులు

## • ఉత్తమ నటుడుగా మైఖేల్ బి జోర్డాన్ • ఉత్తమ నటిగా జెస్సీ బక్లీ • ఉత్తమ దర్శకుడిగా పాల్ థామస్



లాస్‌ఏంజెల్స్, మార్చి 16: ప్రపంచ సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్ 2026) వేడుక అట్టహాసంగా నిర్వహించారు. లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీథియేటర్స్‌లో ఈ అవార్డుల బహూకరణకు వేదిక అయింది. జాతీయ అంతర్జాతీయ చిత్రప్రముఖులు హాజరైన ఈ వేడుకల్లో ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా "వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్" ఆస్కార్ పురస్కారాన్ని కైవసం చేసుకుంది. ఇదే చిత్రానికి దర్శకత్వం వహించిన పాల్ థామస్ అండర్సన్ ఉత్తమ దర్శకుడిగా, ఇందులో నటనకు సీన్ పెన్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డులు గెలుచుకున్నారు. ఈ చిత్రానికి ఏకంగా వివిధ విభాగాల్లో ఆరు అవార్డులు దక్కాయి. "సినర్స్"చిత్రంలో అద్భుత నటనకు మైఖేల్ బి జోర్డాన్ ఉత్తమ నటుడిగా నిలవగా, "హామ్నెట్" చిత్రానికి జెస్సీ బక్లీ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. వెపన్స్ చిత్రంలో నటనకు అమీ మడిగాన్ ఉత్తమ సహాయ నటిగా ఎంపిక య్యారు. ఈసారి పలు చిత్రాలకు అవార్డులు పంచుతూ జ్యూరీ సమప్రాధాన్య తనిచ్చింది. సినర్స్ చిత్రం ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఒరిజనల్ స్కోర్, సినిమాటోగ్రఫీ వంటి విభాగాల్లో పురస్కారాలు గెలుచుకుంది. మరోవైపు ఫ్రాంకెన్‌స్టీన్ చిత్రం ప్రొడక్షన్ డిజైన్, మేకప్ అండ్ హెయిర్‌స్టైలింగ్, కాస్ట్యూమ్ డిజైన్ విభాగాల్లో మూడు అవార్డులను సొంతం చేసుకుంది.

ఉత్తమచిత్రం: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్

ఉత్తమ దర్శకుడు: పాల్ థామస్ అండర్సన్ (వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)

ఉత్తమ నటుడు: మైఖేల్ బి జోర్డాన్ (సినర్స్)

ఉత్తమ నటి: జెస్సీ బక్లీ (హామ్నెట్)

సహాయనటుడు: షాన్‌పెన్ (వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)

సహాయనటి: అమీ మడిగాన్ (వెపన్స్)

యానిమేటెడ్ ఫీచర్: కెపిఓపి డెమన్ హంటర్స్

ఉత్తమ ఫీచర్‌ఫిలిమ్: సెంటిమెంటల్ వ్యాల్యూ

ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్: మిస్టర్ నోబడీ ఎగెనెస్ట్ పుతిన్

ఉత్తమ ఒరిజినల్‌స్క్రీన్‌ప్లే: ర్యాన్‌కూగ్లర్(సినర్స్)

ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే: పాల్‌థామస్ ఆండర్సన్ (వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)

ఉత్తమ సౌండ్: ఎఫ్1

ఉత్తమ విజువల్ ఎఫెక్ట్: అవతార్‌ఫ ఫైర్ అండ్ యాష్

ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ఫ్రాంకెన్‌స్టీన్

ఉత్తమ కాస్ట్యూమ్‌డిజైన్: ఫ్రాంకెన్‌స్టీన్

ఉత్తమ మేకప్ హెయిర్‌స్టైయిల్: ఫ్రాంకెన్‌స్టీన్

ఉత్తమ కాస్టింగ్: వన్‌బ్యాటిల్ ఆఫ్టన్ అనదర్

ఉత్తమ యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్ం ది గర్ల్ హూక్రైడ్ పెర్ల్స్

ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్: ఆల్‌ది ఎంప్టీరూమ్స్

ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్: ది సింగర్స్,టూ పీపుల్ ఎక్స్ఛేంజింగ్ సలైవా (జాయింట్ అవార్డు)

# పొట్టిశ్రీరాములు విగ్రహంపై వైసిపి విమర్శలు దుర్మార్గం

## మంత్రి నిమ్మల రామానాయుడు

విజయవాడ, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిలో ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంపై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు దుర్మార్గమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. భవిష్యత్ తరాలకు పొట్టిశ్రీరాములు త్యాగనిరతి స్ఫూర్తిగా నిలవాలనే లక్ష్యంతో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామని, ఇది ఎన్నికల హామీని నిలబెట్టుకోవడమేనని స్పష్టం చేశారు. దోపిడీ, లూటీలకు అలవాటుపడిన వైసీపీ నేతలకు త్యాగాల విలువ తెలియడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆర్యవైశ్యులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ఎవరికీ సాయం చేయకూడదనే డీఎన్‌ఏ జగన్‌ది కాబట్టే, కన్నతల్లిని, చెల్లిని కూడా మోసం చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అడ్డగోలుగా అప్పు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని మంత్రి విమర్శించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తాము అధికారంలోకి వచ్చాక ఐసీయూలోకి తీసుకొచ్చామని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నా మని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో సౌకర్యవంతమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని నిమ్మల రామానాయుడు వివరించారు.

17-3Pg5.qxd:17-3Pg5.qxd 1/1/02 6:26 AM Page 1





## ఇంధన ట్యాంక్‌పై డ్రోన్ దాడి:
### దుబాయ్ విమానాశ్రయం మూసివేత

**దుబాయ్, మార్చి 16:** పశ్చిమాసియాలోని పలు దేశాలపై ఇరాన్ దాడులు పెంచుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ల దాడులు జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీసు జారీ చేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు. పలు విమానాలను దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు
## 5,522 విమానాలు రద్దు
### - రాజ్యసభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 16:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా 5,522 విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం రాజ్యసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులతో భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు. "సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, విమానాల రద్దుతో అంతరాయం ఏర్పడినప్పటికీ, ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. భారత విమానయాన నియంత్రణ సంస్థ (డిజిసిఎ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో గగనతలం తిరిగి తెరుచుకున్న తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి వస్తాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## కటక్ ఆసుపత్రిలో భారీ అగ్ని ప్రమాదం..
### 10మంది రోగులు దుర్మరణం



**భువనేశ్వర్, మార్చి 16:** ఆసుపత్రి ఐసియూలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రోగులను ఐసియు నుంచి బయటకు తీసుకువెళ్లే క్రమంలో పలువురు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. ఒడిశాలోని కటక్ సిటీలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కటక్‌లోని ఎస్‌సిబి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ట్రామా కేర్ విభాగం ఐసియులో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది రోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందచేయనున్నట్లు సిఎం ప్రకటించారు. అదేవిధంగా ఈ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ తెల్లవారుఝామున 2.30 గంటల సమయంలో మంటలు చెలరేగగానే రోగులను ఐసియు నుంచి బయటికి తీసుకొచ్చే ప్రయత్నం చేశామన్నారు.

### చమురుబావులకోసమే
# గల్ఫ్‌లో యుద్ధాలు



**ఆనాడు ఇరాక్ నుంచి నేటి ఇరాన్ వరకూ అదేనా?**

**బాగ్దాద్, మార్చి 16:** పశ్చిమాసియాల్లో చమురుబావులు, నిల్వలే యుద్ధాలకు దారితీస్తున్నాయి. నేడు ఇరాన్‌పై జరిగిన దాడికి కూడా మూల కారణం అదే కనిపిస్తోంది. అణుధ్వంసం అని చెపుతున్నా ఇరాన్‌కీలకమైన చమురు స్థావరాల న్నింటిపైనా ఇజ్రాయెల్, అమెరికాలు దాడులు చేస్తున్నాయి. ఇదేవిధంగా మూడున్న దశాబ్దాలక్రితం కువైట్‌పై సద్దాం హుస్సేన్ కన్నువేసి చమురుబావుల న్నింటినీ స్వాధీనంచేసుకోవడంతో గల్ఫ్‌యుద్ధానికి బీజంపడింది. 1990 ఆగస్టు 2న ఇరాక్ అప్పటి అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ తన శక్తిమంతమైన సైన్యంతో పొరుగు దేశమైన కువైట్‌పై దండెత్తాడు. ఈ ఆక్రమణకు ప్రధాన కారణం చమురు. ఇరాన్‌ఇరాక్ యుద్ధం (1980-88) తర్వాత ఇరాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. కువైట్ కు తాము ఇవ్వాల్సిన అప్పులను రద్దు చేయాలని డిమాండ్ చేశాడు. అలాగే తమ సరిహద్దులోని చమురు బావుల నుంచి కువైట్ చమురును దొంగిలిస్తోందని సద్దాం ఆరోపించాడు. కేవలం రెండు రోజుల్లోనే కువైట్‌ను తన గుప్పిట్లోకి తెచ్చుకున్న సద్దాం దానిని ఇరాక్ యొక్క 19వ రాష్ట్రంగా ప్రకటించాడు. కువైట్ ఆక్రమణను ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ప్రపంచ చమురు నిల్వల్లో కీలకమైన ప్రాంతం సద్దాం చేతుల్లోకి వెళ్లడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని అమెరికా భయపడింది. దీంతో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ హెచ్.డబ్ల్యూ. బుష్ నేతృత్వంలో 35దేశాలతో కూడిన ఒక భారీసైనిక కూటమి ఏర్పడింది. సౌదీ అరేబియాపై దాడి జరగకుండా రక్షించడానికి ఆపరేషన్ డెజర్ట్ షీల్డ్‌పేరుతో భారీగా సైన్యాన్ని మోహరించారు. 1991 జనవరి 15 లోపు కువైట్‌ను వదిలి వెళ్లాలని సద్దాంకు అల్టిమేటం జారీ చేశారు. సద్దాం హుస్సేన్ వెనక్కి తగ్గకపోవడంతో 1991 జనవరి 17న మిత్రదేశాల కూటమి యుద్ధాన్ని ప్రకటించింది. దీనినే ఆపరేషన్ డెజర్ట్ స్టార్మ్ అని పిలిచారు. వైమానిక దాడులతో ఇరాక్ సైనిక స్థావరాలను, కమ్యూనికేషన్ వ్యవస్థను ధ్వంసం చేశారు. టెక్నాలజీని ఉపయోగించి చేసిన ఈ దాడులు టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం కావడం అప్పట్లో ఒక సంచలనం. ఫిబ్రవరి 24న భూతల దాడులు ప్రారంభమయ్యాయి. కేవలం 100 గంటల్లోనే మిత్రదేశాల సైన్యం ఇరాక్ సైన్యాన్ని చిత్తు చేసి కువైట్‌ను విముక్తి చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో కువైట్ నుంచి వెనుదిరుగుతూ సద్దాం హుస్సేన్ ఒక దారుణమైన పని చేశాడు. కువైట్‌లోని సుమారు 600కు పైగా చమురు బావులకు నిప్పు పెట్టాడు. ఆమంటలు నెలల తరబడి ఎగసిపడ్డాయి, ఆకాశం నల్లటి పొగతో నిండిపోయింది. ఇది చరిత్రలోనే అతిపెద్ద పర్యావరణ విపత్తులలో ఒకటిగా నిలిచిపోయింది. చివరకు 1991 ఫిబ్రవరి 28న యుద్ధ విరమణ ప్రకటన వెలువడింది. గల్ఫ్ యుద్ధం ముగిసినా సద్దాం హుస్సేన్ అధికారం మాత్రం పోలేదు. ఇరాక్‌పై ఐక్యరాజ్య సమితి కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించింది.

ఈ యుద్ధం అమెరికాను ప్రపంచంలోనే ఏకైక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. ఆధునిక ఆయుధాలు, స్మార్ట్ బాంబులు, జీపీఎస్ టెక్నాలజీ యుద్ధాల్లో ఎంత కీలకమో ఈ యుద్ధం నిరూపించింది.

పశ్చిమాసియాలో అమెరికా సైనిక జోక్యం పెరగడానికి ఇది పునాది వేసింది, ఇది తర్వాతి కాలంలో అనేక పరిణామాలకు దారితీసింది. ఈ యుద్ధం ద్వారా ప్రపంచం ఒక విషయాన్ని అర్థం చేసుకుంది గల్ఫ్ ప్రాంతంలో ఏ చిన్న అలజడి రేగినా, అది ప్రపంచవ్యాప్తంగా సామాన్యుడి జేబును, దేశాల ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ప్రపంచానికి తెలిసివచ్చేలా చేసింది.

## తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధవిమానాల విన్యాసాలు
## మళ్లీ ఉద్రిక్తలు రెచ్చగొట్టిన డ్రాగన్



**తైపేయి, మార్చి 16:** తైవాన్ జలసంధిలో గత రెండు వారాలకు పైగా కొనసాగిన నిశ్శబ్దంనుంచి మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. చైనా తన సైనిక విమానాలు, నౌకలతో మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. గడిచిన 24 గంటల్లో తమ ద్వీపం చుట్టూ 26 చైనా సైనిక విమానాలు, 7 నౌకలు సంచరించినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీటిలో 16 విమానాలు తమ వాయు రక్షణ గుర్తింపు జోన్ లోని ఉత్తర, మధ్య, నైరుతి ప్రాంతాల్లోకి ప్రవేశించాయని పేర్కొంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి మొదటి వారం వరకు తైవాన్ సమీపంలో చైనా సైనిక విమానాల కదలికలు దాదాపుగా నిలిచిపోయాయి. 2021 తర్వాత ఇంత ఎక్కువ కాలం పాటు చైనా విమానాల కార్యకలాపాలు ఆగడం ఇదే తొలిసారి. దీంతో చైనా తన వ్యూహాన్ని మార్చుకుందేమోనని, సైనిక శిక్షణ ప్రాధాన్యతలపై దృష్టి సారించి ఉండవచ్చని లేదా దౌత్యపరమైన చర్చల నేపథ్యంలో సంయమనం పాటిస్తుండవచ్చని విశ్లేషకులు భావించారు. అయితే, ఈ ఊహాగానాలకు తెరదించుతూ చైనా మళ్లీ తన దూకుడును ప్రదర్శించింది. తాజా పరిణామాల నేపథ్యంలో తైవాన్ అప్రమత్తమైంది. చైనా విమానాలు, నౌకల కదలికలను పర్యవేక్షించేందుకు తమ వాయు, నౌకా దళాలతో పాటు తీరప్రాంత క్షిపణి వ్యవస్థలను మోహరించినట్లు తెలిపింది. చైనా నుంచి కవ్వింపు చర్యలు మినహా ఎలాంటి దూకుడు చర్యలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో తైవాన్‌పై ఒత్తిడి పెంచే "గ్రేజోన్" తంత్రంలో భాగంగా చైనా దాదాపు ప్రతిరోజూ తమ గగనతలంలోకి విమానాలను పంపుతోంది. రాజకీయంగా కీలకమైన సంఘటనల సమయంలో ఈ కార్యకలాపాల తీవ్రత మారుతూ ఉంటుంది. తమ నుంచి విడిపోయిన భూభాగంగా తైవాన్‌ను పరిగణించే చైనా, అవసరమైతే బలవంతంగానైనా విలీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రెండు వారాల పాటు సైనిక విన్యాసాలను ఎందుకు నిలిపివేసింది, ఇప్పుడు మళ్లీ ఎందుకు ప్రారంభించింది అనే దానిపై బీజింగ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బీహార్‌లో ఎన్‌డియే క్లీన్‌స్వీప్

**- ఒడిశాలో బిజెపికి కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు - 7 రాష్ట్రాల్లో 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవం - తొలిసారిగా నితీశ్, నబిన్ రాజ్యసభలోకి**



**న్యూఢిల్లీ, మార్చి 16:** దేశవ్యాప్తంగా పది రాష్ట్రాలలో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నిర్వహించగా, 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఇందులో బిజెపి 7, కాంగ్రెస్ 5, తృణమూల్ కాంగ్రెస్ 4, డిఎంకె 3, శివసేన, ఆర్‌పిఐ(ఎ), ఎన్‌సిపి, ఎన్‌సిపి(ఎస్‌పి), ఎఐఎడిఎంకె, పిఎంకె, యుపిపిఎల్ ఒక్కొక్క స్థానం దక్కించుకున్నారు. శరద్ పవార్, అభిషేక్ సింఘ్వి, తిరుచ్చి శివ, వినోద్ తవ్డే తదితర ప్రముఖ నేతలున్నారు. వీరంతా ఇప్పటికే రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతుండగా, మరోమారు పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక బీహార్, ఒడిశా, హర్యానాలో మాత్రమే సోమవారం పోలింగ్ నిర్వహించి, ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. బీహార్‌లో ఐదు స్థానాలనూ ఎన్‌డియే అభ్యర్థులు విజయం సాధించారు. బీహార్ ముఖ్యమంత్రి, జెడియు అభ్యర్థి నితీశ్ కుమార్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రామ్‌నాథ్ ఠాకూర్ (బిజెపి), శివేష్ రామ్ (బిజెపి), ఉపేంద్ర కుశ్వాహ (ఆర్‌ఎల్‌ఎం) విజయం సాధించారు. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మరొక విపక్ష ఎమ్మెల్యే ఓటింగ్‌కు దూరం కావడం, పలువురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ఎన్‌డియే అభ్యర్థులు ఓటు వేయడంతో సునాయాశంగా విజయం సాధించారు. బీహార్ నుంచి గెలుపొందిన నితీశ్ కుమార్, నితిన్ నబిన్‌లు తొలిసారిగా రాజ్యసభలో అడుగుపెడుతున్నారు. అటు ఒడిశాలో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. మూడు రోజుల క్రితమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించగా, సోమవారం ఉదయం ఓటింగ్‌కు ముందు బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు విమానంలో, అట్నుంచి నేరుగా అసెంబ్లీ వద్దకు ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. అయినప్పటికీ కాంగ్రెస్- బిజెడికి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు సమాచారం. దీంతోనే బిజెపి బరిలో నిలిపిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించగా, మరో స్థానంలో బిజెడి అభ్యర్థి గెలుపొందారు. ఇక హర్యానాలో రెండు స్థానాలకు ఎన్నికలు జరగ్గా, రెండింటిని అధికార బిజెపి కైవసం చేసుకుంది.

## మోడీ టూర్ తర్వాత కేబినెట్ ఒకేతోనే ఇరాన్‌పై దాడులు
### భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 16:** భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ టూర్‌కు వెళ్లి వచ్చిన రెండు రోజులుకే ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దళాలు దాడికి దిగిన విషయం తెలిసిందే. అయితే ప్రధాని మోడీ పర్యటన ముగిసిన కొన్ని గంటల్లోనే ఇరాన్‌పై అటాక్ జరగడం పై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోని ఇజ్రాయెల్ అంబాసిడర్ రూవెన్ అజర్ క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లారు. ప్రధాని మోడీ చేపట్టిన ఉన్నత స్థాయి దౌత్య పర్యటనకు ముందే ప్రాంతీయంగా ఉద్రిక్త పరిస్థితులు ఉన్నట్లు అజర్ వెల్లడించారు. ప్రధాని మోడీ గతనెల 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించారని, ఆ సమయం కన్నా ముందే తమ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అందరికీ తెలిసిందే అని అజర్ అన్నారు. మోడీ టూర్‌తో సంబంధం లేకుండా సైనిక ఆదేశాల ప్రకారం దాడి జరిగినట్లు ఆయన చెప్పారు. వ్యూహాత్మక అంచనాలు వేసిన తర్వాతే ఇరాన్‌పై అమెరికాతో కలిసి దాడికి దిగినట్లు అంబాసిడర్ రూవెన్ అజర్ చెప్పారు. దాడి అంశాన్ని పరిగణలోకి తీసుకుంటే, ప్రధాని మోడీవచ్చి వెళ్లిన తర్వాతే మిలిటరీ ఆపరేషన్ చేపట్టే అవకాశం వచ్చిందని ఆయన అన్నారు. ఇరాన్‌పై దాడికి, మోడీ ట్రిప్‌కు లింకు ఉన్నట్లు వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. తమ ప్రాంతం నుంచి మోడీ వెళ్లిపోయిన తర్వాతే దాడి చేసేందుకు అనుమతి వచ్చినట్లు చెప్పారు. మోడీ పర్యటన ముగింపునకు, సైనిక చర్య చేపట్టడానికి మధ్య రెండు రోజుల సమయం పట్టిందని,

అయితే క్యాబినెట్ నిర్ణయం తర్వాతే దాడికి పాల్పడినట్లు అజర్ చెప్పారు. అమెరికాకు కానీ, ఇజ్రాయెల్‌కు కానీ ఇరాన్‌ను ఆక్రమించాలన్న ఉద్దేశం లేదన్నారు. కేవలం ఇరాన్‌లో అంతర్గత మార్పులు జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పశ్చిమాసియా ప్రాంతంలో స్థిరత్వాన్ని, భద్రతను కల్పించాలన్నదే ఇజ్రాయెల్ ముఖ్య ఉద్దేశమన్నారు.



## కంట్ రైల్వేస్టేషన్‌లో
# పాక్ స్పై కెమెరాలు
### రహస్య సమాచారం చేరవేస్తున్న ఆరుగురి అరెస్టు

**న్యూఢిల్లీ, మార్చి 16:** దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న భారీ గూఢచర్య ముఠా గుట్టురట్టయింది. ఈ రాకెట్ వెనుక పాకిస్థాన్ హస్తం ఉన్నట్లు ఘజియాబాద్ పోలీసులు తమ విచారణలో గుర్తించారు. ఢిల్లీ కంట్ రైల్వే స్టేషన్‌లో నిందితులు రహస్య కెమెరాను అమర్చి, పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు లైవ్ ఫుటేజ్ పంపినట్లు తేలడం కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్ల నుంచి వాట్సాప్ ద్వారా ఆదేశాలు అందుకుని, దేశంలోని సున్నితమైన ప్రాంతాల సమాచారాన్ని చేరవేస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. ఒక్కో అసైన్‌మెంట్‌కు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు తీసుకున్నట్లు తెలిపారు. ముంబై, ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని రైల్వే స్టేషన్లు, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ మోహరింపు పాయింట్లు, రక్షణ శాఖ కార్యాలయాలు, భద్రతా ఏజెన్సీల కదలికలను వీరు వీడియో తీసి పంపినట్లు పోలీసులు కనుగొన్నారు. నిందితుల నుంచి 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అధికార రహస్యాల చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులు కొంత డేటాను డిలీట్ చేయగా, దాన్ని తిరిగి పొందేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు మరికొంత మందిని నియమించుకోవాలని కూడా నిందితులు ప్రయత్నించినట్లు తెలిసింది. ఢిల్లీ కంట్ వంటి కీలక రైల్వే స్టేషన్ నుంచి నేరుగా లైవ్ ఫుటేజ్ పాకిస్థాన్‌కు చేరడం అత్యంత ఆందోళనకరమని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సమాచారాన్ని ఉపయోగించి ఉగ్రదాడులకు ప్లాన్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## పశ్చిమబెంగాల్ డిజిపి, నగరకమిషనర్‌ల బదలీ
### ఇప్పటికే హోం కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల బదలీ

**కోల్‌కత్తా, మార్చి 16:** పశ్చిమ బెంగాల్‌లో స్వేచ్ఛాయుత, శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీలను బదిలీ చేసిన మరుసటి రోజే, పోలీసు శాఖలోనూ భారీ మార్పులు చేసింది. రాష్ట్ర యాక్టింగ్ డీజీపీ పీయూష్ పాండే, కోల్‌కతా పోలీస్ కమిషనర్ సుప్రతిమ్ సర్కార్‌లను తక్షణమే ఆ పదవుల నుంచి తొలగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన డీజీపీగా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సిద్ధ్ నాథ్ గుప్తాను, కోల్‌కతా నూతన పోలీస్ కమిషనర్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అజయ్ కుమార్ నంద్‌ను ఈసీ నియమించింది. వీరితో పాటు లా అండ్ ఆర్డర్ డీజీగా ఉన్న వినీత్ కుమార్ గోయల్‌ను కూడా తొలగించి, ఆయన స్థానంలో 1995 బ్యాచ్ అధికారి అజయ్ ముకుద్ రానడేను అదనపు డీజీగా (లా అండ్ ఆర్డర్) నియమించారు. మరోవైపు, 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నటరాజన్ రమేశ్ బాబును డైరెక్టర్ జనరల్ ఆఫ్ కరెక్షనల్ సర్వీసెస్‌గా పోస్టింగ్ ఇచ్చారు. బెంగాల్‌లో ఎన్నికలను హింసారహితంగా నిర్వహిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం జనవరి 30న నియమితులైన పాండే, సర్కార్‌లను రెండు నెలలు కూడా గడవకముందే మార్చడం గమనార్హం.

## నేపాల్‌లో చుక్కలను తాకుతున్న పెట్రో, డీజిల్ ధరలు!

**ఖాట్మండు, మార్చి 16:** పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ సెగలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దహించివేస్తున్నాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం కాస్తా ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీయడంతో, మన పొరుగు దేశమైన నేపాల్‌లో పెట్రో ధరలు రాత్రికి రాత్రి రికార్డు స్థాయికి చేరాయి. నేపాల్ ఆయిల్ కార్పొరేషన్ తీసుకున్న సంచలన నిర్ణయంతో ఈ రోజు నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థలో అంతరాయాల కారణంగా నేపాల్ ప్రభుత్వం ఇంధన ధరలను భారీగా సవరించింది. పెట్రోల్ లీటరుకు రూ.31 పెరగడంతో ఇప్పుడు రూ.188 కి చేరింది. డీజిల్ ఏకంగా రూ.54 పెరగడంతో లీటరు ధర రూ.196 కి చేరుకుంది. ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.296 భారం పడటంతో, ఇప్పుడు ఒక్కో బండ ధర రూ.2,126 కు పెరిగింది. గతనెల 28న ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన 'హార్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు కొరత ఏర్పడింది. ఈ ప్రభావం నేరుగా దిగుమతులపై ఆధారపడే నేపాల్ వంటి దేశాలపై పడింది. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తమకు నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు నేపాల్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. భారత్‌లో ధరలు స్థిరంగా ఉన్నాయి.

# మంటల్లో పశ్చిమాసియా

## నాటో కూటమిపై ట్రంప్ ఫైర్!



**వాషింగ్టన్, మార్చి 16:** పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్ర దేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రెటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి చాలా దారుణంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు. హార్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు. ఈ కీలక మార్గాన్ని తెరిపించేందుకు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపించాలి. నాటో దేశాలు తమ బాధ్యతను నెరవేర్చకుంటే ఆ కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకమే అని ఆయన హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా జరిపిన బాంబు దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. చమురు సరఫరాను అడ్డుకుంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, దానిని అడ్డుకోవడానికి ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనకాడబోమని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలతో నాటో కూటమిలో ఒక్కసారిగా కలకలం రేగింది. పశ్చిమాసియా యుద్ధంలో నేరుగా పాల్గొనడానికి యూరోపియన్ దేశాలు మొగ్గు చూపకపోవడంతో, అమెరికా, దాని మిత్రదేశాల మధ్య దూరం పెరుగుతోందనే చర్చ మొదలైంది.

## ఇజ్రాయెల్ అమెరికాలను సవాల్‌చేస్తున్న 'డాన్సింగ్ మిసైల్'



**టెహ్రాన్, మార్చి 16:** ఇరాన్‌పై జరుగుతునన దాడులకు ప్రతిగా ఇరాన్ డ్యాన్సింగ్ మిస్సైల్ అని పిలిచే అత్యాధునిక క్షిపణిని ప్రయోగించి ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. సాధారణ క్షిపణులు ఒకే మార్గంలో వెళ్తాయి, కానీ ఈ క్షిపణి గగనతలంలో దిశలను మారుస్తూ, వంకరటింకరగా ప్రయాణిస్తూ ఇజ్రాయెల్ రక్షణ కవచం ఐరన్ డోమ్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. ఈ క్షిపణి ప్రయాణించే తీరును చూసి రక్షణ రంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణులు రాడార్లకు దొరకకుండా, శత్రుదేశాల రక్షణ వ్యవస్థలను ఏమారుస్తూ లక్ష్యాన్ని చేరుకుంటాయని వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని వ్యూహాత్మక సైనిక స్థావరాలే లక్ష్యంగా వీటిని ప్రయోగించినట్లు తెలుస్తోంది. తమ అమ్ములపొదిలో ఉన్న అత్యంత రహస్య ఆయుధాల్లో ఇదొకటని, తాము ఇంకా తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేదని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ కూడా ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది. లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వాయుసేన బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో పలువురు సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అమెరికా తన థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్‌లో మోహరించినప్పటికీ, ఇరాన్ కొత్తగా ప్రయోగిస్తున్న ఈ డ్యాన్సింగ్ మిస్సైళ్లను అడ్డుకోవడం పెద్ద సవాలుగా మారింది.

## ఔను...నేను చనిపోయాను కదా!
### కాఫీ తాగుతూ బెంజమిన్ నెతన్యాహు సెటైర్లు



**టెల్ అవీవ్, మార్చి 16:** ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చనిపోయారని సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ఊహాగానాలపై స్పందిస్తూ నెతన్యాహు స్వయంగా ఒక వీడియోను సోషల్‌మీడియాలో విడుదల చేసి ఆ వార్తలను నవ్వుతూ కొట్టిపారేశారు. నెతన్యాహు ఒక కేఫ్ వద్ద కాఫీ ఆర్డర్ చేస్తూ వీడియోలో కనిపించారు. అవును నేను చనిపోయాను కాఫీ కోసం అంటూ ఆయన సరదా వ్యాఖ్యలుచేసారు. నా ప్రజల కోసం నేను ప్రాణాలు ఇస్తున్నాను, వారి ధైర్యం చూస్తుంటే చాలా గర్వంగా ఉంద్ధి అని ఆయన అన్నారు. కొన్ని రోజుల క్రితం నెతన్యాహు ప్రెస్ మీట్‌లో పాల్గొన్న వీడియోను ఎవరో మార్ఫింగ్ చేసి ఆయన చేతికి ఆరు వేళ్లు ఉన్నాయని అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో చేసిన వీడియో అని ప్రచారం చేశారు. నెతన్యాహు తన రెండు చేతులను కెమెరా వైపు చూపిస్తూ నా చేతి వేళ్లను లెక్కపెట్టాలనుకుంటున్నారా ఇక్కడ చూడండి, ఇదిగో ఇక్కడ చూశారా అన్నీ బాగానే ఉన్నాయని నవ్వుతూ చెప్పారు. ఇజ్రాయెల్ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లండి కానీ ఎప్పుడూ సురక్షిత ప్రాంతాలకు దగ్గరలోనే ఉండండి. మీ ధైర్యం నాకు, ప్రభుత్వానికి, సైన్యానికి, మొసాద్ సంస్థకు ఎంతో బలాన్ని ఇస్తోంది. మేము ఇరాన్‌పై చాలా గట్టిగా దాడులు చేస్తున్నాం. మీరు ధైర్యంగా ముందుకు సాగండి, నేను కూడా మీతోనే ఉంటాను అని భరోసానిచ్చారు. స్థానిక అధికారులు ఇచ్చే భద్రతా సూచనలను ఎప్పటికప్పుడు పాటించాలని ఆయన కోరారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మొదలై 16 రోజులు దాటింది.

## హార్మూజ్ రక్షణకు ట్రంప్ పిలుపు: వస్తామంటూ చైనా షరతు



బీజింగ్, మార్చి 16: ఇరాన్ యుద్ధం కారణంగా దెబ్బ తిన్న హార్మూజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు ముందుకు రావాలని ట్రంప్ పలు దేశాలను కోరారు. ఈ విషయమై చైనా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. హార్మూజ్ రక్షణకు తాము ముందుకు రావాలంటే.. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, ప్రాంతీయ శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయన్నారు. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని లిన్ జియాన్ అమెరికాకు సూచించారు. ప్రస్తుత ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈ నెల చివరలో ట్రంప్ బీజింగ్ పర్యటన గురించి అమెరికాతో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో ఈ పర్యటన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. హార్మూజ్ ప్రాంతంలో చైనా ప్రయోజనాలే ఎక్కువ.

17-3Pg6exHMNWJQE.qxd:17-3Pg6exHMNWJQE.qxd 1/1/02 6:30 AM Page 1





ఒంటిమిట్ట కోదండ రామాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, జగన్మోహన్ రాజు

# ఏప్రిల్ 1న ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం

### - అన్న ప్రసాద వితరణ ప్రారంభించిన టిడిపి ఛైర్మన్ బిఆర్ నాయుడు

రాజంపేట, మార్చి 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో ఒంటిమిట్ట కోదండ రామాలయం లో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలను, ఏప్రిల్ 1న జరిగే సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలించేందుకు సోమవారం ఆయన ఒంటిమిట్టకు వచ్చారు. ఈ సందర్భంగా భక్తుల కోసం నిరంతరాయంగా ఉచిత అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను టిటిడి ఛైర్మన్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కడప ఎస్పీ విశ్వనాథ్‌తో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ నాయుడు మాట్లాడుతూ సీతారాముల కళ్యాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు. సీతారాముల కళ్యాణాన్ని ప్రపంచ వ్యాప్తంగా వీక్షించడానికి ఎస్వీబిసి ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందిస్తామన్నారు. విద్యుత్ దీపాలంకరణ, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేస్తున్నట్లు

# త్యాగమూర్తి పొట్టిశ్రీరాములు

### ● దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ● ఆత్మకూరులో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు



ఆత్మకూరు (నెల్లూరు), మార్చి 16, ప్రభాతవార్త: అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆత్మకూరులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్య ప్రధానవీధి నుండి ప్రారంభించిన ర్యాలీలో మంత్రి ఆనం పాల్గొన్నారు. ఆర్యవైశ్య ప్రధానవీధిలోని హనుమాన్ జంక్షన్ నుండి ర్యాలీగా బయలుదేరి సత్రం సెంటర్‌వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్రం సెంటర్‌లో ఉన్న శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అలర్పించారు. ఈ సందర్భంగా మంత్రి "ఆనం" అమరావతిలో అమరజీవి విగ్రహావిష్కరణ కార్యక్రమం, ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని ప్రత్యక్షప్రసారాన్ని ఆత్మకూరు నుంచి మంత్రి ఆనం వీక్షించారు. ఈసందర్భంగా రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో చిర స్థాయిగా నిలిచిన త్యాగమూర్తి అమరజీవి పొట్టి శ్రీరా ములు అని, తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో 58రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన మహనీయుడని, తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిపెట్టిన పోరాట యోధుడని, భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మార్గం సుగమం చేసిన దూరదృష్టిగల మహనీయుడని, అమరజీవి త్యాగఫలితంగానే నేడు మనందరం ఆనందంగా జీవిస్తున్నామన్నారు. అమరజీవి త్యాగాలకు గుర్తుగా అమరావతిలో 58అడుగుల విగ్రహం స్మృతివనాన్ని సిఎం చంద్రబాబు ఆవిష్కరించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. అమరజీవి త్యాగాలను గౌరవిస్తూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించిందన్నారు. ఆత్మకూరు పట్టణంలో నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారిపై మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, నందమూరి తారకరామారావు విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. భవిష్య త్ తరాలకు మహనీయుల త్యాగాలు, భారతదేశ ఔన్నత్యం తెలియజేసేలా ఆత్మ కూరులో త్యాగమూర్తుల విగ్రహాలను ప్రతిష్టిస్తామన్నారు. మరో ఆరు నెలల్లో నాలుగు లైన్‌ల రహదారిని పూర్తి చేసి ఆత్మకూరును అన్ని విధాలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి చూపిన సన్మార్గంలో నడుద్దామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం ఆత్మకూరు పట్టణానికి చెందిన వివిధరంగాల్లో విశిష్ట సేవలందించిన 12మంది ఆర్యవైశ్య ప్రముఖులను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నేతలు, స్థానిక ప్రనజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగాలు చిరస్మరణీయం



నెల్లూరు కలెక్టరేట్, మార్చి 16 ప్రభాత వార్త: అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు త్యాగాలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండు సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాతో పొట్టిశ్రీరాములు బంధం విడదీయరానిదన్నారు. పొట్టిశ్రీరాములు త్యాగాన్ని యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు ఎప్పటికి మరువరన్నారు. శ్రీరాములు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయం దేశంలో నూతన రాష్ట్రాల ఏర్పాటుకు బీజం వేసిందన్న కలెక్టర్, ఆ మహనీయుని ఆలోచనతో నేడు ప్రభుత్వ పరిపాలన సులభతరం అయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జయంతి వేడుకలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. అమరావతిలో 58అడుగుల విగ్రహాన్ని నేడు సీఎం ఆవిష్కరిస్తున్నారని, అన్ని మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమం వీక్షించే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ పొట్టి శ్రీరాములు ఆశయసాధనకు కృషిచేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు మద్రాసులో జన్మించినప్పటికీ వారి కుటుంబ మూలాలు నెల్లూరు జిల్లా జువ్వల దిన్నె గ్రామంలో అనుబంధం కలిగి వున్నాయన్నారు. జువ్వలదిన్నె గ్రామాన్ని పొట్టిశ్రీరాములు జ్ఞాపకార్థకం పొట్టిశ్రీరాములు మెమోరియల్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో రోడ్లు, భవనాలు, బ్రిడ్జిలను పూర్తిచేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగస్ఫూర్తి, నిబద్ధత నేటి తరాలకు ప్రేరణగా నిలుస్తుందని బీద అన్నారు. ప్రతిఒక్కరూ పొట్టిశ్రీరాములు త్యాగాన్ని గౌరవిస్తూ, వారు చూపిన సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అర్బన్ తహశీల్దారు షఫీమాలిక్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ మెంబర్‌గా 'సుంకర'



విజయవాడ కార్పొరేషన్, మార్చి 16 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో విజయవాడకు చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ నాల్గవసారి బార్ కౌన్సిల్ మెంబరుగా ఎన్నికయ్యారు. బెజవాడ బార్ నుండి ఇప్పటి వరకు చలసాని అజయ్ కుమార్, ఉప్పలపాటి శ్రీనివాసరాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. విజయం సాధించిన బార్ కౌన్సిల్ మెంబర్లకు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు. మరి కొంతమంది ఫలితాలు నేడు, రేపటిలో వెలువడే అవకాశం ఉందని న్యాయవాదులు భావిస్తున్నారు.



# సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

### - ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

తిరుపతి, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 54 వినతులు అందాయి. తిరుపతిలోని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సిఎండి సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు పి.అయూబ్ ఖాన్, కె.రామమోహన్ రావు, సిజిఎంలు జె.రమణాదేవి, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, యం.మురళీ కుమార్, యం.కృష్ణారెడ్డి, సిహెచ్ రామచంద్రరావు, జిఎంలు చక్రపాణి, భాస్కర్‌రెడ్డి, జగదీష్, శ్రీనివాసులు, పిఆర్‌ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు

తిరుమల, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ద్రావిడియన్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం ఆచార్యులు డాక్టర్ అరవింద్ కుమార్ కొనియాడారు. తిరుపతిలోని అన్నమాచార్య కళా మందిరంలో సోమవారం పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం ఎంత వరకైనా వెళ్లాలన్న ఆయన దృఢ సంకల్పం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తెలుగు భాష ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అహింసా మార్గంలో ఆయన పోరాటాన్ని కొనసాగించారని వివరించారు. చెన్నైలోని రాయపేట రోడ్డులో బులుసు సాంబమూర్తి నివాసంలో నిరాహార దీక్ష ప్రారంభించి, పట్టుదలతో దీక్షను కొనసాగించి చివరకు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. కార్యక్రమానికి ముందు అతిథులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. టిటిడి సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనందరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిటిడి ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టార్టప్‌లు కోసం ప్రణాళిక, నిధుల సమీకరణ ముఖ్యం



తిరుపతి, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: స్టార్టప్‌ల కోసం వ్యాపార ప్రణాళిక, నిధుల సమీకరణపై సోమవారం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో బూట్‌క్యాంప్ నిర్వహించారు. స్టార్టప్‌లు ప్రభావవంతమైన పిచ్ డెక్ తయారు చేసుకునే విధానం, సమస్యను అవగతం చేసుకోవడం, దానికి పరిష్కారం, మార్కెట్ అవకాశాలు, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలను స్పష్టంగా చూపించడం అవసరమని తెలిపారు. ఎస్‌ఎస్‌ఐఇ-టిబిఐ, పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిధి యాక్సిలరేటర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ బూట్‌క్యాంప్‌లో 50కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగపూర్‌కు చెందిన డాక్టర్ ఆనంద్ గోవిందలూరి మాట్లాడుతూ భాగస్వామ్యాలు, లైసెన్సింగ్ అవకాశాలు, సరైన వ్యాపార పథకం స్టార్టప్‌ల అభివృద్ధికి ముఖ్యమని చెప్పారు. ప్రభుత్వ వ్యవస్థలతో కలిసి పనిచేయడం ద్వారా స్టార్టప్‌లు మార్కెట్‌కు త్వరగా చేరుకుని అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. పెట్టుబడిదారుల దృష్టికోణం నుంచి సాంకేతిక స్టార్టప్‌ల విజయానికి అవసరమైన ముఖ్య అంశాలను వివరించారు. ముఖ్యంగా బయోటెక్, మెడ్టెక్ రంగాలలో స్థిరమైన కంపెనీల నిర్మాణం గురించి తన అనుభవాలను పంచుకున్నారు. విఫలం అవడం సహజమే కానీ ప్రయత్నం ఆపకూడదని సూచించారు. అలాగే సహ వ్యవస్థాపకులను ఎంపిక చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, మంచి బృందాన్ని నిర్మించుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. స్టార్టప్ ప్రయాణం కష్టతరమైనదైనా, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష ఈ బూట్ క్యాంప్ నిర్వహణకు తమ మద్దతు, ప్రోత్సాహాన్ని అందించారన్నారు. ఎస్‌ఎస్‌ఐఇ- టిబిఐ సిఇఒ డాక్టర్ జె.సూర్యకుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా జీవితంలో విలువలు, విశ్వసనీయత ప్రధానం

### - తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష



తిరుపతి, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: రాజకీయాల పరంగా ప్రజా జీవితంలో విలువలు విశ్వసనీయతతో ఉండటం ప్రధామని, ఇదీ ప్రతి రాజకీయనేత పాథమిక బాధ్యత అని తిరుపతి నగరపాలక కౌన్సిల్ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష అభిప్రాయపడ్డారు. మనల్ని గెలిపించుకున్న ప్రజలకు ఏమి చేశాం అనే దాని కన్నా వారితో ఎలా ఉన్నాం అనేది కీలకమని అర్థం చేసుకున్నాననన్నారు. మనల్ని ఎన్నుకున్న ప్రజల పట్ల మనకు అవకాశం ఇచ్చిన పార్టీ పట్ల విధేయతతో మెలగడమే రాజకీయాల్లో అనుభవం అన్నారు. తిరుపతి నగరపాలక కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో చివరగా సోమవారం ఆమె కార్యాలయం చేరుకుని, అధికారులు, ఉద్యోగులు సిబ్బందితో కలసి ఆప్యాయంగా పలకరించారు. గత ఐదేళ్ళు తనకు అన్ని విధాలా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా జీవితంలో ఈ రోజు ఒక చిరస్మరణీయమని అన్నారు. చిరుద్యోగి నుండి ఉన్నతాధికారి వరకు తనపట్ల చూపిన ఆప్యాయతలు మరచిపోలేనన్నారు. తిరుపతి నగరానికి తొలి మేయర్‌గా పనిచేసే అవకాశం రావడమే గొప్ప అరుదైన గౌరవమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒక డాక్టర్‌గా అనేక క్లిష్టమైన కేసులను చూసిన తనకు ఈ రోజు కార్యాలయంలో ఇదే చివరోజు కావడం, సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పే సమయంలో వాళ్ళందరూ కన్నీళ్లు పెట్టుకుని సాగనంపినప్పుడు ఆ ఒత్తిడిని తట్టుకోలేక పోయానని భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏదో పోగొట్టుకున్నాను అనే దానికంటే ఏదో సాధించి కార్యాలయం నుంచి వెళుతున్నాను అన్న సంతృప్తి మిగిలిందన్నారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష ప్రతి ఉద్యోగి వద్దకు వెళ్లి వినమ్రంగా ధన్యవాదాలు చెప్పారు. నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్యతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోండి

### - మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నెల్లూరు క్రైమ్, మార్చి 16 ప్రభాతవార్త: వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్న కూటమి ప్రభుత్వం, అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఇతర వైసిపి నాయకులతో కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతుందని విమర్శించారు. వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి రెండు ఏళ్ళుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హత్య కేసులో అసలైన నేరస్థులను వదిలిపెట్టి పిన్నెల్లి, ఆయన సోదరుడుపై అక్రమ కేసు మోపారని, గతంలో ఎస్పీ సైతం ఈ హత్య కేసులో వారికి సంబంధం లేదు అని చెప్పారని గుర్తు చేశారు. 96 రోజుల నుండి పిన్నెల్లి సోదరులు జైలు జీవితం అనుభవిస్తున్నారని, పిన్నెలి ఆరోగ్యం క్షీణించిందన్నారు. ఛార్జ్ షీట్ వేసి 90 రోజులు పైన అయినా బైయిల్ రాలేదని అన్నారు. ఈ దుశ్చర్యకు తగిన ప్రతిఫలం చంద్రబాబు, లోకేష్ అనుభవిస్తారని ధ్వజమెత్తారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు, రేపు వైయస్ఆర్ సీపీ అధికారంలోకి వస్తే, ఇలాంటి చర్యలే పునరావృతం అవుతాయని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, ఆనం విజయ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# లారీ- ఆటో ఢీ : మహిళ మృతి



కోవూరు (నెల్లూరు), మార్చి 16 ప్రభాతవార్త: కోవూరులోని చౌదరి పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామానికి చెందిన ఓ గర్భిణి స్త్రీని నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి ఆటోలో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ ఆటోలో రాజుపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కే ఆయేషా(39) డ్రైవర్‌తో పాటు మరో మహిళ కూడా వెనుక కూర్చుని ఉంది. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి కావలికి వెళ్తున్న ఆటో మార్గమధ్యంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా ఆటోలో ఇరుక్కున్న వారిని ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులు ఎట్టకేలకు బయటకు తీసి 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి కోవూరు పోలీసులు చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న రాజుపాలెంకు చెందిన ఎస్‌కే ఆయేషా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మిగిలిన ముగ్గురు తేలికపాటి గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపి కేసు నమోదు చేస్తున్నట్లు కోవూరు ఎస్సై ముత్యాలరావు తెలిపారు.



# టిడిపి నేతలు చెప్పేవన్నీ అసత్యాలే

### -వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి

విజయవాడ, మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ సీఎం జగన్ ఏ సమయంలోనైనా ప్రజా సమస్యలపై స్పందించి పనిచేస్తారని వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేసారు. వైసిపి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. అసత్యాలను సత్యాలుగా ప్రచారం చేస్తుందన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ పరిశీలకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. పార్టీ భవిష్యత్ విజయానికి సంస్థాగత బలోపేతం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో సమన్వయం పెంచి, గ్రాస్‌రూట్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి, వాటి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని, పరిశీలకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు సపోర్టింగ్ సిస్టమ్‌లా పనిచేయాలని ఆదేశించారు. గత 15 ఏళ్లుగా వైసిపి ప్రజల పక్షాన నిలబడిందని, ఇప్పుడు 16వ ఏడాదిలోకి అడుగుపెట్టిన తరుణంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సజ్జల పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగన్ హయాంలో జరిగిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలని, అదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా టిడిపి సాగిస్తున్న తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని సజ్జల చెప్పారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాలని దిశానిర్దేశం చేశారు.

# ఎడ్ల పరుగు ప్రదర్శనకు విశేష స్పందన

### - విజేతలకు భారీగా నగదు

### ప్రోత్సాహకాలు అందజేత - రాష్ట్రస్థాయి

### ఎడ్ల విజేత బాపట్ల జిల్లా ఎడ్ల జట్టు



కోవూరు (నెల్లూరు), మార్చి 16 ప్రభాతవార్త: కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్ర సీడ్స్ గోదాము సమీపంలో ఉగాది పర్వదినం సందర్భంగా గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పరుగు ప్రదర్శనను కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 58 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహంగా ప్రకాశం, చీరాల, బాపట్ల జిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా రైతులు ఉత్సాహంగా వచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ పోటీలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ ప్రత్యేకంగా అభినందించారు.

**విజేతలు వీరే:** కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని మిత్రా సీడ్స్ సమీపంలో ఉగాది పర్వదినం సందర్భంగా గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ ఆద్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ యడ్ల ప్రదర్శన పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పోటీలలో మొదటి బహుమతిని బాపట్ల జిల్లా కంకటపాలెం గ్రామానికి చెందిన కొండేటి పద్మ, ఎడ్ల జట్టు కైవశం చేసుకుంది. విజేతకు 50 వేల నగదు భారీ కప్పు అందజేశారు. రెండో బహుమతిని చాముండేశ్వరీ సి ఫుడ్స్ గంగపట్నం ఎడ్ల జట్టు 30000 నగదు బహుమతిని కప్పును కైవసం చేసుకున్నారు. మూడో బహుమతిని గంగపట్నం గ్రామానికి చెందిన పంచాల మోక్షరెడ్డి ఎడ్ల జట్టు 25 వేలు నగదు బహుమతి కప్పును కైవసం చేసుకున్నారు. నాలుగో బహుమతిని ప్రకాశంజిల్లా పందిపాడు గ్రామానికి చెందిన అభయాంజనేయస్వామి ఎడ్ల జట్టు 20000 నగదు బహుమతిని, వెండి కప్పును కైవశం చేసుకున్నారు. ఐదో బహుమతిని బాపట్ల జిల్లా కంకటపాళెం గ్రామానికి చెందిన వంకాయలపాటి నారాయణ ఎడ్ల జట్టు పదివేల రూపాయాలు నగదు కప్పును కైవసం చేసుకున్నారు.. ప్రశాంతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ పోటీలను నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ గునుపాటి తులసీరామ్‌రెడ్డి మెమోరియల్ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా బ్యాంక్ సీఈవో గునుపాటి ప్రసాద్‌రెడ్డి, గునుపాటి దయాకర్‌రెడ్డి, మిత్ర సీడ్స్ అధినేత గునుపాటి మిత్రా రెడ్డి, సురేష్, కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బిరదవోలు భాస్కర్‌రెడ్డి, విగ్రహం విష్ణువర్ధన్, తదితరులు ఉన్నారు.



ong-7_ong-7.qxd 3/17/2026 12:18 AM Page 1



# దివ్యాంగులకు అండగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

- సొంత నిధులతో ఐదు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ



**గాజువాక, మార్చి 16,ప్రభాతవార్త**

తమకు ఎదురవుతున్న రవాణా కష్టాలను విన్నవించుకున్న దివ్యాంగుల పట్ల గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మానవత్వాన్ని చాటుకున్నారు. గాజువాక నియోజకవర్గానికి చెందిన ఐదుగురు దివ్యాంగులు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే స్పందించిన పల్లా.. తన సొంత నిధులతో సుమారు 25 వేల విలువైన ఐదు బ్యాటరీ ట్రై సైకిళ్లను కొనుగోలు చేశారు. సోమవారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎవరైనా దివ్యాంగులు ఇబ్బందులు పడుతుంటే తన దృష్టికి తీసుకురావాలని, వారికి అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి (69వ వార్డు), 86వ వార్డు ఇన్ఛార్జి నల్లూరి సూర్యనారాయణ, 85వ వార్డు అధ్యక్షుడు కర్రీ దశేంద్ర, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రతన్‌కాంత్, బీసీ నేతలు పోతిన వెంకటరావు, దొడ్డి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త 26

# అవినీతికి కేరాఫ్‌గా "గ్రేటర్" ప్లానింగ్..!

- అధికమైన అక్రమ నిర్మాణాలు జోరు
- మధురవాడ, గాజువాక, పెందుర్తి జోన్లలో మరింత అధికం
- మధురవాడ ప్లానింగ్ బాస్ రూటే సపరేట్
- కొన్ని జోన్ల ప్లానింగ్ విభాగంలో ఏసీబీ సోదాలు
- కీలక సమాచారం సేకరించిన అధికారులు




**(ప్రభాతవార్త విశాఖపట్నం)**

"గ్రేటర్" టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతికి కేరాఫ్ గా మారింది. ఈ విభాగంలో జరుగుతున్న అవినీతి కంపుపై ప్రత్యేకించి ఫిర్యాదులు రావడంతో.. రాష్ట్రవ్యాప్తం దారుల్లో భాగంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఇక్కడ కూడా చర్యలకు పూనుకున్నారు. భవన నిర్మాణాలపరంగా ఏ పని చేయాలనుకున్నా.. ప్రతి పనికి ఒక రేటు పెట్టి.. నిర్మాణదారులను వేధించడం "గ్రేటర్" పరిపాటిగా మారి పోయింది. అక్రమ భవన నిర్మాదారులను ప్రోత్సహించడం మరింత అధికంగానే జరుగుతుంది. తెర వెనుక అవినీతి లావాదేవీలు మాటలా వున్నా.. కొందరు అధికారులు మాత్రం నేరుగానే ఫోన్ పే ద్వారా సొమ్ములు తీసుకునే ప్రయత్నం చేశారంటే వారి ధైర్యం ఏంటో ఇట్టే అవగతమవుతోంది. ప్రతి పనిలో డబ్బులు ఇస్తేగానీ ఏ పని చేయరనేది వాస్తవం. ముఖ్యంగా అనధికార నిర్మాణాల విషయంలో లక్షలు వసూలు చేస్తున్నారనే వాదన ఉంది. బీపీఎస్ ముసుగులో జీవీఎంసీ పరిధిలో ఎన్ని అక్రమ కట్టడాలు నిర్మించారో..? ఎవరికీ తెలియని పరిస్థితి. గొప్ప విషయం ఏటంటే ఆయా కట్టడాలకు ప్రత్యేకించి రేట్లు విధించడం.. మధురవాడ జోన్ ప్లానింగ్ ఖిబాస్ఖి బాగా తెలిసినట. లంచాల రూపంలో వచ్చే ప్రతి అంశంలోను తన దైన ముద్ర వేసుకున్నారనే ఆరోపణలు అధికంగానే ఉన్నాయి. బాధితులు ఎవరు వచ్చినా.. ఏమీ పరిస్థితులు బాగులేవు.. మా చేతిలో ఏం ఉంటుంది.. మేమేం చేయలేం కదా అంటూ.. అవినీతి సొమ్ముల రేటు పెంచడానికి చాలా తపనపడుతూ ఉంటారు. ఏమైనా ప్రశ్నిస్తే.. బిజీగా ఉన్నాం అంటూ దాట వేస్తారు అ ప్లానింగ్ "బాస్".

మిగతా 8..లో

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**భీమిలి, మార్చి 16, ప్రభాతవార్త**



తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలి క్యాంప్ కార్యాలయంలో సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మదరాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అమరావతిలో పొట్టి శ్రీరాములు పేరిట ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేసి 58 అడుగుల విగ్రహాన్ని నిర్మించిందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, కొప్పల రమేష్, కనకల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన ఈపీడీసీఎల్ ఉద్యోగి కుటుంబానికి రూ.1 కోటి బీమా పరిహారం అందజేత

**విశాఖపట్నం, మార్చి 16: ప్రభాతవార్త**



విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తు మరణించిన ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగి కుటుంబానికి కార్పొరేట్ ప్రమాద బీమా కింద రూ.1 కోటి పరిహారం అందజేశారు. కాకినాడ సర్కిల్‌కు చెందిన పెద్దాపురం సెక్షన్‌లో జేఎల్ఎం గ్రేడ్॥ (ఎనర్జీ అసిస్టెంట్) గా పనిచేసిన అరుమిల్లి రామకృష్ణ గత ఆగస్టులో జరిగిన ప్రమాదంలో మరణించారు. ఆయనకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ శాలరీ సేవింగ్స్ ఖాతాకు అనుబంధంగా ఉన్న ప్రమాద బీమా పరిహార మొత్తమైన రూ.1,00,00,000 (ఒక కోటి రూపాయలు) ను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ గారి చేతుల మీదుగా నామినీ అయిన ఆయన తల్లి ఎ. సూర్య కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ఇలాంటి క్లిష్ట సమయాలలో ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు బ్యాంకులతో కుదుర్చుకున్న కార్పొరేట్ శాలరీ ఖాతాలకు సంబంధించిన బీమా పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమం పట్ల ఏపీఈపీడీసీఎల్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.హరిబాబు, ఎస్‌బీఐ అమరావతి డీజీఎం అశోక్ వి. సోనునే, విశాఖపట్నం ఏజీఎం ఎస్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్లు ఏ.శ్రీనివాస్, ఎల్.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## వియంఆర్‌డిఎలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**విశాఖపట్నం, మార్చి 16: ప్రభాతవార్త**



అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా వియంఆర్‌డిఎలో ఆయన చిత్రపటానికి మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్ పుష్పాంజలి ఘటించారు. అనంతర ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టి 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి మద్రాస్ రాష్ట్రం నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని సాధించి ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప త్యాగ ధనుడు, మహనీయుడు పొట్టి శ్రీరాములు గారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగం వల్ల కర్నూలు రాజధానిగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, అంతే కాకుండా ఆయన మరణం తర్వాత దేశంలో కేరళ, కర్ణాటక మహారాష్ట్ర, పంజాబ్ వంటి భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాదులు పడ్డాయని అన్నారు. అందుకే, పొట్టి శ్రీరాములు గారు తెలుగువారి గుండెల్లో అమరజీవిగా, గొప్ప దేశ భక్తుడిగా, చిరస్థాయి నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేద్దాం

- రాష్ట్ర మంత్రులు అనిత, రవీంద్ర!
- కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలి

**(నక్కపల్లి/ అడ్డరోడ్డు,మార్చి 16, ప్రభాతవార్త)**



ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో కూటమి నేతల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లి రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతా బందోబస్తు, కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. పర్యటనకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో జనసమీకరణ, ఆహారం, రవాణా తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి తొలిసారి పాయకరావుపేటకు వస్తున్న నేపథ్యంలో భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి అనిత అధికారులకు సూచించారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో జిల్లాలో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళికలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ లక్ష్యాలను ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ఆశయాలు, ప్రజల కోసం చేపట్టిన

మిగతా 8..లో

## గాజువాకను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు
- 65వ వార్డులో రూ 2.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**గాజువాక,మార్చి 16,ప్రభాతవార్త**

జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డులకూ సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గాజువాక 65వ వార్డు భానోజీతోటలో సుమారు 2.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ పనులకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం

మిగతా 8..లో



## ఖాకీ చేయూత.. చెదరని విద్యా స్వప్నం!

- పరీక్షా కేంద్రం మారిందని విద్యార్థిని రోదన....ఆపద్బాంధవుల్లా ఆదుకున్న గాజువాక పోలీసులు

**గాజువాక, మార్చి 16,ప్రభాతవార్త**



ఆ విద్యార్థిని కళ్లలో భయం.. చేతిలో హాల్ టికెట్ ఉన్నా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పరీక్ష సమయం దగ్గరపడుతోంది.. కానీ తాను వెళ్లాల్సిన కేంద్రం అది కాదని ఇన్విజిలేటర్ చెప్పడంతో ఆ బాలిక ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. తల్లిదండ్రులు అప్పటికే ఆమెను వదిలి వెళ్ళిపోయారు. ఏం చేయాలో పాలుపోక కన్నీరు మున్నీరవుతున్న ఆ విద్యార్థిని పాలిట పోలీసులు ఆపద్బాంధవులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.... గాజువాక హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి పరీక్షల సందర్భంగా ఒకఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఒక విద్యార్థిని

మిగతా 8..లో

## ప్రజాదర్బార్ వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు

- వియంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్



**విశాఖపట్నం, మార్చి 16: ప్రభాతవార్త**

వియంఆర్‌డిఎలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కి వచ్చి అందజేసిన వినతుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని వియంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సోమవారం ఉదయం వియంఆర్‌డిఎ కార్యాలయం 3వ అంతస్తు సమావేశమందిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ యన్ తేజ్ భరత్‌తో కలిసి ప్రజాదర్బార్‌లో పాల్గొని, ప్రజల నుంచి వినతులు అందుకున్నారు. ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతి సమస్య గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వినతులను, ఫిర్యాదులను నిర్దేశించిన

మిగతా 8..లో

## చంద్రంపాలెం హైస్కూల్ అభివృద్ధికి కృషి: గంటా

**మధురవాడ, మార్చి 16, ప్రభాతవార్త**

రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు చదువుతున్న చంద్రంపాలెం హైస్కూల్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం సాయంత్రం హైస్కూల్ ను ఆయన సందర్శించారు. విద్యార్థులు ఆడుకునే గ్రౌండ్ లో వర్షపు నీరు నిలవకుండా ఒకటి, రెండు రోజుల్లో చేపట్టబోయే పనులు స్కూల్ పునః ప్రారంభం నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు భోజనం చేయడానికి వీలుగా స్కూల్లో డైనింగ్ హాల్ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా స్కూల్లో సెక్యూరిటీని పటిష్టం చేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు పోలీస్ పెట్రోలింగ్ తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. హైస్కూల్ నీటి అవసరాల కోసం బోరు తవ్వించడంతో పాటు మున్సిపల్ వాటర్ కనెక్షన్ కూడా ఇవ్వాలని.. సంప్ ఏర్పాటు చేయాలని

మిగతా 8..లో



ong-9_ong-9.qxd 3/17/2026 12:19 AM Page 1



## టీడీపీ అంటే తెలుగు డ్రగ్స్ పార్టీ

**- విశాఖ జిల్లా అధ్యక్షుడు కే కే రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు**

**విశాఖపట్నం మార్చి 15 ప్రభాతవార్త**



ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ డ్రగ్స్ సేవిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటనపై విశాఖ జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు కే.కే. రాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎం అప్పారావుతో కలిసి ఆయన మాట్లాడుతూ, కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఖిడ్రగ్ కేపిటల్‌ఖిగా తయారైందని విమర్శించారు. అసలు టీడీపీ అంటే ఖితెలుగు డ్రగ్స్ పార్టీఖి గా మారిందని.. మండిపడ్డారు. అధికార తెలుగుదేశం పార్టీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ డ్రగ్స్ సేవిస్తూ హైదరాబాద్ ఈగిల్ టీంకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన ఘటనతో రాష్ట్ర ప్రజలు విస్తుపోతున్నారు. టీడీపీ అంటే తెలుగు డ్రగ్స్ పార్టీ గా మారింది. కూటిమి పాలనలో రాష్ట్రంలో గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా సరఫరా జరుగుతుంటే.. ఇందులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పాత్ర చాలా స్పష్టం కనిపిస్తుందా నీకు చెప్పారు. విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి పాలనలో డ్రగ్స్, గంజాయి దందాలతో పాటు మహిళలపై అఘాయిత్యాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఏకంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులే డ్రగ్స్ సేవిస్తూ పట్టుబట్టం సిగ్గు చేటు అన్నారు. ఈ సమావేశం గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కట్టుమురి సతీష్,రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధులు కొండా రాజీవ్ గాంధీ పాల్గొన్నారు.

## ఈ నెల 18న కోరాడ గ్రామంలో వైఎస్ షర్మిలరెడ్డి పర్యటన

**పద్మనాభం, మార్చి 16, ప్రభాతవార్త**



మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా పద్మనాభం మండలం కోరాడ గ్రామంలో ఈ నెల 18 వ తేదీన రాష్ట్ర పి సి సి అధ్యక్షురాలు వై ఎస్ షర్మిల పర్యటనించ నున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హాసనీ వర్మ చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి మండల కాంగ్రెస్ అధ్యక్షులు మజ్జి వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షర్మిలరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉదయం పది గంటలకి కోరాడలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడమే కాకుండా కూలీలకి కలిగే నష్టాలను ఆమె వివరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఇంచార్జి ఎస్.రామకృష్ణ, జిల్లా ఆర్గనైజర్ గౌతమ్ పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న.. "గ్రేటర్" పాలకవర్గం పాలన

**- రేపటి నుంచి ప్రత్యేకాధికారి పాలన**

**- ఇప్పటికే ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్‌ను నియామకం చేసిన ప్రభుత్వం**

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**




జీవీఎంసీలో పాలకవర్గం పాలన మంగళవారంతో ముగియనుంది. 2021 మార్చి 18న పాలకవర్గం కొలువుదీరింది. నాలుగు సంవత్సరాల రెండు నెలలు మేర వైఎస్సార్సీపీ కి చెందిన గొలగాని హరి వెంకట కుమారి మేయర్ గా కొనసాగగా.. ఖి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు పది నెలల కాలం టీడీపీకి చెందిన పీలా శ్రీనివాసరావు మేయర్ గా కొనసాగుతున్నారు. ఈయన అదిరిపోలం మంగళవారంతో ముగిస్తోంది. బుధవారం నుంచి జీవీఎంసీలో ప్రత్యేకాధికారి పాలన ప్రారంభమవుతోంది. ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ హరేంద్రిరప్రసాద్ ను ప్రభుత్వ నియమించింది. గత 2 నెలల్లో రూ.400 కోట్లు అభివృద్ధి పనులు మంజూరు!ఖిగ్రేటర్‌ఖి పాలకవర్గం గడువు ముగిస్తున్న నేపథ్యంలో.. గత రెండు నెలల కాలంలో రూ. 400 కోట్ల అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ పనులకు శంకుస్థాపనలు చేసే పనిలో ప్రజాప్రతినిధులు బిజీ అయిపోయారు. అయితే.. ఈ పనులు పూర్తయితే.. కాంట్రాక్టు బిల్లులు చెల్లింపునకు నిధుల భారం అధికంగానే జీవీఎంసీ పై ఉంటుందని పలువురు చెబుతున్నారు.

## అభివృద్దే ప్రధాన లక్ష్యం

**గాజువాక,మార్చి 16,ప్రభాతవార్త**



వార్డును కోట్లాది రూపాయలతో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన 76వ వార్డ్ లోని ఎస్టీ కాలనీ (రూ. 20 లక్షలు), గోపాల్ రెడ్డి నగర్ డ్రైన్ (రూ. 14.38 కోట్లు), డైరీ కాలనీ పార్కు (రూ. 46 లక్షలు) అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో ముంపు సమస్యలు లేకుండా వీఆర్సీసీ డ్రైన్లను పూర్తి చేశామని, ఐదేళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జిత్తుక అప్పల రాజు, మమ్మన మురళి, కూన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## మురుగు కష్టాలకు శాశ్వత పరిష్కారం: కార్పొరేటర్ అనూష

**గాజువాక, మార్చి 16,ప్రభాతవార్త**



అక్కిరెడ్డిపాలెం వాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష పేర్కొన్నారు. సోమవారం ఆమె అక్కిరెడ్డి పాలెం విశాఖ డెయిరీ వెనుక భాగంలో, అలాగే ఏషియన్ పెయింట్స్ గోదాం సమీపంలో జరుగుతున్న వి.ఆర్.సి.సి డ్రైన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గాజువాక పరిసర ప్రాంతాలు, పరిశ్రమలు, విశాఖ డెయిరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలు అక్కిరెడ్డిపాలెంలో నిల్వ ఉండటం వల్ల పరిసరాలు కలుషితమై, భూగర్భ జలాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల చిరకాల వాంఛ అయిన ఈ డ్రైన్ నిర్మాణం కోసం జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం పనులు వేగవంతమయ్యాయని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ డ్రైన్ అందుబాటులోకి వస్తే అక్కిరెడ్డిపాలెం ప్రజలకు మురుగు నీటి బాధలు తప్పుతాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## మొదట రోజు ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్ష

**ఆనందపురం, మార్చి 16, ప్రభాతవార్త:**

ఆనందపురం మండలంలో ఐదు కేంద్రాలలో ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు మొదట రోజైనా సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆనందపురం ఉన్నత పాఠశాలలో 289 మంది, నారాయణ పాఠశాలలో 270 మంది, బోయిపాలెం ఉన్నత పాఠశాలలో 240 మంది, శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 270 మంది విద్యార్థులు వంద శాతం పరీక్షకు హాజరయ్యారు. సొంట్యాం ఉన్నత పాఠశాలలో 193 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఆర్జేడి విజభాస్కర్, ఫ్లైయింగ్ స్క్వాడ్ డిప్యూటీ ఈఓ సోమేశ్వరరావు, ఎంఈఓ గంగరాజు సందర్శించి పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లను ఆదేశించారు. సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు జరిపి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వాసవి సంఘం ఆధ్వర్యంలో అమరజీవికి ఘన నివాళులు

**విశాఖపట్నం, మార్చి 15 ప్రభాతవార్త**



అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా స్థానిక రీడింగ్ రూమ్ ప్రాంతంలో వుడ్ యార్డ్ స్ట్రీట్ లో గల వాసవి కళ్యాణ మండపం ఆవరణలో గల పొట్టి శ్రీరాములు శిలా విగ్రహానికి వాసవి కళ్యాణ మండప సంఘం ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసవి కళ్యాణ మండప సంఘ ఉపాధ్యక్షుడు దుర్గా సోమేశ్వర రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్వపు మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల పట్ల చులకన భావం, జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగమునర్చి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఈనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమని అంతేకాకుండా తదనంతర కాలములో భాష ప్రాతిపదికన ఏర్పాటయ్యిన తమిళనాడు, గుజరాత్ వంటి తదితర రాష్ట్రాలకు ఆయన మూల స్తంభం అని పేర్కొన్నారు. అటువంటి త్యాగమూర్తి ఆర్యవైశ్య కులమునకు చెందినవారు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వాసవా కళ్యాణ మండప సంఘ కార్యదర్శి నున్న గోపాల్ మాట్లాడుతూ మహాత్మాగాంధీజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేశారన్నారు. కుటుంబం కన్నా దేశమే ప్రథమం అని నినాదంతో కుటుంబాన్ని వదిలి దేశ సేవకై సమాజ సేవలో అంకితమయ్యారన్నారు పొట్టి శ్రీరాములు నిష్కలంక దేశభక్తి, నిరాడంబరమైన జీవితం నేటితరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు గారి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టడం, ఆయన పేరు మీదుగా విశ్వవిద్యాలయం నెలకొల్పడం మరియు ఆయన జయంతి, వర్ధంతి దినములను అధికారికంగా జరుపుకోవాలని ఆదేశాలు ఇవ్వడం మరియు ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న ఏ.పి. రాజధాని ప్రాంతం శాఖమూరి లో 58 అడుగుల కాంస్య విగ్రహం స్థాపించటం మంచి పరిణామం అన్నారు. ఈ సందర్భంగా హాజరైన సంఘం కోశాధికారి యలమర్తి గణేష్, సంఘం ప్రతినిధులు వెదుళ్ళపల్లి శ్రీనివాస రావు, కె.వి. రమణ, పూసర్ల సంజీవరావు, రామచంద్రరావు, నాని, గుప్త పొట్టి శ్రీరాములు శిలావిగ్రహానికి పుష్పమాలంకృతులుచేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యాన అమరజీవికి ఘన నివాళులు

**విశాఖపట్నం, మార్చి 15 ప్రభాతవార్త**



అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద కల వాసవి భవన్" ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు శిలా విగ్రహానికి ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధుల సమావేశం లో ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి నేతి శ్రీనివాస రావు మాట్లాడుతూ భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి ఆధ్యుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు బాధ్యుడు, నిష్కలంక దేశభక్తుడు అయిన పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య కులమునకు చెందినవారు కావడం మన అదృష్టం అని అన్నారు. పూర్వపు మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారికి జరుగుతున్న అన్యాయానికి నిరసనగా తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధించే దిశగా పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం అసువులు బాసిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ నివాళులర్పించారు.

## అపోలోలో లోక్లిష్టమైన హైబ్రిడ్ శస్త్ర చికిత్స విజయవంతం

**ఆరిలోవ, మార్చి16, ప్రభాతవార్త**



గుండెలో అవరోహణ బృహద్ధమనిలో చీలికకు సంబంధించిన ప్రమాదకరమైన వ్యాధికి నగరంలో మొదటిసారిగా అపోలో ఆసుపత్రి వైద్యులు క్లిష్టమైన శస్త్రచికిత్స జరిపి విజయం సాధించారు. ఈ విషయమై ఆరిలో వహెల్త్ సిటీలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వైద్య బృందం వివరాలను వెల్లడించారు. ఈ వ్యాధి వలన సాధారణంగా తీవ్రమైన ఛాతీ,వెన్నునొప్పి మరియు అధిక రక్తపోటుతో ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ లక్షణాలతో బాధపడుతున్న రోగికి డేవిడ్(43) కు శస్త్రచికిత్స చేసి అయోర్టిక్ రూటు మార్చి రోగి స్వంత అయోర్టిక్ వాల్వు అలాగే ఉంచారు. తరువాత రోగికి మళ్లీ ఛాతి నొప్పి, అధిక రక్తపోటు సమస్యలు కనిపించగా,.దీనికి పరిష్కారంగా హైబ్రిడ్ ఇంటర్వెన్షన్ చేయాలని నిర్ణయించి ఈ శస్త్రచికిత్సను డాక్టర్ చక్రధర్ పెద్ద ఆధ్వర్యంలో నిర్వహించారు.మొదటి దశలో మెడ రక్తనాళాలను డీబ్రాంచింగ్ చేసి మెదడు మరియు పై అవయవాలకు రక్త సరఫరా సురక్షితంగా ఉండేలా చేశారు.తరువాత క్యాథ్ ల్యాబ్లో అమర్చి డిసెక్షను విజయవంతంగా సరిచేశారు.రోగి శస్త్రచికిత్స అనంతరం మంచి ఆరోగ్యంతో కోలుకొని 5 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారని వైద్యులు తెలిపారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రధర్ పీడాద, డాక్టర్ బారువా, డాక్టర్ పాణిగ్రాహి, డాక్టర్ జైదీప్ త్రివేది, డాక్టర్ భార్గవి, అపోలో హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ మరియు ఇతర వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌లో సీతారామ్‌కు బ్రౌన్జ్ మెడల్

**విశాఖపట్నం, మార్చి 15 ప్రభాతవార్త**



మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ లో నగరానికి చెందిన జి సీతా రామ్ బ్రౌన్జ్ మెడల్ సాధించారు. సోమవారం హెచ్.ఎల్.సి 2 లో ఆయనకు స్టేట్ బ్యాంక్ తరపున ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ ఎల్ సి 2 ఏజీఎం కే మల్లికార్జునరావు మాట్లాడుతూ కృషి ఉంటే మనిషి ఏదైనా సాధించగలరని దానికి వయసుతో సంబంధం లేదని మరోసారి జి సీతారాం నిరూపించారని తెలిపారు. ఆయన ముందు డిఫెన్స్ లో ఆర్మీ సిబ్బంది గా పనిచేసి దేశానికి ఆయన వంతు సేవలు అందించారన్నారు. మంచి క్రమశిక్షణ గల వ్యక్తిగా గుర్తింపు పొందారని అక్కడ పదవి విరమణ జరిగిన తర్వాత స్టేట్ బ్యాంకులో చేరి ఆయన వంతు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాల వయసులో మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎన్నికై థాయిలాండ్ లో జరిగిన రచ్చ బూరి లో 400 మీటర్ల పరుగు మెడల్ సాధించడం చాలా గర్వకారణంగా ఉందని ఇటువంటి విజయాలు ఇంకా ఆయన సాధించాలని ఆయన కోరారు. ఇటువంటి వ్యక్తులు తమ స్టేట్ బ్యాంకులో ఉండడం తమ అదృష్టమని చెప్పారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ తనకు చిన్నతనం నుండి అంత ప్రోత్సాహం లేదని ఆర్థిక పరిస్థితులతో ఉద్యోగంలో చేరవలసి వచ్చిందని పదవీ విరమణ చెందిన తర్వాత స్టేట్ బ్యాంకులో చేరి బ్యాంకు సిబ్బంది ప్రోత్సాహంతో తాను వయసును మరిచి ముందుకు సాగానని చెప్పారు. తనకు ప్రోత్సహించిన బ్యాంకు తోపాటు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు ఆర్ . శ్రీనివాసు, బసవ శ్రీనివాసరావు, పి సూర్యశంకర్ తోపాటు హెచ్ ఎల్ సి 2 ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మనాభంలో ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

**పద్మనాభం, మార్చి 16, ప్రభాతవార్త**



మండలంలో రెడ్డిపల్లి,పద్మనాభం,ఆర్ వి పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన సమయం ప్రకారమే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది విద్యార్థుల హాల్ టిక్కెట్లును పరిశీలించి పంపారు. అలాగే మంచినీరు, వైద్య శిబిరాలు, పోలీసులను ఏర్పాటు చేసారు. అలాగే ఎంఈఓ పి రమణ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసారు.మూడు కేంద్రాలలో 666 మంది విద్యార్థులు పది పరీక్షలను రాసారని ఆయన చెప్పారు.

## నూకాంబిక జాతరలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**ఆరిలోవ, మార్చి 16, ప్రభాతవార్త**



పాత డెయిరీ ఫారం వెటర్నరీ కాలనీలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఉదయం ఆలయ ప్రాంగణంలో దుర్గా హోమం తదుపరి సామూహిక లలితా సహస్ర పారాయణ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం జరగనున్న జాతర వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

## పండిట్ దీన్ దయాళ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ఆనందపురం, మార్చి 16, ప్రభాతవార్త**



ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని బలోపేతం చేయడానికి వచ్చే నెలలో నిర్వహించనున్న పండిట్ దీన్ దయాళ్ మండల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు పిల్లా విజయ కోరారు. ఆనందపురం మండలం దుక్కవానిపాలెంలో బీజేపీ నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ మండల ప్రచార కార్యక్రమం ఏప్రిల్ 4, 5 తేదీలలో జరగబోతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంచార్జిలగా కె.వి.వైన్ కృష్ణారావు (గోపి), అడ్డూరి సురేష్, డి.పి. రాజు, నిమ్మకాయల అప్పలరాజు నియమించబడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలను బలోపేతం చేయడం మరియు నరేంద్ర మోదీ పథకాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు, ప్రసాద రావు పట్నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవీఎంసీ నార్త్ జోన్ పీజీఆర్ఎస్ కు 9 ఫిర్యాదులు

**మాధవధార, మార్చి 16, ప్రభాతవార్త**



మాధవధార ఉడా కాలనిలో గల జీవీఎంసీ నార్త్ జోన్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కు 9 వినతులు వచ్చాయి. ఈ వినతులను నార్త్ జోన్ జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము పరిశీలించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని వినతులు స్వీకరించారు. వీటిలో యూసిడి 2, టౌన్ ప్లానింగ్ 2, ఇంజినీరింగ్ 2, రెవిన్యూ 2,పబ్లిక్ హెల్త్ 1 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ వర్క్ ఈ.ఈ పద్మావతి,ఏ ఎం ఓ హెచ్ అప్పలనాయుడు,ఏపీడి పుణ్యవతి,టీపీవో ప్రవీణ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ అధికారులు ఉన్నారు.

## మార్చి 27న సీతారాముల కళ్యాణం

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



స్థానిక మెయిన్ రోడ్ లో గల శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో తేదీ:27న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం 10:12 లకుప్రారంభమగును. ఈ కల్యాణమునకు రు 300/ చెల్లించిన వాళ్లకి కళ్యాణం లడ్డు, పులిహోర ప్రసాదము, తలంబరాలు ఇవ్వబడునని అల్లు జగన్నాధరావు తెలియచేసినారు. మధ్యాహ్నం, 12:30లకు అన్నసమారాధన జరుగును. సిరికి నానాజీ బాబు కార్యనిర్వాహనాధికారి శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం మెయిన్ రోడ్ విశాఖపట్నం.

## ఘాట్ రోడ్డు అభివృద్ధితో అనంతునికి పెరిగిన హుండీ ఆదాయం

**పద్మనాభం, మార్చి 16,ప్రభాతవార్త**



పద్మనాభం గ్రామంలో వేంచేసియున్న అనంతపద్మనాభస్వామి ఘాట్ అభివృద్ధి చెందడంతో అనంతుని హుండీ ఆదాయం పెరిగింది. గతంలో ఉత్సవాలలో తప్ప ఖాళీ రోజులలో భక్తులు ఉండేవారు కాదు. ఘాట్ రోడ్డు వేయడంతో రోజువారి భక్తులు రద్దీ పెరిగింది. దీంతో అనంతుని, కొండ దిగువన ఉన్న కుంతీమాధవస్వామి హుండీ ఆదాయాలు పెరిగాయి. సోమవారం ఈ ఒ పి ఎల్ ఎన్ రాజు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. గత సంవత్సరం నవంబర్ నుండి నేటి వరకు హుండీ ఆదాయం మూడు లక్షల 67 వేల 657 రూపాయలు వచ్చిందని ఈ ఒ చెప్పారు. గత పది సంవత్సరాల నుండి ఏడాదికి ఒకసారి లెక్కించగా మూడు లక్షల పైబడి ఆదాయం వచ్చేది. ప్రస్తుతం నాలుగు నెలలకి మూడున్నర లక్షలు రావడం ఉత్సవకమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సన్నిబాబు ,బుగత రాము, కాళ్ల శ్రీను పాల్గొన్నారు.

## సింహాచల వేద పాఠశాల విద్యార్థులను సత్కరించిన ఈవో

**సింహాచలం, ప్రభాతవార్త**



సింహాచల పుణ్యక్షేత్రం కేవలం భక్తికే కాదు,జ్ఞానసముపార్జనకు కూడా నిలయమని మరోసారి నిరూపితమైంది. శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థాన ఆధ్వర్యంలో నడుస్తున్న వేద ఆగమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటి దేవస్థాన కీర్తిని దశదిశలా వ్యాప్తి చేశారు. తిరుపతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఖిశ్రీ వేంకటేశ్వర వేద విద్వత్ సదస్సుఖి లో శుక్ల యజుర్వేద విభాగంలో సింహాచల,విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కఠినమైన ఖిక్రమాంతంఖి పరీక్షల్లో విజయాన్ని సాధించి దేవస్థానానికి కీర్తి తీసుకువచ్చారు. వేద ఆగమ పాఠశాలకు చెందిన విద్యార్థులు యశ్విక్, ఋషిక్, శివరాం, రాజేంద్ర కుమార్ ఈ పరీక్షల్లో అత్యుత్తమమార్కులతో ఉత్తీర్ణత సాధించి, వేద విద్యలో తమ పట్టును నిరూపించుకున్నారు. విజేతలైన విద్యార్థులు తమ గురువులు, శుక్ల యజుర్వేద పండితులు ఆర్.వి. రాజేష్ శర్మ తో కలిసి దేవస్థాన కార్యనిర్వహణాధికారి వారి ఛాంబర్‌లోమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈవో విద్యార్థులను అభినందిస్తూ వేద విద్యను అభ్యసిస్తూ విజయాన్ని సాధించడం గొప్ప విషయం అని ప్రశంసించారు. వారి ప్రతిభకు గుర్తింపుగా ఉత్తీర్ణత పత్రాలు (సర్టిఫికెట్లు) అందజేశారు. వేద రక్షణే ధర్మ రక్షణ ఆధునిక కాలంలోనూ మన సనాతన ధర్మాన్ని, వేద విద్యను ఇంత నిష్ఠతో అభ్యసిస్తున్న ఈ విద్యార్థులు రేపటి సమాజానికి దిశానిర్దేశకులు.ఖిఖి కార్యనిర్వహణాధికారి ఈ కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంతాచార్యులు, వేద పండితులు కపిలవాయి నరసింహ మూర్తి, గోదావరి సురేష్ శర్మ,ఘనపాఠి, అడ్మినిస్ట్రేషన్ ఏఈవో రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ సూచనలను రైతులు పాటించాలి

**ఆనందపురం, మార్చి 16, ప్రభాతవార్త**



రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే అధికోత్పత్తి సాధించవచ్చని మండల వ్యవసాయధికారి సి.హెచ్ సంధ్య రత్న ప్రభ చెప్పారు. ఆనందపురం మండలంలో గొట్టిపల్లి, కుసలువాడ, బోని, మామిడి లోవ, పెద్దిపాలెం, వెల్లంకి, గిడిజాల, గండిగుండం గ్రామాల్లో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించా. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సంధ్య రత్నప్రభ గొట్టుపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వినియోగం, నీటి ఆధారిత పంటలు యొక్క ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు, రైతులు పాల్గొన్నారు.

## కోడిపందెంల స్థావరాలుపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి

**పద్మనాభం, మార్చి 16, ప్రభాతవార్త**





మండలంలో రౌతులపాలెం గ్రామ సమీపంలో ఉన్న రెడ్డివారి కళ్లాలలో ఉన్న కోళ్లఫారంలో ఆడుతున్న కోడిపందెంల స్థావరంపై ఆదివారం అర్ధరాత్రి విశాఖపట్నం టాస్క్ ఫోర్స్ సి.ఐ నేతృత్వంలో పోలీసులు మెరుపుదాడి చేసి ఏడు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకొన్నట్లు పద్మనాభం సి.ఐ. సి హెచ్ శ్రీధర్ చెప్పారు. ఈ సంఘటనపై ఆయన అందించిన వివరాలు ప్రకారం కళ్లాల ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు కోడిపందెంల స్థావరంపై దాడిచేసి ఏడు లక్షల 56 వేల 600 రూపాయలు, ఎనిమిది కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు ఐదు ఎల్ ఈ డి లైట్లు, ఎనిమిది పందెం కోళ్లు,39 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోగా పలు ప్రాంతాలకు చెందిన 73 మంది పందెం రాయళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన అన్నారు.అయితే ఈ ప్రాంతంలో చాలా కాలం నుండి ఈ కోడి పందెంలు రాత్రిపూట జరుగుతున్నాయని ప్రజలు తెలిపారు.అయితే కేసునమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన అన్నారు.

## ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు



కశింకోట, మార్చి 16, ప్రభాతవార్త:

మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 102 పరీక్ష కేంద్రాల్లో 20,577 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షల కు సన్నదమయ్యారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరీక్షలకు ముందు రోజు ఆదివారం కశింకోట పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. దూర ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం ఫ్రీ బస్సులు ఏర్పాటు చేసింది. సోమవారం నుండి ప్రారంభ మవుతున్న ఈ పరీక్షలు 9:30 కు ప్రారంభమై 12.45 వరకు సాగుతాయి. ఈ పరీక్షలు నిర్వహణ ఈ నెల ఆఖరి వరకు ఉంటాయి. ఈ సందర్భంగా ఎంఈవో సురేష్ బాబు విద్యార్థుల వివరాలను తెలుపుతూ మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలైన కశింకోట గర్ల్స్ హైస్కూల్, డిపిఎన్ స్కూల్,కర్నూల్ పాలెం,తాళ్లపాలెం,నరసింగబిల్లి లో 1043 మంది విద్యార్థులు పరీక్షల రాయవలసి ఉండగా ఇద్దరు ఆబ్సెంట్ అయ్యారని 1041 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ ఏర్పాటు చేశారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు...

### బాలిక ఉన్నత పాఠశాల సమీపంలో ట్రాఫిక్ తో ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

ఎలమంచిలి ,మార్చ్ 16, ప్రభాతవార్త:



పట్టణంలోని పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సెంట్ మేరీస్, కోర్టుపేట వద్ద కల ప్రభుత్వ బాలుర పాఠశాల, గర్ల్స్ హై స్కూల్, చైతన్య పాఠశాలలో 890 మంది పదో తరగతి విద్యార్థులకు గాను 887 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓ సూర్యప్రకాశరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సిఐ ధనుంజయ్ రావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్సై సావిత్రి, ట్రాఫిక్ ఎస్సే రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలలోకి విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం కేంద్రాలలోకి అనుమతినిచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నాలుగు సెంటర్ల వద్ద పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో పాటు విద్యార్థులు కేంద్రాల వద్దకు రావడంతో బాలిక ఉన్నత పాఠశాల ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఎదుర్కొనవలసి వచ్చింది.

## భయం భయంగా పరీక్ష కేంద్రాలు..

### ఎప్పుడు స్లాబ్ పెచ్చులు ఊడిపోతాయో తెలియని పరిస్థితి...

### పూర్తి పర్యవేక్షణతో అధికారులు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారా?



ఎలమంచిలి, మార్చి 16, ప్రభాతవార్త:

పట్టణంలోని బాలిక ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసేటప్పుడు రూములను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి పరీక్షలకు అణువుగా ఉన్నాయా లేదా అన్నది చూడవలసిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉన్నది. కానీ బాలిక ఉన్నత పాఠశాలలోని రెండు మూడు నాలుగు ఐదు గదులలో స్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడిపోతాయో తెలియని పరిస్థితిలో ఉండగా అక్కడే పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల క్రితమే ఒక గదిలో స్లాబ్ పెచ్చు వూడి ఫ్యాన్ రెక్క పై పడటంతో తృటిలో ప్రమాదం తప్పింది. కానీ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా అక్కడే పరీక్ష నిర్వహించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యా శాఖలో ఉన్న అధికారులు తక్షణమే స్పందించి పరీక్షా కేంద్రాలు అనువుగా ఉన్నాయో లేదా అనేది స్పష్టంగా చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉన్నది. ఏదైనా జరగకూడని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఉన్నత అధికారులు వెంటనే స్పందించి బాలిక ఉన్నత పాఠశాల ఆవరణలో గల తరగతి గదులను పరిశించాలని పలువురు కోరుతున్నారు.. పరీక్షా కేంద్రాల కూత వెయిట్ దూరంలోనే జిరాక్స్ దుకాణం తెరిచే ఉన్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వివరిస్తున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు ఉండకూడదని స్పష్టంగా అధికారులు తెలియజేస్తున్న ఇక్కడ విద్యాశాఖ అధికారులు మాత్రం తమకు ఎందుకులే అంటూ వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరీక్షా కేంద్రాల సమీపంలో గల జిరాక్స్ దుకాణాలను పరీక్ష నిర్వహించేటప్పుడు మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

## నేటి నుండి 24 వ తారీకు వరకు పెద్దపల్లి రైల్వే గేట్ మూసివేత..

ఎలమంచిలి మార్చి 16 ప్రభాతవార్త:

పట్టణములో నుండి రాంనగర్ పెద్దపల్లి గొల్లలపాలెం చిన్న గొల్లలపాలెం మంత్రిపాలెం వెంకటాపురం వెళ్లే వాహనాలకు రైల్వే గేట్ నేటి నుండి అనగా మంగళవారం నుండి ఈ నెల 24వ తారీఖు వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర రైల్వే ట్రాక్ నిర్వహణలో పనులలో భాగంగా ఈ రైల్వే గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ఇటుగా ప్రయాణించే ప్రజలు ట్రాఫిక్ దృశ్య ఎర్రవరం అండర్ బ్రిడ్జి ద్వారా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

## నూకాంబిక జాతరపై అధికారులతో ఎమ్మెల్యే కొణతాల సమీక్ష

అనకాపల్లి మార్చి 16 (ప్రభాత వార్త)



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య జాతర ఈనెల 17 నుండి ఏప్రిల్ 17 తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ కృషి మేరకు అమ్మవారి జాతర తొలిసారిగా రాష్ట్ర పండుగ గా గత ఏడాది నెల రోజులు ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది అమ్మవారి నూతన ఆలయం ప్రారంభోత్సవం గడిచిన పది రోజుల క్రితం అత్యంత వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సోమవారం మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ కార్యవర్గం, సిబ్బంది రామకృష్ణ ని పూర్ణకుంభంతో మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే త్వరలో నిర్వహించే అమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లు కోసం ప్రభుత్వ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పండగకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు పరిశీలించి వివరాలు జిల్లా అధికారులకు తెలుసుకుని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడివిశాఖ , విజయనగరం జిల్లా డిసి సుజాత , డి.ఎస్.పి శ్రావణి , జోనల్ కమిషనర్ చక్రవర్తి , ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను , కార్యనిర్వాహణ అధికారి వై శ్రీధర్ , పట్టణ , రూరల్, ట్రాఫిక్ సీఐ లు, ఎస్సై లు విద్యుత్ శాఖ అధికారులు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు మహానుభావుడు, త్యాగశీలి..

### 23న స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన : హోం మంత్రి “అనిత”

(నక్కపల్లి, ప్రభాతవార్త)



నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు మహానుభావుడు, త్యాగశీలి అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శమని పేర్కొన్నారు. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో 58 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష చేపట్టి చివరకు తుది శ్వాస విడిచారని గుర్తు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని తెలిపారు. తెలుగు ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని మంత్రి అన్నారు. ఆయన త్యాగానికి ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిలో 58 అడుగుల అమరజీవి విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తుంచుకోవాలని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వం పాలన సాగిస్తోందని హోం మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో పెద్దగా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. మహిళలు ధైర్యంగా, ఆరోగ్యంగా ఉండాలని సూచించిన మంత్రి, మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈనెల 23వ తేదీన నక్కపల్లి మండలంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరగనుందని తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి సచితా దేవి ,ఎంపీడీవో బీ. చైతన్య ,రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్ జనసేన రాష్ట్ర నాయకులు తోట నగేష్ ,పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, చించెలుపు పద్దు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, మహిళా నియోజకవర్గ కన్వీనర్ రమాకుమారి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయిన వెంకటరమణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు వెలగా శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు అయినంపూడి అప్పలరాజు, గోసల శ్రీకాంత్, తాతారావు, సర్పంచి ప్రగడ వీరబాబు, మండలం మహిళా అధ్యక్షురాలు బేగం, ఏవో దెందుకూరు సీతారామరాజు, పి - పోర్ బాధ్యులు జయరాం, ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## అన్నీ గ్రామాల్లో రైతన్నా మీకోసం- వారోత్సవాలు



(నక్కపల్లి, ప్రభాతవార్త )

మండలంలో 11812 రైతులకు సంబంధించి అన్న దాత సుఖీభవ ,పి ఎం కిసాన్ కలిపి 6.33 కోట్లు లబ్ధి చేకూరింది. అన్ని గ్రామాల్లో రైతన్నా మీకోసం- వారోత్సవాలు జరగనున్నాయి. మార్చి 16, 17 , 18, 23, 24 ,25 తేదీలలో సిబ్బంది రైతులను కలిసి వారికి వ్యవసాయ సూచనలు ఇస్తూ అర్హత ఉండి లబ్ధి చేకూరనీ రైతులు జాబితా ఫిర్యాదులను తీసుకొనవలెను. ఈ కార్యక్రమం లో భాగంగా సోమవారం నక్కపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో రైతులని కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు ముఖ్య మంత్రి ఐదు సూత్రాలు అయిన నీటి భద్రత, డిమాండ్ - ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ ,ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు పై వివరిస్తూ ప్రోత్సహించడం జరిగింది. 2026-27లో ఉండబోయే ఎల్-నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించడం, వేసవి వర్షాలను ఉపయోగించుకుంటూ, ఎల్-నినోను తట్టుకోవడానికి పద్ధతులను వివరించాలని సిబ్బంది కి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ముఖ్య మంత్రి లేఖ, కరపత్రం అందచేసి రైతుల యొక్క వివరాలు వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కాగిత లో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్,ఏ ఈ ఓ సాయి , శ్రీనివాస్,వ్యవసాయ సహాయకులు ధనరాజు, మోహన్, అజయ్ వివిధ గ్రామాల్లో ఆర్ ఎస్ కే సిబ్బంది,ప్రకృతి వ్యవసాయం సిబ్బంది,వ్యవసాయ అనుబంధ సిబ్బంది ,రైతులు పాల్గొన్నారు.

## 10.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం

అనకాపల్లి మార్చి 16 (ప్రభాత వార్త)



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అనకాపల్లి 84 వ వార్డు పరిధిలో సుమారు 10.50 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులను మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ , మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్ , రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఈ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జీవీఎంసీ, సిరసపల్లి సీతారామ గుడి వద్ద సిసి రోడ్డు , కాలువ నిర్మించుట, స్మశానవాటికకు ప్రహరీ గోడ కొరకు ప్రారంభోత్సవం, సిరసపల్లి సచివాలయం ముందు ఎన్టీఆర్ కాలనీ జంక్షన్ నుండి పోర్టు కాలనీ బస్ స్టాప్ వరకు కాలువ, కళ్యాణ మండపం మిగిలి ఉన్న పనుల నిర్మాణంనకు ప్రారంభోత్సవం, కేఎన్ఆర్ పేట ఆర్ సి సి కాలువలు, కమ్యూనిటీ హాల్, వాటర్ ట్యాంక్, జీవి పైప్ లైన్, ఓపెన్ జిమ్ నిర్మాణం కొరకు శంకుస్థాపన, కొత్తపేట రామాలయం నుండి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు , కాలవలు, కల్వర్టులు నిర్మాణం నకు శంకుస్థాపన, కొప్పాక నందు ఎస్ డబ్ల్యు కాలవ హిందూ క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహరీ గోడ, ఓపెన్ జిమ్ , సిసి రోడ్లు నిర్మాణం కొరకు శంకుస్థాపన అనకాపల్లి రింగ్ రోడ్ నుండి మార్కెట్ యార్డ్ గేట్ వరకు బీటీ రోడ్ వెడల్పు చేయడం కాలువలు, ఫుట్ పాత్ కొరకు అభివృద్ధికి శంకుస్థాపన, స్థానిక అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ హాల్ నుంచి హిమ శేఖర్ డిగ్రీ కాలేజ్ వరకు బిటి రోడ్డు, రీలయింగు ఆర్ సి సి కాలువ, ఇతర అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డ్ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి నీల బాబు , జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి , జీవీఎంసీ అధికారులు, 84 వార్డ్ జనసేన పార్టీ ఇంచార్జ్ చేబ్రోలు దుర్గ ప్రసాద్ , 84 వార్డు కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మొదలైన 10 పరీక్షలు

గొలుగొండ మార్చి 16, ప్రభాతవార్త



పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల ద్వారా 653 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. సోమవారం మొదటి రోజు కావడంతో విద్యార్థులంతా పరీక్షలకు సిద్ధమై కేంద్రాలకి తమ తల్లిదండ్రులతో తరలి వెళ్లారు. గొలుగొండ గురుకులం, ఏ ఎల్ పురం,చీడిగుమ్మల హైస్కూల్లో కేంద్రాల కొనసాగుతున్నాయి. ఏడు హై స్కూల్ కాగా మూడు సెంటర్ల ద్వారా మొదటి రోజు పరీక్షలకు 653 మంది విద్యార్థులకు గాను 648 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు ఆబ్సెంట్గా నమోదైనట్లు ఎంఈఓ 1 సత్యనారాయణ తెలిపారు. పరీక్షా సమయానికి కొంత సమలింపు ఇవ్వడంతో విద్యార్థుల్లో ఆందోళన తగ్గింది. సమయానికి ఒక్క నిమిషం లేట్ అయినా కేంద్రాల్లో కి విద్యార్థులను అనుమతిస్తున్నారు. అయితే విద్యార్థులు ఎవరు ఆలస్యం కాకపోవడం, గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవడం, తమ పరీక్షలు రాసే కేంద్రాలు గదులను హాల్ టికెట్ నెంబర్ ద్వారా పరిశీలించుకునే అవకాశం సౌలభ్యంగా వినియోగించుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గొలుగొండ ఎస్ ఐ పి రామారావు, కృష్ణ దేవి పేట ఎస్ఐ రిషికేశ్వరరావు సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాలు వెలుపుల ఎవ్వర్నీ నడయాడకుండా 144 సెక్షన్ పూర్తిగా అమలు చేశారు.

## పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేద్దాం ..

### మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు మున్సిపల్ వైస్ చైర్మన్ గుప్తా..

ఎలమంచిలి మార్చి 16 ప్రభాతవార్త



పట్టణంలోని పాత జాతీయ రహదారి కూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు మున్సిపల్ వైస్ చైర్మన్ గుప్తా. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గుప్తా మాట్లాడుతూ రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు త్యాగాన్ని సదా స్మరించుకోవడం కోసమే పొట్టి శ్రీరాములు జయంతి గుర్తు చేసుకుంటున్నామని అన్నారు. సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి గాంధీ స్ఫూర్తితో స్వతంత్ర పోరాటంలో భాగస్వామ్ అయ్యారు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటం చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఏకంగా నిరాహార దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు రంగా చిన్న వెంకటస్వామి, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కట్టా సత్యనారాయణ, కట్టమూరి బసవరాజు, కట్టా పెద్దప్ప, కుసుమంచి జోగిరాజు గుప్తా, వాసవి క్లబ్ సభ్యులు, చెక్క శ్యామ్ , డా.. పిల్లా త్రినాధరావు, పాల్గొన్నారు.

## రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

### రైతు బాగున్నపుడే రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ బాగుంటారు :జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



అనకాపల్లి మార్చి 16 (ప్రభాతవార్త)

రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి మండలం వెంకు పాలెం గ్రామం రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన'రైతన్న మీకోసం' కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు చేసిన మేలును వివరించడం లక్ష్యంగా గన్నవరంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్రంలో సుమారు 46.83 లక్షల మందికి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశాం. తొలి విడతలో రూ.7000 చొప్పున రూ.3174 కోట్లు, రెండో విడతలో రూ.3,135 కోట్లు మూడో విడతలో రూ.6000 చొప్పున రూ.2600 కోట్లు చొప్పున సుమారు రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అనకాపల్లి జిల్లాలో రూ.132 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఎపుడూ లేని విధంగా రైతు సంక్షేమం కోసం రూ.53 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం అన్నారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనతో ' రైతులకు అవగాహన కలిగించడం రైతన్న మీకోసం.' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరింత విస్తీర్ణంలో ప్రకృతి సాగుచేసేలా రైతులలో అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి ఆశా దేవి, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతీయ్య బాబు, పీలా గోవింద సత్యన్నారాయణ, మళ్ల సురేంద్ర బాబు డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సి బుద్ధ నాగ జగదీష్, వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

(ఎస్ రాయవరం మార్చి 16 (ప్రభాతవార్త)



పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ఎస్ రాయవరం. ధర్మవరం అగ్రహారం. దార్లపూడి కొరుప్రోలు జిల్లా పరిషత్ పాఠశాల మరియు శ్రీ ఆదర్శ అడ్డు రోడ్డు. ఐదు పరీక్ష కేంద్రాల ద్వారా 1055మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 1053 మంది హాజరయ్యారని ఎంఈఓ 2 కర్రి శ్రీరామ్మూర్తి తెలియజేశారు. దార్లపూడి పాఠశాల నుండి ఒకరు. ధర్మవరం అగ్రహారం పాఠశాల నుండి ఒకరు హాజరు కాలేదని ఆయన తెలిపారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులందరు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్లను పరిశీలించి పరీక్ష వ్రాసేందుకు అనుమతించారు. ఎస్. ఐ విభీషణరావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.




## పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన స్థానిక సీఐ - దిమిలి జడ్పీ హైస్కూల్



(రాంబిల్లి మార్చి 16 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం స్థానిక సీఐ సిహెచ్. నరసింగరావు పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిబంధనలుకు అనుకూలంగా జరుగుతున్నాయా లేదో తెలుసుకునేందుకు పరీక్షా కేంద్రాన్ని కి వెళ్ళామన్నారు, పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు భద్రతా చర్యలు, విద్యార్థులు కు కల్పించిన సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించమన్నారు, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐ తెలిపారు, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు, పరీక్ష కేంద్ర పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంది కావున ఇతరులు ఎవరు పరీక్షా కేంద్ర పరిసర ప్రాంతాల్లో ఉండరాదని తెలిపారు, పరీక్ష కేంద్రం దగ్గరలో ఉన్న జిరాక్స్ దుకాణాలు పరీక్షలు జరుగుతున్నంత సేపు తెరవరాదని ఆంక్షలు విధించారు, అలాగే పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు, పరీక్ష కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయని సిఐ సంతృప్తి వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పరీక్ష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక నెల రోజుల ఉత్సవాలు విజయవంతం చేయండి

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి మార్చి 16 :(ప్రభాత వార్త)



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం శ్రీ నూకంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా గత ఏడాది జాతర నెల రోజులు అనకాపల్లి పట్టణంలో స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్ నందు ప్రతిరోజు అనకాపల్లి ప్రాంత ప్రజలకు చుట్టుపక్కల గ్రామ ప్రజలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని భక్తి భావాన్ని, పంచే విధంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ప్రజల మన్నలను పొందిన మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిరోజు జరిగే కార్యక్రమాలను వీక్షించి అమ్మవారి నెలరోజుల ఉత్సవాలను జయప్రదం చేయాలని పట్టణ ప్రజలను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు.

## నూకాంబికను దర్శించుకున్న కార్పొరేటర్ మందపాటి దంపతులు



అనకాపల్లి రూరల్ మార్చి 16 (ప్రభాత వార్త)

ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా అమ్మవారిని జీవీఎంసీ 82 వ వార్డు కార్పొరేటర్, వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి సునీత జానకి రామరాజు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పీలా నాగ శ్రీను ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## దళిత రైతులకు న్యాయం చేయాలని తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

(రాంబిల్లి మార్చి 16 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం పంచదారల గ్రామ దళిత రైతులకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు మరియు బాధిత రైతులు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు వెంకట్రావు, ఐడి బాబు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జి. దేవుడు నాయుడు మాట్లాడుతూ పంచదారల దళిత రైతులకు ఈ భూములు తప్ప మరే భూములు లేవని గత 50 సంవత్సరాలుగా ఈ భూములు మీద ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు ఈ భూమిపైన పొందుతున్నారని, బ్యాంకులో అప్పులు తీసుకొని కుటుంబ అవసరాలు కూడా తీర్చుకుంటున్నారని, ఒక్కో రైతుకు రెండు ఎకరాల 70 సెంట్లు చొప్పున ప్రభుత్వం 1978లో ఇచ్చినటువంటి సుమారు 44 ఎకరాల భూముల్లో జీడి మామిడి, యూక్లిప్టస్, కొబ్బరి, అరటి చెట్లు పెంచుకొని జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు, ప్రభుత్వం అవసరాల రీత్యా ఈ భూమిను తీసుకోవాలని ఆలోచన ఉన్నట్లయితే దళిత రైతులకు అన్యాయం చేయొద్దని, వారిని రోడ్డు మీదకు నెట్టేయొద్దని ప్రజా సంఘాల నేతలు ఎమ్మార్వో కి విజ్ఞప్తి చేసి వినతి పత్రాన్ని అందించారు, పంచదారల దళిత రైతులు ను ఆదుకోవాలని, తమరు ఇచ్చినటువంటి ఆర్డర్ ను వెనక్కి తీసుకోవాలని, ఈ ఆర్డర్ పై జిల్లా ఉన్నతాధికారులను కూడా కలుస్తామని, వీరికి న్యాయం జరిగేంత వరకు మా పోరాటాన్ని ఎంతవరకైనా తీసుకెళ్తామని తహసిల్దార్ ఏ శ్రీనివాసరావుకి విజ్ఞప్తి చేశారు

## స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించిన హోం మంత్రి “అనిత”

### పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి..అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి:హోం మంత్రి అనిత

(నక్కపల్లి, ప్రభాత వార్త )



నక్కపల్లి మండలంలో ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా జరగనున్న ప్రతిష్టాత్మక స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి ఏర్పాట్లు వేగవంతం అయ్యాయి. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమం జరగనున్న ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సమీక్షిస్తూ హెలీపాడ్ వద్ద జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. ఈ భారీ బహిరంగ సభకు మంత్రులు, ప్రముఖులు , పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యే అవకాశమున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణం చుట్టూ పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా సభా వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని హోం మంత్రి అనిత సూచించారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)



అత్యంత ప్రతిష్టాత్మంగా సోమవారం నుండి ప్రారంభమైన పదవతరగతి పరీక్షలు తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి కుంచంగి నరేష్ విలేఖరులకు తెలిపారు .మండలంలో నక్కపల్లి బాలురు,బాలికల హైస్కూల్, గురుకులం, వేంపాడు, గొడిచర్ల హైస్కూల్స్ కేంద్రాలుగా 5 సెంటర్లలో ఈ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు . హాల్ టికెట్లను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను పంపించారు. జాతీయ రహదారి వద్ద ఎటువంటి ఇబ్బందులు కాకుండా సిఐ మురళి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. మండలంలో పరీక్షల నిర్వాహణ పట్ల స్క్వాడ్ ఆఫీసరుగా విచ్చేసిన యలమంచిలి డిప్యూటీ డిఈవో పి.అప్పారావు ఆకస్మికంగా సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులకు వేసవి దృష్ట్యా ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా త్రాగునీరు,వైద్యం,విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని,ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై మోనిటరింగు చేస్తున్నామని విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన తెలియజేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి మార్చి 16 :(ప్రభాత వార్త)



ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపారు. అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా, అనకాపల్లి సబ్ డివిజన్ ఎం శ్రావణి ఆదేశాలు మేరకు, అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. వెంకట నారాయణ తమ సిబ్బందితో కలిసి శారద బ్రిడ్జ్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్, ఆటో , ఇతర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి అని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, అలాంటి వారికి రూ.10,000 జరిమానా లేదా జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని, ప్రతి వాహనానికి తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండాలని చెప్పారు. నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## కొత్త అమావాస్య పండుగకు ముస్తాబైన నూకాంబిక అమ్మవారు

ఎలమంచిలి, మార్చి 16, ప్రభాతవార్త:



పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల నూకాంబిక అమ్మవారి దేవాలయం కొత్త అమావాస్య పండుగ సర్వం సిద్ధం చేసిన ఆలయ కమిటీ సభ్యులు. బుధవారం కొత్త అమావాస్య పండగ సందర్భంగా నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం ఉదయం నుండే మున్సిపాలిటీ పరిధిలోను పాటు చుట్టుపక్క గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి రానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులైన రావి నూకరాజు, ఆడారి శంకర్రావు, కోరిబిల్లి సుబ్బారావు, గంధం శివ, పొటారు శ్రీరామల నాయుడు, కొటారు శ్రీను తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ

ఎలమంచిలి, మార్చి 16, ప్రభాతవార్త



పట్టణ సమీపంలో కల్కి బంకు దగ్గర ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ ద్విచక్ర వాహనదారులకు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఆటో డ్రైవర్లు తమ వాహనాలలో వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండేటట్లు చూసుకోవాలని, వేగంగా వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకో రాదని సూచించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

(అచ్యుతాపురం మార్చి 16 ప్రభాతవార్త)



మండల కేంద్రంలో ఉన్న టిడిపి కార్యాలయంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి మరియు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని గుర్తు చేశారు, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు, ఆయన ఆశయాలను నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుకు సాగాలని సూచించారు, తెలుగు ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు, తదనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు, ఈమధ్య అనారోగ్యానికి గురై హాస్పిటల్ లో చికిత్స చేయించుకున్న 24 మందికి రూ 1211539 చెక్కులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు పీల తులసీరామ్, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూని శెట్టి రమణ, ఎంపీటీసీ నీరుకొండ నరసింగరావు, వడిసెల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు కు భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేద్దాం :రాష్ట్ర మంత్రులు అనిత, రవీంద్ర

### కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని విజయవంతం చేయాలి..

(నక్కపల్లి/ అడ్డరోడ్డు,మార్చి 16, ప్రభాతవార్త)



ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సోమవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో కూటమి నేతల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లి రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతా బందోబస్తు, కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. పర్యటనకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో జనసమీకరణ, ఆహారం, రవాణా తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి తొలిసారి పాయకరావుపేటకు వస్తున్న నేపథ్యంలో భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి అనిత అధికారులకు సూచించారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో జిల్లాలో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళికలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ లక్ష్యాలను ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ఆశయాలు, ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం హోంమంత్రి అనిత ముఖ్యమంత్రి పాల్గొనే సభా వేదిక స్టీల్ ప్లాంట్ పూజ చేసే ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు అనకాపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పి తుహిన్ సిన్హా ల తోపాటు జిల్లా అధికారులతో కలిసి పర్యటించి సభ వేదిక వద్ద అధికారులకు ఏర్పాటుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ,మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాద జగదీష్ తో పాటు జోన్-1 కో-ఆర్డినేటర్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ చైర్మన్లు మల్ల సురేంద్ర, పి.జి.వి.ఆర్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, నియోజవర్గ నాయకులు కురందాసు నూకరాజు, గింజల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

అరకులోయ, మార్చి16,ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా సోమ వారం జిల్లాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మొదటి విడత అక్రిడిటేషన్ కార్డుల పం పిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, డివిజనల్ పౌర సంబంధాల అధికారి కలిసి విలేకరులకు అక్రిడేషన్ కార్డులను అందజేశారు. మొదటి విడతలో భాగంగా 137 కార్డ్స్ రగా అందులో అర్హులైన జర్నలిస్టులకు జిల్లా కలెక్టర్,జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, చేతుల మీదుగా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం పనిచేసే విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల ద్వారా జర్నలిస్టులకు ప్రభుత్వం అందించే వివిధ సదుపాయాలు అందుతాయని పేర్కొన్నారు. కమిటీ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా కార్డులు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, డివిజన్ పౌర సంబంధాల అధికారి వెంకటరావు,కార్యాలయం సిబ్బంది సంధ్య,కమిటీ సభ్యులు,సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం

నర్సీపట్నం,మార్చి 16,ప్రభాతవార్త



నర్సీపట్నంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ని సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబడ్డేపల్లి ట్యాంక్ బండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు అమర నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసి ఆంధ్ర అవతరణకు పాటుపడ్డారన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తమరాన శ్రీను, యాదగిరి శేషు, దేవత అరుణ, జగదీశ్వరి, సుదీర్, వాసు, రోజా పాల్గొన్నారు.

## నర్సీపట్నం గ్రంధాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి

నర్సీపట్నం,మార్చి 16,ప్రభాతవార్త



నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గ్రంథాలయాధికారిణి పి.దమయంతి అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు 125 జయంతిని ఘనంగా నిర్వహించారు.విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి రామచంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. విశ్రాంత వ్యాయామ ఉ పాధ్యాయుడు పి.ప్రభాకర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం మొదలగు స్వతంత్ర ఉద్యమాల్లో చురుకుగా పాల్గన్నారన్నారు. తెలుగు వారిపై తమిళుల నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని, 1952 అక్టోబర్ 19న బలుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. 58 రోజుల నిరాహార దీక్ష చేసి దీక్షలోనే అమరుడయ్యారన్నారు. ఆయన మరణంతో 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తికి మనం నివాళ్లు అర్పించడం మనకెంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి

నర్సీపట్నం,మార్చి 16,ప్రభాతవార్త



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రానికి చేసినటువంటి సేవను కొనియాడుతూ విద్యార్థులు అందరూ కూడా అతనిని ఆదర్శంగా తీసుకొని స్వార్ధరహితంగా పనిచేస్తే చరిత్ర తప్పక గుర్తుంచుకుంటుందని విద్యార్థులందరూ అతని బాటలో నడవాలని తెలియజేస్తూ పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారావు మాట్లాడుతూ మనం ఇతరుల కోసం జీవించడంలో ఉన్న సంతోషాన్ని వచ్చే తృప్తిని విద్యార్థులు అనుభవించాలని అందుకు నిదర్శనం పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే.చక్రవర్తి, ఇతర అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షా సమయానికి ముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

(అచ్చుతాపురం మార్చి 16 ప్రభాతవార్త)



మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు సమయానికి ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు, మండలంలో మూడు కేంద్రాల్లో 750 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని విద్యాశాఖ అధికారులు తెలిపారు, పరీక్షలు సకాలంలో ప్రారంభం కావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు వచ్చి తమ హాల్ టికెట్లను పరిశీలించుకుని పరీక్షలకు సిద్ధమయ్యారు, పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు, పరీక్షలు నిబంధనలను పాటిస్తూ విద్యార్థులు క్రమశిక్షణగా కేంద్రాల వద్ద వరుసగా నిలబడి లోపలకు ప్రవేశించారు, పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండటం వలన ఇతరులు ఎవరు పరీక్ష కేంద్ర పరిసరాల ప్రాంతాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నారు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కూడా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు చేశారు, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే" వల్లాల నవీన్ కుమార్ యాదవ్"ను సత్కరించిన యాదవ సంఘం నాయకులు

( నక్కపల్లి, ప్రభాతవార్త )





జాతీయ యాదవ సంఘాల ఐక్యత కార్యక్రమం లో భాగంగా తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ కుమార్ యాదవ్ ను హైదరాబాదులో ని ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం చెందిన యాదవ్ సంఘం ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీరం నరసింహమూర్తి నాయకత్వంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గొర్ల బాబురావు, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు ఎలమంచిలి తాతబాబు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్లో సంఘం ప్రతినిధులు కలిసేందుకు వస్తానని వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నరసింహమూర్తి చెప్పారు.

## ముంచంగిపుట్టు మండలంలో ప్రారంభమైన రైతన్న మీకోసం వారోత్సవాలు..

**అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా ముంచంగిపుట్టు మండలంలో 7599 మంది రైతుల ఖాతాల్లో 4 కోట్ల 56 లక్షలు జమ : మండల వ్యవసాయ శాఖ అధికారి జి మురళీకృష్ణ....**

**యాంత్రికరణ, పంటల సాగు, ఏఐ డిజిటల్ సేవలపై రైతులకు అవగాహన....**

ముంచంగిపుట్టు మార్చి 16 (ప్రభాతవార్త)



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా ఈనెల 16 వ తేదీ నుంచి.25వ తేదీ వరకుఆరు రోజుల పాటు రైతన్న మీ కోసం వారోత్సవాలు ప్రతి గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి జి మురళీకృష్ణ తెలిపారు. ఈ వారోత్సవాల కార్యక్రమంలో రైతుల వివరాలు సేకరించ నా తర్వాత వ్యవసాయ శాఖ అనుబంధ యాప్ నందు నమోదు చెయ్యటం జరుగుతుందని.అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా ముంచంగిపుట్టు మండలం లో 7599 రైతులకి 4 కోట్ల 56 లక్షలు వారి బ్యాంకు ఖాతాలలో జమ చెయ్యటం జరిగిందని తెలిపారు.ప్రతి రోజు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది గ్రామంలో రైతుకి కావలసిన పని ముట్లు.,ప్రకృతి వ్యవసాయం.,గణ జీవామృతం.ద్రవ జీవామృతం వాడకం.జీవన ఎరువుల వల్ల లాభాలు.,వ్యవసాయ యాంత్రీకరణ.,పంటల సాగులో ఏఐ డిజిటల్ సేవలు.,పాడి రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు.,ఆక్వా రైతులకి విద్యుత్ రాయితీ.,రైతు బజార్లు., మద్దతు ధర.,ఉద్యాన పంటలు.,బ్యాంకు ద్వారా రుణాలు.,ఏపంట..పంట నమోదు ఉపయోగాలు.. వంటివి రైతుకి వివరించటం జరిగిందన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి జి మురళీకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమం లో రైతులతో పాటు.. వీహెచ్ఏ.సూర్యప్రకాష్. రైతులు పాల్గొన్నారు.

## తాడేపల్లిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి "వీసం"

(నక్కపల్లి, ప్రభాతవార్త)



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయిలో 175 నియోజక వర్గాలకు నియమించిన సమన్వయ కర్త లతో తాడేపల్లిలో ఉన్న కేంద్ర క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గం నుంచి దక్షిణ నియోజకవర్గం రాష్ట్ర వైకాపా కార్యదర్శి వీసం రామకృష్ణ హాజరయ్యారు. ఆ సందర్భంగా కేంద్ర కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## గ్రామంలో తాగునీటి పైప్లైన్ మరమ్మత్తు పనులు

(రాంబిల్లి మార్చి 16 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం కట్టుబోలు గ్రామం వద్ద తాగునీటి పైప్ లైన్ లీకేజీ కారణంగా మురకాడ, రాజారాయుడుపాలెం, కుమ్మరపల్లి గ్రామాలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది, గత కొన్ని రోజులుగా నీళ్లు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు ఆర్డబ్ల్యూఎస్ జేఈ కమల్ కు ఫిర్యాదు చేశారు, ఆయన ఆదేశాల మేరకు సిబ్బందిని పంపించి కట్టుబోలు వద్ద లీకేజీ ని గుర్తించి గుంత తవ్వి, పాడైన పైపు భాగాన్ని గుర్తించి అవసరమైన చోట కొత్త పైపు అమర్చి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు మరియు కార్మికులు శ్రమిస్తున్నారు, పైప్లైన్ మరమ్మత్తు పూర్తయిన వెంటనే గ్రామంలోకి తాగునీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని అధికారులు మరియు కార్మికుడు శ్రీహరి తెలిపారు.

## వరాహ నదిలో పడి ప్రమాదవసాత్తు యువకుడు మృతి

(ఎస్ రాయవరం మార్చి 16 వార్తలు )



మండలంలో సోమవారం ధర్మవరం అగ్రహారం గ్రామంలో చెందిన వెలగా నాగదుర్గ వినయ్ కుమార్ వయసు 22.తండ్రికి సహాయంగా పశువులను మేపడం కోసం తీసుకువెళ్లాడు . అందులో ఒక గేదే దాహార్తి తీసుకోవడం కోసం వరాహ నదిలో వెళ్తుంటే మెడతాడు పట్టుకున్నాడు. వెంటనే వరాహ నదిలో కి వినయ్ కుమార్ ని లాగడంతో ఈత రాకపోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు, వెంటనే స్థానికులు తెలియజేయడంతో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్. ఐ విభీషణరావు తెలియజేశారు. ఈయన వెంట ఏ ఎస్ ఐ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

(నక్కపల్లి, ప్రభాతవార్త )



నక్కపల్లి 50 పడకల ప్రభుత్వాసుపత్రిని సోమవారం కాయకల్ప రాష్ట్ర బృందం పరిశీలించింది. బృందం సభ్యులు ఆసుపత్రిలోని పారిశుధ్యం ,మరుగుదొడ్లు, వార్డులు, ఓపి మందుల విభాగం అన్నింటిని పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ సునీల్ రాజుతో ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఆసుపత్రిలో సేవలు పక్కగా అందుకున్నట్లు సునీల్ రాజు తెలిపారు. కార్యక్రమంలో కాయకల్ప వైద్యులు ప్రసన్న , నరేష్ పాల్గొన్నారు.

## పీఎం జన్మన్ పథకం ద్వారా ఉబ్బేంగుల గ్రామానికి అందుబాటులో బీటీ రోడ్..

**1 కోటి 94 లక్షల పీఎం జన్మన్ నిధులతో బీటీ రోడ్డు పనులు పూర్తి.. ఉబ్బేంగులలో పీఎం జన్ మన్ రోడ్డు నిర్మాణం పూర్తి అవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న ఉబ్బేంగుల గ్రామస్తులు,సర్పంచ్ కొర్రా త్రినాధ్**

ముంచంగిపుట్టు మార్చి 16 (ప్రభాతవార్త)



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బేంగుల గ్రామానికి పీఎం జన్మన్ పథకం ద్వారా బీటీ రోడ్డు పనులు పూర్తి అయి రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల ప్రజలతోపాటు లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్రా త్రినాధ్ లు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొర్రా త్రినాధ్ మాట్లాడుతూ బుంగపుట్టు పిఆర్ రోడ్డు నుండి ఉబ్బేంగుల వరకు రెండు కిలో మీటర్లు రోడ్డుకు 1కోటీ 94 లక్షలు రూపాయలతో మంజూరు అయిందని,రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని,దానితో ప్రజల కష్టం తీరిందని తెలిపారు, అందుకు రోడ్డు నిర్మాణం కోసం సహకరించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు,అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ధన్యవాదములు తెలిపారు.ఎంపీటీసీ వి.సాధు రాం,వార్డు సభ్యులు వి.గురుమూర్తి, వి.సుబ్బారావు,పిసా సభ్యులు వి.సుబ్బారావు, వి.నీలకంఠం,గ్రామస్థులు వి.మెట్ట,రంపాన, సోమనాథ్, సద్దు,తదితరులు పాల్గొన్నారు,

## అరకులోయలో వడగళ్లతో కూడిన కుండపోత వర్షం

అరకు రూరల్, మార్చి 16, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకులోయ నియోజకవర్గ పరిధి లో ఉరుములు మెరుపులు, వడగళ్ల తో కూడిన భారీ వర్షం కురిసింది. అరకులోయ తో పాటు అరకు నియోజకవర్గం పరిధిలోని హుకుంపేట మండల కేంద్ర సమీపము నుండి అరకులోయ మార్గ మధ్యలో వడగళ్లతో కూడిన కుండ పోత వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ కాసినప్పటికీ తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని భారీ వర్షం కురిసింది. దీనికి తోడు వడగల్లు విపరీతంగా కురిసాయి దీంతో వాహనాలు రోడ్లపైనే నిలిపి వేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవికాలంలో వడగళ్ల వాన కురవడంతో గిరిజనులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కాగా అరకలోయ అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులు కురిసిన వడగళ్ల వానకు మంత్రముగ్ధులే వాతావరణన్ని ఆస్వాదించారు. భారీ వడగళ్ల వానకు పంట పొలాలు వర్షపు నీటితో నిండిపోగ, నేలబావులు నీటితో నిండిపోయి దర్శనమిచ్చాయి.

## రైతన్నకు అండగా నిలిచింది కూటమి ప్రభుత్వమే

### రైతన్న మీకోసం వారోత్సవాల్లో సియ్యారి దొన్ను దొర

అరకు రూరల్, మార్చి 16, ప్రభాతవార్త



రైతన్నకు అండగా నిలిచింది కూటమి ప్రభుత్వం మాత్రమేనని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు అసెంబ్లీ ఇన్చార్జి లిసియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన రైతుల ఖాతాలోకి మూడో విడత అన్నదాత సుఖీభవ, 22వ విడత పిఎంకె కిసాన్ సాయం విడుదల చేసిన నేపథ్యంలో అరకు వేలి మండలం సుంకరమెట్ట గ్రామంలో రైతన్న మీకోసం వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లిదొన్ను దొర ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు జరిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా రైతులు తెలియజేసిన సమస్యలను వింటూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లిదొన్ను దొర మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ , నరేంద్ర మోడీ రైతులకు ఏడాదికి 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పిన మాటకు చెప్పినట్టుగా మూడు విడతల్లో అందజేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతన్నల కోసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్థిక సహకారం అందించినట్లు పేర్కొన్నారు. రెండు విడతల్లో రూ.14000 మూడోదఫాలో రూ. 6000 మొత్తం రూ.20,000 రైతన్నల ఖాతాలో జమ చేశామన్నారు. ఎవరికైనా సాంకేతిక సమస్యల కారణంగా వారి ఖాతాలో డబ్బులు జమ కాకపోతే రెండు మూడు రోజుల్లో వారికి కూడా జమ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. గిరిజన రైతులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు శెట్టి బాబురావు, అరకు నియోజకవర్గం అధ్యక్షుడు బురిడి కొమ్ములు నాయుడు, మాజి సూపర్ ఎంపిటిసి వంతల వెంకటరావు, సుంకరమెట్ట పంచాయతీ టిడిపి అధ్యక్షుడు కొర్ర సంజీవరావు కార్యకర్తలు పాల్గొన్నారు

## అరకులోయలో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుక

అరకు రూరల్, మార్చి 16, ప్రభాతవార్త

ఆంధ్ర రాష్ట్ర సాధనలో అపూర్వ త్యాగాన్ని చేసిన మహానుభావుడు శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నేడు మండల పరిషత్ అరకు వ్యాలీ కార్యాలయ మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అమరావతిలో నిర్వహించిన శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం (లైవ్) ద్వారా వీక్షిస్తూ, ఆయన మహత్తర సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం రీజియన్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర , పెదలబుడు సర్పంచ్ దాసు బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే మండల స్పెషల్ ఆఫీసర్ , మండల తహసిల్దార్ , మండల అభివృద్ధి అధికారి లవరాజు మరియు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు పొట్టి శ్రీరాములు




త్యాగస్ఫూర్తి, ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన చేసిన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు..

### ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు 704మంది విద్యార్థులు హాజరు..

శృంగవరపుకోట,మార్చి16, ప్రభాతవార్త



పదో తరగతి పరీక్షలు ఎస్.కోట మండల కేంద్రంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల కు ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అలాగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి పదో తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ (పదో)టెన్త్ తరగతి పరీక్షలు కూడా నిర్వహిం చామని ఎంఈఓ నరసింగరావు తెలిపారు.నాలుగు కేంద్రా ల్లో రెగ్యులర్ పదో తరగతి విద్యార్థులు రెండు కేంద్రాల్లో ఓపెన్ టెన్త్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు.రెగ్యులర్ పదో తరగతికి చెందిన 707మంది విద్యార్థులకు గాను 704మంది హాజర య్యారని తెలిపారు.అలాగే ఓపెన్ టెన్త్ కు సంభందించి 122మంది విద్యార్థులకు గాను 109మంది పరీక్షకు హజరయ్యారని తెలిపారు.పరీక్షల నిర్వహణలో మొత్తం 43మంది ఇన్విజిలేటర్లు హజరయ్యారని తెలిపారు. ప్రభుత్వ బాలుర హైస్కూల్,ప్రభుత్వ బాలికల హైస్కూల్,కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల,సర్వేపల్లి హైస్కూల్ లలో పదో తరగతి ఓపెన్ పదో తరగతి పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ నరసింగరావు తెలిపారు.

## ఎస్సెస్సీ మొదటి రోజు పరీక్షలు ప్రశాంతం

### బలిజిపేట ఎంఈఓ 1 సామల సింహాచలం

బలిజిపేట మార్చి 16 ప్రభాతవార్త

బలిజిపేట మండలంలో మొదటి రోజు జరిగిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ 1 సామల సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిజిపేట, వంతరాం పరీక్షా కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ సెంటర్లో 160 మంది, బి సెంటర్లో 149 మంది, వంతరాం సి సెంటర్లో 170 మంది విద్యార్థులు మొత్తంగా 479 మంది హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను పాలకొండ డిప్యూటీ విద్యాశాఖ అధికారి పి కృష్ణమూర్తి టీం సభ్యులు, స్థానిక తహశీల్దార్ బాల మురళి, ఎంపిడివో ఆర్ వాణిశ్రీ లు తనిఖీలు నిర్వహించారన్నారు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ ఐ వై సింహాచలం ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## తెలుగుజాతికి చిరస్మరనీయుడు.. ఎమ్మెల్యే కళా వెంకట్రావు

చీపురుపల్లి మార్చి 16 ప్రభాతవార్త

తెలుగుజాతికి చిరస్మనీయుడుగా పొట్టి శ్రీరాములు ఆదర్శంగా నిలిచారని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శవంతమైన నాయకుల ఆలోచన విధానమే ప్రస్తుత సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా చీపురుపల్లి మండలంలోని పంచాయతీల వారీగా పంపిణీ చేయవలసిన చెత్త తోపుడుబలను ఆయన ప్రారంభించారు. అదే విధముగా గ్రామాల వారీగా పర్యటిస్తూ ప్లాస్టిక్ ఇనుము వంటి వ్యర్థాలను సేకరించి వాటికి తగిన ధర ప్రకారం నిత్యవసర వస్తువులను సరఫరా చేయుట కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కామ నాయుడు గవిడి నాగరాజు, దన్నాన రామచంద్రుడు చీపురుపల్లి మండల స్థాయి అధికారులు తాసిల్దార్ ధర్మరాజు ఎంపీడీవో ఐ సురేష్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రైతన్నా.. మీకోసం

### ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం, మార్చ్16, ప్రభాతవార్త:

రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి ఆర్థికంగా రైతులు ఎదిగేందుకు రైతన్న మీకోసం వంటి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. సోమవారం మండలం చినబొండపల్లి గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా రైతులను వ్యవసాయదారులను కలసి ప్రభుత్వం అన్నదాతల కోసం అమలు చేస్తున్న పథకాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఆధారంగా చేసుకుని నూతన సాగు విధానాలను అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని, అంతేకాకుండా సాంప్రదాయక పంటలను పండించడ మే కాకుండా ఆధునిక సాగు పద్ధతులను అలవాటు చేసుకోవాలని, అందుకు ప్రభుత్వం వ్యవసాయదారులకు పూర్తి గా సహకరిస్తుందని, ఎన్నికల ముందు రైతులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కేంద్రం ప్రభుత్వం ఇస్తున్న 6వేల రూపాయలతోపాటు కూటమి ప్రభుత్వం 14వేలు కలిసి మొత్తం 20వేలు మూడు విడతలుగా రైతులకు అందించామన్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతుల పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫోటోను అంటించి వారి భూములు దోచుకోవడానికి కుట్రలు చేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రైతుల ఫోటోలుతో పాటు, సర్వ హక్కులతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేశామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాటల్లో చెప్పాలంటే మీ ఆదాయం పెరగడం ప్రభుత్వ లక్ష్యం.మీ కుటుంబం సంతోషంగా ఉండటం నా సంకల్పం.ప్రతి రైతు గర్వంగా తలెత్తుకునే ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే మా ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోను చంద్రమౌళి,గురజాన చంద్రమౌళి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరజీవి త్యాగ ఫలమే బాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు

### పొట్టి శ్రీరాములు ఘన నివాళులు అర్పించిన ఆర్య వైశ్యులు

గరివిడి మార్చి,16 ప్రభాత వార్త



అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలమే బాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు అయినవని గరివిడి ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు వివిఎస్ఎస్ ఎన్ గుప్తా అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకి ప్రాణాలు అర్పించిన అమర జీవి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా గరివిడి లోగల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గుప్తా మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన మహోన్నత వ్యక్తి, ఆంధ్రుల ఆరాధ్య దైవం శ్రీరాములు అని ఆయన అన్నారు. ప్రభుత్వం అమర జీవి 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని అమరావతి లో నెల కొల్పడం పట్ల ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. పుణ్య జీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు జె.సత్యారావు, అమరా వాసు, పున్న సూర్యారావు, చీమకుర్తి వెంకట రాజు, కందుల అప్పల రాజు, కొండ పాలెం--3 ప్రాదేశిక సభ్యులు యద్ద సూర్యారావు తదితరులు ఉన్నారు.

### కోనూరు లో అమరజీవి విగ్రహావిష్కరణ

మండలం లోని కోనూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నెలకొల్పిన ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి ప్రాణాలు అర్పించిన అమర జీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వక్తలు అమరజీవి ధన్యజీవి,పుణ్య జీవి అని కొనియాడారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోనూరు సర్పంచ్ బూడి శ్రీరాములు నాయుడు, మాజీ సర్పంచ్ వెంపడాపు రమణ మూర్తి, మండల విద్యాశాఖాధికారి పి.రామారావు, పూర్వ విఈఓ. అప్పన్న బాబు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాట్ల రవి వర్మ, వద్దాది శ్రీనివాసరావు, విజయనగరం ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు,విద్యాకమిటీ చైర్మన్ ప్రభృతులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో టెన్త్ పరీక్షలు

గరివిడి మార్చి,16 ప్రభాత వార్త

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మండలం లో ప్రశాంత వాతావరణంలో మొదట రోజు జరిగాయి. గరివిడి మండలం లో 13 ప్రభుత్వ,4 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 720 మంది విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణం లో పరీక్షలు రాశారు. కొండ పాలెం ఉన్నత పాఠశాల,గరివిడి ఉన్నత పాఠశాల, కోనూరు ఉన్నత పాఠశాలల్లో 594 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, కొండ లక్ష్మీ పురం,కాపు శంబాం, వెదుళ్లవలస, గొట్ల నంది ,బొండపల్లి ఉన్నత పాఠశాల ల్లో విద్యావ్యాసం చేసే విద్యార్థులు బొండపల్లి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు రాశారు. విద్యార్థుల కు అని సౌకర్యాలు కల్పించామని మండల విద్యాశాఖాధికారి పోలుబోతు రామారావు తెలిపారు.

## పొట్టి శ్రీరాములు జయంతికి నివాళి.. ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం మార్చి16ప్రభాతవార్త.



తెలుగు జాతి ఉనికిని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని ఆమె అన్నారు. భాష, సంస్కృతి, స్వాభిమానాల కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, నేటి తరాలు ఆయన త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రశాంతం గా ప్రారంభం అయిన పదవ తరగతి పరీక్షలు

లక్క వరపు కోట మార్చి 16 ప్రభాతవార్త

ఎల్ కోట మండల కేంద్రం లోని రెండు కేంద్రాలలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం గా ప్రారంభం అయ్యాయి ఎల్ కోట జడ్పీ హై స్కూల్ లో అలాగే మోడల్ స్కూల్ ఈ రెండు కేంద్రాలలో మొత్తం గా 422 మంది పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 417 మంది మాత్రమే మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షలకు హాజరు అయ్యారు అని మొత్తం గా 5 మంది గైర్హాజరు అయినట్లు ఏం ఈ ఓ సి ఎచ్ కూర్మారావు తెలిపారు ఈ పరిక్షల సందర్బంగా కట్టు దిట్ట మైన ఏర్పాట్లు జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు ఏర్పాటు చేశామని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మంచి నీరు టాయిలెట్లు అలాగే వైద్య సిబ్బంది ని సిద్ధంగా ఉంచి నట్లు అయన తెలిపారు బుధవారం హిందీ పరీక్ష ఉంటుంది అని తెలిపారు

## రైతన్న మీ కోసం కార్యక్రమం

రామభద్రపురం, ప్రభాతవార్త



తేదీ 16-03-2026 నుండి 25-03-2026 వరకు నిర్వహిస్తున్న రైతన్న మీ కోసం కార్యక్రమంను రామభద్ర పురం మండలం ముచ్చెర్లవలసలో నిర్వహించడం జరిగినది. ఎవో అమర శివ ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులకి తెలియజేయడం జరిగింది. రాబోవు ఖరీఫ్ లో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువులు వినియోగం, వాతావరణ పరిస్థితులు, నీటి సంరక్షణ, డిమాండ్ ఆధారిత పంటలు,అగ్రి టెక్, డ్రోన్ వినియోగం గురించి తెలియజేసారు. మండల ఉద్యానా అధికారి మోహన్ కృష్ణ గారు మాట్లాడుతూ ఆయిలపామ్ పంటలు యొక్క మార్కెట్ గురించి, అధిక ఆదాయం ఇచ్చే ఉద్యాన పంటలు మరియు ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేసారు.సర్పంచ్ కె శంకరావు మాటలాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఉపయోగించుకొని అధిక ఆదాయ మరియు మార్కెట్ డిమాండ్ పంటలు సాగు చేయమని తెలిపారు.రైతు సేవా కేంద్ర సిబ్బంది బి రాజశేఖర్, విద్యుత్ శాఖ సిబ్బంది కె మురళి కృష్ణ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద రోగులను ఆదుకోవడమే కూటమి సర్కారు ధ్యేయం

### లబ్ధిదారుల ఇంటి వద్దే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీచేసిన కిమిడి

గరివిడి మార్చి 16,ప్రభాత వార్త

రాష్ట్రంలో నిరుపేద రోగులను ఆదుకోవడమే కూటమి సర్కారు ధ్యేయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. లబ్ధిదారుల గడప వద్దకే వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రోగుల కు పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ రోగుల చెంతకు వెళ్లి సహాయ నిధి చెక్కులు అందించి వారిలో మనోధైర్యాన్ని అందిస్తున్నామన్నారు. మండలంలో ఇటీవల వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది ప్రస్తుతం ఇళ్ల వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 29 మంది లబ్ధిదారులను స్వయంగా ఆయన కలిశారు. ప్రభుత్వం నుండి మంజూరైన 19లక్షల 13వేల 587రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను రోగ గ్రస్థుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు.. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు, త్వరితంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా, నేరుగా నాయకుడే ఇంటికి వచ్చి ఆర్థిక సాయం అందించడం పట్ల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఎమ్మెల్యే కళా వెంకట రావు లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కిమిడి రామ్ మల్లిక్ నాయుడు కి,మండల టీడీపీ నాయక గణానికి రోగ పీడితులు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.చెక్కులు పంపిణీ కార్యక్రమంలో గరివిడి మాజీ ఎంపీపీ పైల బలరాం, మండల టిడిపి నాయకులు ఎస్.సురేష్, మహంతి రమణ మూర్తి, తూట శ్రీను, గొట్టిముక్కల సత్తిరాజు, శీరపు శ్రీను, దుక్క రామకృష్ణ, శనపతి సన్యాసి,తాటి గూడ, కోడూరు, కొండ పాలెం,గరివిడి తదితర గ్రామాల దేశీయులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం " రైతన్న మీ కోసం " : మంత్రి సంధ్యారాణి

సాలూరు మార్చి 16 ప్రభాతవార్త

సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో " రైతన్న మీ కోసం " కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర మంత్రి గుమ్మిడి.సంధ్యారాణి పాల్గొన్నారు.సోమవారం అక్కడకు చేరుకొన్న మంత్రికి టీడీపీ శ్రేణులు రైతులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆమె మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద 8,985.41 కోట్లు అందించడం జరిగిందని తెలిపారు.అలాగే అధికారులు రైతుల సమస్యలను నేరుగా తెలుసుకొని వెంటనే పరిష్కారించాలని సూచించారు. అంతేకాకుండా అర్హులైన ప్రతిరైతు అకౌంట్లో మూడు విడతలగా మొత్తం 20 వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద సీఎం చంద్రబాబు విడుదల చేసారని క్లారిటీ ఇచ్చారు.రాష్ట్రంలో ఉన్న రైతుల అభివృద్ధి కోసం కూటమిప్రభుత్వం కట్టుబడిఉందని మంత్రి స్పష్టం చేశారు.ఏఎం సి చైర్మన్ సూర్యనారాయణ, పరమేష్, యగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశరావు మాస్టారికి చిత్ర కళా తేజం బిరుదు



నెల్లిమర్ల, మార్చి 16, ప్రభాతవార్త

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, చిత్రకారుడు సాహితీవేత్త అయినా డాక్టర్ కడలి ప్రకాశరావు కు చిత్రకళ తేజం బిరుదు లభించింది. శ్రీకాకుళానికి చెందిన విశ్వసాహితీ కళా సంస్థ ఆధ్వర్యంలో చిలకపాలెం సమీపంలోని శివాని ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ముందస్తు ఉగాది సంబరాలు 2026 లో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు ప్రకాశరావు మాస్టారికి చిత్రకళ తేజం బిరుదును ప్రధానం చేశారు. ఘనంగా సత్కరించడంతో పాటు ప్రశంస పత్రాన్ని జ్ఞాపికను అందజేశారు. ఉగాది సంబరాల్లో మాస్టారు చిత్రించిన సుమారు 110 చిత్రాలను స్టాల్ గా ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఈ స్టాల్ ను ప్రముఖులు, వందలాది మంది విద్యార్థులు తిలకించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాస్టారుని కళాశాల ప్రిన్సిపాల్ వై. శ్రీనివాసరావు, విశ్వ సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లి రమాదేవి, ఈ. వేమన, సంస్థ ప్రతినిధులు జంధ్యాల శరత్ బాబు, ఉత్తరాంధ్ర విశ్వసాహితీ అధ్యక్షులు దుబ్బా భాస్కరరావు గణస్వామి, బొమ్మాడ నర్సింగరావు తదితరులు మాస్టారు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇదే గ్రామానికి చెందిన మరో సాహితీ వేత్త, కవి కనకల కామరాజు ను కూడా సమస్త ప్రతినిధులు సత్కరించి జ్ఞాపికను ప్రశంస పత్రాన్ని అందజేశారు. సత్కారం అందుకున్న ప్రకాష్ రావు మాస్టర్ ని కామరాజును జరజాపుపేట గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, అభిమానులు అభినందించారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు

పాచిపెంట మార్చి 16 ప్రభాతవార్త.

మండలంలో గల 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు 572 మంది విద్యార్థులకు సోమవారం నుంచి ప్రారంభించిన,పది పరీక్షలు మూడు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రమైన పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంకి 205 మంది విద్యార్థులు, బట్నాయకునివలస గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రం లో 209 మంది విద్యార్థులుమరియు పీకోనవలస గిరిజనగురుకుల బాలుర పాఠశాల కేంద్రంలో 158 విద్యార్థులపరీక్షలుకు మూడు కేంద్రాల్లో 572 మంది పరీక్ష హాజరు అవ్వాల్సి ఉన్నప్పటికీ 5 67 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పాచిపంట, బట్నాయక్ వలస పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారనీ ఎంఈఓ 2 పి సతీష్ కుమార్ తెలిపారు.

## ఆంధ్ర రాష్ట్ర స్థాపన కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు :ఎమ్మెల్యే కోళ్ల



శృంగవరపుకోట,మార్చి16,ప్రభాతవార్త..

ఆంధ్ర రాష్ట్ర స్థాపన కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు.సోమవారం పొట్టి శ్రీరాములు 125జయంతి సందర్భంగా ఎస్.కోట ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల ముఖ్య అతిధిగా పాల్గొని ముందుగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం పొట్టి శ్రీరాములని తెలిపారు.ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసిన పొట్టి శ్రీరాములను మనం జన్మాంతరం మరువకూడదని ఆమె తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ,ఎంపీపీ సోమేశ్వరావు,వైస్ ఎంపీపీ ఐ.సుధారాణి, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న,సర్పంచ్ సంతోషికుమారి పలువురు అధికారులు,పీఏసీఎస్ చైర్మన్లు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లాభసాటి పంటలు రైతులు పండించాలి : జిల్లా వ్యవసాయ అధికారి రామారావు

దత్తిరాజేరు మార్చి 16 ప్రభాతవార్త



పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ వచ్చి పంటలను రైతులు వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి టి రామారావు అన్నారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దత్తిరాజేరు ఇంగిలాపల్లిలో జరిగే రైతన్న మీకోసం కార్యక్రమాలు ఆదివారం చేపట్టారు ఇంగిలాపల్లిలో జరిగే రైతన్న మీకోసం కార్యక్రమశీ. లో డీ.ఏ వో పాల్గొన్నారు ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని వ్యవసాయ సహాయకులు చదివి వినిపించారు అనంతరం ఆయన రైతులకు ఖరీఫ్. లో రైతులు పండించిన పంటలకు రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు ఎరువులు వినియోగం వాతావరణ పరిస్థితులు నీటి వినియోగం సంరక్షణ డిమాండ్ ఆధారిత పంట ఆగ్రోటెక్ డ్రోన్ వినియోగం ఉద్యాన పంటల పై రైతులకు అవగాహన కల్పించి పామాయిల్ పంటల యొక్క మార్కెట్ గురించి వివరించారు పామాయిల్ పండించే రైతులకు అదికాదాయం లభిస్తుందని రైతులకు తెలియజేశారు ఖరీఫ్లో పండించే పంటల కోసం ప్రభుత్వం ముందుగా రైతులుకు అవగాహన కల్పించడానికి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఏడిఏ నిర్మలా జ్యోతి ఏ ఈ ఓ నీలా కృష్ణ టిడిపి నాయకులు గాడి రవి రైతులు పాల్గొన్నారు

## మహిళా సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం : స్త్రీ శిశు సంక్షేమ అధికారి బాలమణి

నెల్లిమర్ల, మార్చి 16, ప్రభాతవార్త

ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు పై ప్రతి ఒక్కరు అవగాపన కల్పించుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కె. వి. బాలమణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి బాలమణి హాజరై పల్లి విషయాలపై సమగ్రంగా వివరించారు.మహిళా, శిశు సంక్షేమ శాఖ వారి మిషన్ శక్తి స్కీం-సంకల్ప హబ్ ఆధ్వర్యంలో-20 రోజుల ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. స్వయం సంఘాల మహిళలకు, మండల సమాఖ్య సిబ్బంది కి మిషన్ శక్తి స్కీం కోసం మిషన్ వత్సల్య, పోషణ అభియాన్, కిషోరి వికాసం, ఒనస్టాప్ సెంటర్ సర్వీసెస్ ను, హెల్ప్లైన్ నంబర్స్ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కె.వి.బాలమణితోపాటు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారద, త్రినాధ, మహిళా సంరక్షణ కార్యదర్శి, విజయనగరం ఒనస్టాప్ సెంటర్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయ లక్ష్మి, కౌన్సిలర్, వెలుగు నెల్లిమర్ల మండల ఏపీఎం సురేష్, సీసీ నరసింగ రావు, పాల్గొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త 25

## రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు



విజయనగరం, మార్చి 16 ప్రభాతవార్త

రైతుల అభ్యున్నతికి తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మండలంలోని చెల్లూరు పంచాయతీలోని సుంకరిపేట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధించే విధంగా పంటలు పండించాలని సూచించారు. రైతు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అందుకు తగిన విధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. రైతు శ్రేయస్సుకు పంచ సూత్రాలు, వరి పంట సాగుకు ప్రత్యామ్నాయ ఆయిల్ పామ్,ఉద్యాన పంటల సాగు, అలెనెనో ప్రభావం వలన ఏర్పడే వర్షాభావ పరిస్థితుల్లో భూమి లో టీమ్ ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను ఇంటింటి ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు వెంకట్ నరసింగరావు, తెలుగుదేశం పార్టీ నాయకుడు రాజేష్ బాబు , పార్టీ మండల నాయకులు, ఎంపీడీవో,సచివాలయ సిబ్బంది వ్యవసాయ ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు : ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, మార్చి 16, ప్రభాతవార్త



ఆంధ్ర రాష్ట్రం కోసం 53 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు సువ్వాడ రవి శేఖర్ తో కలిసి బంగారు రాజు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బంగార్రాజు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని తెలుగుజాతి మరవదని అన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశంకర్ తో పాటు గేదెల రాజారావు, తాటి సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్, పోతల రాజప్పన్న, ఎంపీడీవో కే రామకృష్ణ రాజు, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథం పలు శాఖల ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశంలో గ్రామీణ ఉపాధిహామీకి గడ్డు పరిస్థితి : సుబ్బరావమ్మ



సాలూరు మార్చి 16 ప్రభాతవార్త

కేంద్ర మోడి ప్రభుత్వం దారుణమైన నిర్ణయాల వలన దేశంలో గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి గడ్డు పరిస్థితి వస్తుందని సీపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యురాలు సుబ్బరావమ్మ అన్నారు.ఆమె జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మండలం తాడంగివలసలో ఉపాధిహామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో కూలిపనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన నేపథ్యంలో సీపిఎం ఇంకా కమ్యూనిస్టు పార్టీలు అండతో నాడు గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టం రూపుదాల్చిందని స్పష్టం చేసారు.అలాగే ఉపాధి హామీ పనులే ప్రధాన ఉపాధిగా ఉన్న ఈ జిల్లాల్లో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల మరింత దారుణ పరిస్థితి నెల్కొంటుం దని విమర్శించారు.సీపిఎం జిల్లా నాయకులు ఎన్.వై నాయుడు,ఎం శ్రీను,కె ఈశ్వరరావు పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## రైతు శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది:ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,మార్చి16,ప్రభాతవార్త



రైతు శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు.సోమవారం మండలంలోని పోతనాపల్లి గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల ముఖ్య అతిధిగాపాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడు తూ సాగును లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్,మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న,పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు, మండల పార్టీ టీడీపీ పార్టీ అధ్యక్షుడు డి.అచ్చం నాయుడు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి సంక్షేమ మండలి జిల్లా చైర్మన్‌గా బిజెపి నేత పతివాడ రాజేష్ నియామకం



నెల్లిమర్ల, మార్చి 16, ప్రభాతవార్త

దేశంలోనూ, రాష్ట్రంలోనూ పర్యావరణ పరి రక్షణకు విశేషంగా కృషి చేస్తున్న ప్రకృతి సంక్షేమ మండలి ( నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్) విజయనగరం జిల్లా కమిటీ చైర్మన్గా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, యువ నాయకుడు పతివాడ రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మండలి రాష్ట్ర చైర్మన్ అంబటి నవ కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజేష్ ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖల లక్ష్యాల సాధనకు అనుగుణంగా ఈ సంస్థ పనిచేస్తుంది. ఈ సంస్థ ప్రధానంగా ఇప్పటివరకు పర్యావరణ పరిరక్షణతో పాటు తీర ప్రాంత రక్షణ, సమాజ అవగాహన, పర్యావరణ కార్యకలాపాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు తదితర అంశాలపై విశేష కృషి చేస్తున్నది. ప్రకృతి సంక్షేమ మండలి జిల్లా నూతన చైర్మన్గా నియమితులైన పతివాడ రాజేష్ మాట్లాడుతూ తనకు ప్రతిష్టాత్మక పదవి దక్కడం ఆనందకరమని, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు జిల్లాస్థాయిలో విశేష కృషి చేస్తానని, పర్యావరణ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తానని అన్నారు. రాజేష్‌కు జిల్లా చైర్మన్ పదవి లభించడం పట్ల బిజెపి జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ, పార్టీ నాయకులు బోడసింగి నారాయణరావు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.

## భూములు రీ సర్వే రద్దు చేయండి

### వేపాడ మండల సమావేశంలో విజ్ఞప్తి

వేపాడ, మార్చి 16, ప్రభాతవార్త




భూములకు నిర్వహిస్తున్న రీ సర్వే తో రైతులకు న్యాయం జరగలేదని సమస్యలు అధికమైనందున రీ సర్వేను రద్దుచేసి సహకరించాలని ముకుందపురం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి కనకరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది.వ్యవసాయ శాఖ తరపున శాఖా పరమైన సమాచారాన్ని ఏవో స్వాతి వివరిస్తుండగా ముకుందపురం సర్పంచ్ లేచి సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ క్రాపు నమోదు సక్రమంగా సాగలేదని , రీ సర్వేలో ఒకరి భూములు ఒకరి పేరున చూపిస్తున్నారని దీనివలన అంతా గందరగోళంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా బ్యాంకు రుణాలు అందక రైతులు అనేక అవస్థలు పడుతున్నారని రీ సర్వేను రద్దుచేసి సహకరించాలని ఆయన కోరారు.ఈ విషయంపై తాసిల్దార్ కు విజ్ఞప్తి చేయడం జరిగిందని దీనిపై ఒక ప్రకటన చేసి రైతులను గందరగోళము నుండి బయట పడేయాలని ఆయన కోరారు.దీనిపై డిప్యూటీ తహసిల్దార్ ఎం రామకృష్ణ స్పందిస్తూ మీ విషయాన్ని తహసీల్దార్ తో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయగలనని హామీ ఇచ్చారు.అలాగే రైతుల పేరుతో భూములు ఉన్న అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు కాలేదని తద్వారా ఆయా గ్రామాల రైతులు ఆందోళనలో ఉన్నారని ఈ సమస్యను పరిష్కరించాలని చినగుడిపాల సర్పంచ్ బోజంకి రామనాయుడు విజ్ఞప్తి చేశారు.దీనిపై వ్యవసాయ అధికారిని స్వాతి స్పందిస్తూ 2019 తరువాత వన్ బిలు వచ్చిన రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు కాలేదని,దీనిపై ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదేశాలు రాలేదని వివరణ ఇచ్చారు.ఆరు సంవత్సరాలుగా భూములు కొనుగోలు చేసిన రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు చేయకపోవడం పట్ల పలు గ్రామాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే చినగుడిపాల, నల్లబిల్లి, జమ్మాదేవిపేట, నీలకంఠరాజపురం తదితర గ్రామాల్లో పంటలను వందల కొలది అడవిపందులు వచ్చి ధ్వంసం చేస్తున్నాయని,ఆయా ప్రాంతాల రైతులకు రాత్రిపూట పంట పొలాల్లో మంటలు వేసుకుని కాపలా కాస్తున్నారని ఇటువంటి పరిస్థితుల్లో రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారని అడవి పందులను తరలించే ఏర్పాట్లు చేయాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లేశ్వరరావుకు చినగుడిపాల సర్పంచ్ బోజంకి రామానాయుడు విజ్ఞప్తి చేశారు.దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ, జెడ్పిటిసి ఎస్ అప్పారావు,విద్య, వైద్యం, హౌసింగ్, ఆర్టీసీ,వెలుగు, ఇంజనీరింగ్ ,విద్యుత్తు, ఐసిడిఎస్,తదితర శాఖల అధికారులు , ఎంపీటీసీలు,సర్పంచులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కె.సుబ్బారావు ఎన్నిక



సీతంపేట, మార్చి 16 ప్రభాతవార్త

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సీతంపేట మండల అధ్యక్షులుగా కే.సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సోమవారం పాలకొండ నియోజకవర్గం పరిధిలో ఉన్న నాలుగు మండలాలకు సంబంధిం చిన రిటైర్డ్ ఉద్యోగులు సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కే.సుబ్బారావు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.చిన్నారావు, జనరల్ సెక్రెటరీగా కె.ఎస్ విల్సన్ బాబు, కోశాధికారిగా ఎం.భాస్కరరావులను ఎన్నుకున్నారు. వీరి ఎన్నిక పట్ల రిటైర్డ్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, లక్ష్మయ్య, అప్పలనాయుడు, కేశవరావు, రామకృష్ణ,పాల్గొన్నారు.

## రోగుల పట్ల డాక్టర్ రాంజీ సేవలు ఎనలేనివి



### ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

కవిటి, మార్చి 16 ప్రభాతవార్త

రోగుల పట్ల డాక్టర్ రాంజీతో పాటు ఆయన భార్య డాక్టర్ హేమలత అందిస్తున్న సేవలు ఎనలేనివని ఇచ్చాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. సోమవారం కవిటి సీహెచ్‌సీలో ఉన్నత చదువుల కోసం వెళ్లనున్న డాక్టర్ రాంజీ మరియు డాక్టర్ హేమలత దంపతులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని పేద రోగులకు రాత్రింబగళ్లు సేవలు అందిస్తూ అంకితభావంతో పని చేసిన గొప్ప వైద్యుడు డాక్టర్ రాంజీ అని కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధతను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని అన్నారు. ముఖ్యంగా డాక్టర్ రాంజీ అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని పేర్కొన్నారు. పై చదువులు పూర్తి చేసుకుని తిరిగి ఇదే ఉద్దానం ప్రాంతానికి వచ్చి, ఇదే సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తూ మరెందరో పేద రోగులకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ జెడ్పీటీసీ బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, ఉషోదయ అధ్యక్షులు ఆరంగి కృష్ణారావు, ఉపాధ్యక్షులు బెందాళం చక్రి, ఉషోదయ కార్యదర్శి పోల్లాయి రుద్రయ్య, మాజీ అధ్యక్షులు ఆరంగి త్రివిక్రమరావు, గ్రామ పెద్దలు బెందాళం సురేష్, గోరకల రామారావు, తెప్పల మోహన్ రావు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్, సీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొని డాక్టర్ రాంజీ మరియు డాక్టర్ హేమలత దంపతులకు ఘనంగా సన్మానించారు.

## బాల్యవివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



### లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ పి.శ్రీధర్

వీరఘట్టం, మార్చి 16 ప్రభాతవార్త:

బాల్య వివాహాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ పి.శ్రీధర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం వీరఘట్టం మండలం కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు వలన కలుగు నష్టాలు, నివారణ, ఫోక్సో యాక్ట్ (మంచి స్పర్శ, చెడు స్పర్శ), టీనేజ్ గర్భం వలన కలిగే నష్టాలపై వివరించారు. పోలీస్ సేవలు, మహిళలపై జరిగే వేధింపులు, వన్ స్టాప్ సెంటర్ సేవలు, మిషన్ వాత్సల్య సేవలపై వివరించారు. బాల్య వివాహాలు వలన అనర్థాలు, సెక్షన్ 9, 10 ప్రకారంగా రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా ఉంటుందని తెలిపారు. పోక్సో చట్టం ప్రకారం గా ఎవరైనా లైంగిక దాడులు చేస్తే వారికి 20 సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని, వేధింపులు చేస్తే ఏడు సంవత్సరాల నుంచి పది సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు. 100, చైల్డ్ లైన్ నెంబర్ గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులు రామారావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ జి.తవిటి నాయుడు, ఓఆర్డబ్ల్యు రావాడ హరికృష్ణ, పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హైస్కూల్‌లో సుమారు 95 మంది విద్యార్థులుతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

## పొట్టి శ్రీరాములు ఆశయాలను కొనసాగించాలి

### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



ఆమదాలవలస, మార్చి 16, (ప్రభాతవార్త)

పొట్టి శ్రీరాములు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. సోమవారం టిడిపి క్యాంప్ ఆఫీస్ ఆవరణలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్వతంత్ర సమరయోధుడు, గొప్ప త్యాగమూర్తి నిజమైన దేశభక్తుడని అన్నారు. సమాజంలో సమానత్వం రావాలని, మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అనుసరిస్తూ సత్యం, అహింస మార్గంలో నడిచిన మహోన్నతమైన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని తెలిపారు. సమాజంలో అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని ఆయన ఎప్పుడూ కృషిచేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ముఖ్యముగా తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమైనది అని అన్నారు. తెలుగు భాష, సంస్కృతి మరియు ప్రజల అభివృద్ధి కోసం తమ ప్రాణాలను కూడా త్యాగం చేసిన వ్యక్తిని అన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. ఆయన చేసిన త్యాగ ఫలితమే నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, పొట్టి శ్రీరాములను అమరజీవి అని గౌరవంగా ఈరోజు ప్రజలు పిలుస్తున్నారని అన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం మనకు ఒక గొప్ప పాఠంగా నేర్పుతోందని, దేశం కోసం, సమాజం కోసం త్యాగం చేయడం ఎంత గొప్పదో పొట్టి శ్రీరాములు చేసి చూపించారని అన్నారు. మనమంతా పొట్టి శ్రీరాములు ఆలోచనలను గుర్తు చేసు కుంటూ సమాజ అభివృద్ధికి పనిచేయాలని యువతకు సూచించారు. ఆయన ఆశయాలకు అనుగుణం గా యువత కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి రాజ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ రెడ్డి గౌరీ, రాంబాబు, ప్రత్యేక అధికారి వెంకట్రావు, ఎంపీడీవో సిపాన రామ్మోహన్‌రావు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల ధిక్కార స్వప్నం అమరజీవి



కోటబొమ్మాళి, మార్చి 16 ప్రభాతవార్త:

తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించుకున్న మహా పురుషుడని, ఆయన తెలుగు ప్రజల ధిక్కార స్వప్నం అమరజీవి పొట్టి శ్రీరాములని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక మండల ప్రజా ప్రజాపరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నేలకు నిలువెత్తు కీర్తిగా, తెలుగు జాతికి నిరంతర స్ఫూర్తిగా పొట్టి శ్రీరాములు నిలిచారని ఆయన కొనియాడారు. పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శప్రాయమని అభివర్ణించారు. ఆయన ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగానికి పూనుకుని, అమరజీవి అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ పరిపాలన అధికారి నారాయణరావు, లఖందిడ్డి సర్పంచ్ బమ్మిడి గణపతిరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతిరూపం పొట్టి శ్రీరాములు : ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్

రణస్థలం, మార్చి 16 ప్రభాతవార్త



ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్ఇఆర్ మాట్లాడుతూ తెలుగు వారి కోసం, ఒక ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలనే ధారపోసిన పొట్టి శ్రీరాములు కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక గొప్ప ఆశయమని కొనియాడారు. పొట్టి శ్రీరాములు నిస్వార్థ దేశభక్తుడు, ఆయన త్యాగం వల్లే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది పడిందన్నారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని ఎన్ డిఏ కూటమి ప్రభుత్వ సంకల్పంతో ఈ రోజు అమరావతిలో 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరరావు, కూటమి నాయకులు లంక శ్యామలరావు, డిజిఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేట ఐటిడిఏ ఎదుట కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు నిరసన



సీతంపేట, మార్చి 16 ప్రభాతవార్త :

ఆశా వర్కర్లతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వేతనాలు కల్పించాలని నిరసిస్తూ సోమవారం సీతంపేట ఐటిడిఏ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 180 రోజుల కూడిన మెటర్నటీ లీవ్ కల్పించాలని వయోపరిమితి 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాలు పెంచాలని ప్రయాణపు ఖర్చులు ఇవ్వాలని. గ్రాట్యూటీ బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ వర్గాల్లో ఆశాలకు ఏఎన్ఎం నియామకాల్లో అవకాశం కల్పించాలని సిహెచ్‌డబ్ల్యుకు జీతం డైరెక్ట్ నుంచి కల్పించాలని కోరారు అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐటిడిఏ ఏపీఓ జి.చిన్నబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కే.నాగమణి, గణపతి రావు. భాస్కరరావు, సరస్వతి, కాంచన, అమల, నాగావళి, సవరశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

కోటబొమ్మాళి, మార్చి 16 ప్రభాతవార్త:

మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం తెలుగు పరీక్షలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు పరీక్షలు వ్రాసారు. కోటబొమ్మాళి మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలలో 813 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా కోటబొమ్మాళి జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాలలో 550 జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 247 మంది, నిమ్మాడ జిల్లా పరిషత్ పాఠశాలలో 144 మందికి 142, తిలారు 77 మందికి 77 మంది విద్యార్థులు హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి డి.గోవిందరావు తెలిపారు.

## గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ప్రారంభించిన ఎమ్మెల్యే ఎన్ఇఆర్



రణస్థలం, మార్చి 16 ప్రభాతవార్త

మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం కాపాడుకోవడం చాలా ముఖ్యమని, అంటువ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణను ఆదాయ మార్గంగా చూడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గాలి కుంటు వ్యాధి నివారణకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పిషిణి జగన్నాధం నాయుడు, లంక శ్యామలరావు, కుమారావు రవికుమార్, మీసాల వెంకటరమణ, చార్లెస్, దన్నాన వంశీ, మండల రామునాయుడు, కరాటే లక్ష్మణ్, మన్నె వరాహమూర్తి, మన్నె లక్ష్మీప్రసాద్, పశువైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

### -ఎమ్మెల్యే, పీయూసీ కమిటీ చైర్మన్ కూన



ఆముదాలవలస, మార్చి 16 (ప్రభాతవార్త)

మునిసిపాలిటీలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. సోమవారం డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయాన్ని రూ.8.5 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మంచినీళ్ల వాటర్ ట్యాంకు వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో మున్సిపాలిటీకి అందజేయడం శుభపరిణాయమని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన తాగునీరు ఎంతో అవసరమని తెలిపారు. పట్టణంలో నీటి అవసరాలు ఉన్న ప్రాంతాలకు ఈ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయడం సులభమవుతుందని అన్నారు. సమాజ సేవలో భాగంగా దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చి ఈ ట్యాంకర్‌ను అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే రవికుమార్ కొనియాడారు.ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో తమ ట్రస్ట్ ఎప్పటికప్పుడు సహకరిస్తుందని తెలిపారు. ఈ వాటర్ ట్యాంకర్ ద్వారా పట్టణ ప్రజలకు వేసవికాలంలో తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి రాజ్యలక్ష్మి, పిఏసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి, సంపదరావు మురళీధర్ బోయిన సునీత, సనపల కొండలరావు, ఇంజరావు విశ్వనాథం, జీడి ప్రసాదు, కిల్లి జగన్, మునిసిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఘనంగా రైతన్న మీ కోసం కార్యక్రమం



### -రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్న లోతుగెద్ద

కొత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త :

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని స్థానిక తెదేపా నాయకుడు లోతుగెద్ద తులసీవరప్రసాద్ రావు అన్నారు. సోమవారం కొత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా లోతుగెద్ద పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారానే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలరని ఆకాంక్షించారు. ముఖ్యంగా సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కాలువలు, నీటి ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, తద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని ఆయన సూచించారు. నూతన సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా, వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వివరించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం రూపొందించిన ఫార్మర్ యాప్ ప్రాముఖ్యతను ఆయన రైతులకు వివరించారు. ఈ యాప్ ద్వారా పంటల వివరాలు, మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం మరియు ప్రభుత్వ పథకాల వివరాలను రైతులు నేరుగా తెలుసుకోవచ్చని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2047 నాటికి దేశంలోని రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా రైతులు అడుగులు వేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు లోతుగెద్ద లక్ష్మీనారాయణ నాయుడు, పడాల వెంకట క్రిష్ణ, టోంపల వెంకట్రావు, వడమ శ్రీనివాసరావు, చోడవరపు జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రసహాయకులకు సోషల్ అడిట్‌పై అవగాహన

కోటబొమ్మాళి, మార్చి 16 ప్రభాతవార్త:



మండలంలోని 38 పంచాయతీలలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబందించి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో వచ్చి అడిట్ నిర్వహించనుందని ఎసఆర్‌పీ రాజేంద్రకుమార్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో క్షేత్రసహాయకులు, సీనియర్ మేట్లుతో సామాజిక తనిఖీపై అవగాహన కల్పించారు. దీంట్లో ఐదుగురు డీఆర్‌పీలు, 10మంది వీఎసఏలు పాల్గొనున్నారని, మూడు పంచాయతీలకు ఒక డీఆర్‌పీ, వీఎసఏలతో తనిఖీలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో జి.హరిప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈఈ అజింత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆశీల్ల వేలం పాటలో పెరిగిన మున్సిపల్ ఆదాయం



ఇచ్చాపురం, మార్చి 16 ప్రభాతవార్త:

మున్సిపల్ ఆశీళ్ళ వేలం ప్రశాంతంగా ముగిసాయి. ఎట్టకేలకు మూడోసారి జరిగిన మున్సిపల్ వేలం పాటలు కొలిక్కి వచ్చాయి. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వీధిగుత్త, డైలీ మార్కెట్ ఆశీలు, కమేళా, పాత పేపర్లు, పాత పేపర్లుకు సంబంధించి వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో 9మంది పాటదారులు పాల్గొనగా ప్రారంభం నుంచే అంతా పాట కోసం పోటీ పడ్డారు. చివరికి కాళ్ల మోహన్‌రావు దక్కించుకున్నారు. గత ఏడాది మొత్తం 25 లక్షల84వేల 150 ఆదాయం రాగా ఈ ఏడాది 2026-27ఆర్థిక సంవత్సరానికి రూ.35 లక్షల84కు పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది రూ.9లక్షల 15వేల 334 అదనంగా ఆదాయం వచ్చింది. డైలీమార్కెట్, వీదిగుత్త ఆశీలు గత ఏడాది రూ.24 లక్షల 11 వేలు కాగా, ఈ ఏడాది 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.32 లక్షల 77వేల 300కు కాళ్ల మోహన్‌రావు హెచ్చు పాటదారుడుగా నిలిచాడు. అలాగే కమేళా గత ఏడాది రూ.1లక్ష 63 వేల 500 కాగా ఈ ఏడాది రూ.2 లక్షల 11వేల 220కు పాటదారుడు కాళ్ల మోహన్ రావు హెచ్చు పాటదారుడుగా నిలిచాడు. పాత పేపర్ల గత ఏడాది రూ.5550 కాగా ఈ ఏడాది రూ.6844కు, కొబ్బరిచెట్ల ఫలసాయం గత ఏడాది రూ.4100 కాగా ఈ ఏడాది రూ.4720 కాళ్ల మోహన్‌రావు హెచ్చు పాటదారుడుగా నిలిచాడు. ఈ నెల 17న జరిగే మున్సిపల్ సాధారణ సమావేశంలో ఏజెండాలో చేర్చి కౌన్సిల్ ఆమోదించిన తరువాత పాట ఖాయం చేయటం జరుగుతుందని కమీషనర్ తెలిపారు. మున్సిపల్ అధికారులు, పాటదారులు పాల్గొన్నారు.

## పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను తప్పనిసరిగా వేయించాలి

### -ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, మార్చి 16 ప్రభాతవార్త:

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారించేటటువంటి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు తమ యొక్క పాడి పశువులకు తప్పనిసరిగా వేయించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మార్చి 16 వ తేదీ నుండి ఏప్రిల్ 14 వ తేదీ వరకు పశు సంవర్ధక శాఖ వారు నిర్వహించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలలో గాలికొంటూ వ్యాధి టీకాలను పశుసంవర్ధక శాఖ వారు ఉచితంగా వేను న్నట్లు తెలియజేశారు. ఈ సదవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో పిఏసిఎస్ అధ్యక్షులు బండి రవి వర్మ, కాగువాడ సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, టిడిపి నాయకులు సైలాడ సతీష్, కలమట భుజంగరావు, మంచు కృష్ణారావు, మద్దు రామరావు, అక్కంధ్ర సన్యాసిరావు, శివాల చిన్నయ్య, కూటమి నాయకులు, కొరసవాడ పశు వైద్యాధికారి డా.పారసెల్లి అనిల్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న పోలీసులు



కవిటి, మార్చి 16 ప్రభాతవార్త

ఒడిశా నుండి కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంతకు బొలెరో పికప్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తూ కవిటి మండలం కరాపాడు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటలకు పట్టుకోవడం జరిగింది. 8 గేదెలను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకోవడం జరిగినది. కోటబొమ్మాళి మండలం నారాయణవలస గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని నోటీసులు ఇవ్వడమైనది. పశువులను గుజ్జంగివలస, విజయనగరం గో సంరక్షణ సమితికి తరలించడమైనది.

## వేసవి ఆరంభంలోనే వంశధారలో తగ్గుతున్న నీటిమట్టం



### -ఆందోళనలో రైతులు, సామాన్య ప్రజలు

కొత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త :

కొత్తూరు ప్రాంతానికి ప్రధాన జీవనాధారమైన వంశధార నదిలో వేసవి ఆరంభంలోనే నీటి మట్టం గణనీయంగా పడిపోతోంది. ఎండలు రోజురోజుకూ ముదురుతుండటంతో నదిలో నీటి ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పడుతుండటం స్థానిక రైతాంగాన్ని, ప్రజలను కలవరపెడుతోంది. సాధారణంగా వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో కళకళలాడే వంశధార, ఈ ఏడాది వేసవి ప్రారంభం నాటికే వెలవెలబోతుండటం గమనార్హం. నదీ పరివాహక ప్రాంతంలోని ఎగువన ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, ఉష్ణోగ్రతలు అప్పుడే పెరగడం వల్ల ప్రవాహ ఉధృతి తగ్గిపోయిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. వంశధార నదిపై ఆధారపడి వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు, ప్రస్తుతం తగ్గుతున్న నీటి మట్టాన్ని చూసి సాగునీటి కొరత ఏర్పడుతుందేమోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం వ్యవసాయానికే కాకుండా, నదిపై ఆధారపడిన అనేక గ్రామాలకు తాగునీటి సరఫరా కూడా రాబోయే రోజుల్లో కష్టతరం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిస్తే తప్ప నదిలో మళ్లీ జలకళ వచ్చే పరిస్థితి లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, వేసవి తీవ్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, నీటి నిర్వహణపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈ నదీతీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## మూగ జీవులను వధించి విచ్చలవిడిగా పశు మాంసం విక్రయాలు



రాజాం, మార్చి 16 ప్రభాతవార్త

రాజాం మున్సిపాలిటీ పరిధిలో గల హరిజన కాలనీ వెనక భాగంలో (దొడ్లప్ప చెరువు) దగ్గర మూగ జీవులను (ఆవులు) వధించి వాటి మాంసాన్ని విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ప్రతి వారంలో రెండు రోజులు ఆదివారం, మంగళవారం దినాల్లో వీటిని వధించి మాంసంను అమ్ముతున్నారు. ఈ మాంసం విక్రయాలపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇలాంటి మాంసపు విక్రయాలపై అధికారులు చొరవ చేసుకుని పశువులను వధించకుండా అలాగే హిందువులు మనోభావాలను దెబ్బతీయకుండా చర్యలు చేపట్టవలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

## క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాలి





ఇచ్ఛాపురం, మార్చి 16 ప్రభాతవార్త:

అవగాహనతోనే క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టాల ని ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బెం దాళం అశోక్ అన్నారు. సోమవారం బెల్లుపడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మహిళలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా నిరోదించే హెచ్‌పివి వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎం లతో సమావేశం నిర్వహించి క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. 14సంవత్సరాలు దాటిన విద్యార్థినులకు క్యాన్సర్‌పై ప్రచారాలు చేస్తూ అవగహన కల్పించాలని తెలిపారు. హెచ్‌పివి (హ్యూమనర్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్(సర్వికల్ క్యాన్సర్)తోపాటు ఇతర హెచ్‌పివీ సంబంధిత క్యాన్సర్లు జ్ఞానేంద్రియ మొటిమలను నిరోదించే సురక్షితమైన టీకా అని ఈ వ్యాక్సిన్ 14-45 సంవత్సరాల మధ్య ఆడపిల్లలు లైంగికంగా చురుకుగా మారకముందే ఇస్తే అత్యంత ప్రభావితంగా పని చేస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేని ఆసుపత్రి సిబ్బంది పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్, డాక్టర్ అఖిల్ మనోహర్, ప్రేంకుమార్, రఘుబాబు, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకరరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యకులు పత్రి తవిటయ్య, ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్ రెయ్యి జానకిరావు. కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, అశి లీలారాణి, పిలక ఈశ్వరి, బి.కృష్ణయ్య, జన్నెల సంతోష్, గిన్ని చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## నౌపడలో తాగు నీటి కుళాయి మరమ్మతు పనులు



సంతబొమ్మాళి, మార్చి 16 ప్రభాతవార్త

మండలంలోని నౌపడలో కుళాయి పైపులైన్లకు సోమవారం మరమ్మత్తులు చేపట్టారు. నౌపడ కాలనీలో గత మూడు రోజులుగా కుళాయిల ద్వారా నీరు రాక గ్రామస్తులు ఇబ్బందులపై 'నౌపడలో తాగు నీటికి ఇబ్బందులు' అనే శీర్షిక తో వార్త దినపత్రికలో సోమవారం కథనం వెలువడింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఉమాపతి సత్వరమే స్పందించారు. ఈ మేరకు కార్యదర్శి కుర్మానాధపురం వద్ద పాడైన కుళాయి పైప్ లైన్‌ను తవ్వించి మరమ్మతు పనులు చేయించారు. మంగళవారం ఉదయం నుంచి కుళాయిల ద్వారా నౌపడకు తాగు నీరు సరఫరా జరుగుతుందని కార్యదర్శి తెలిపారు. అలాగే ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కొత్త పైపులు వేసేందుకు ఏర్పాటు చేస్తామన్నారు.

## రైతన్నా మీకోసం వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, మార్చి 16 ప్రభాతవార్త:

మండలంలోని కాగువాడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం వారోత్సవ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. "రైతులకు గిట్టుబాటు కావాలి" పంచ సూత్రాలు పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులతో ఎమ్మెల్యే సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె సింహాచలం రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలు, ఎరువులు,విత్తనాల అందుబాటు, సాగునీటి పరిస్థితులు, పంటల బీమా వంటి అంశాలపై రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే గోవిందరావుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హెచ్ వి రమణమూర్తి, వ్యవసాయ శాఖ అధికారులు, పిఏసిఎస్ అధ్యక్షులు బండి రవివర్మ, సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు (రాజారావు), తెదెపా నాయకులు సైలాడ సతీష్, మద్దు రామారావు, భుజంగరావు, కృష్ణారావు, అక్కంధ్ర సన్యాసిరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా టెన్త్ పబ్లిక్ పరీక్షలు

ఇచ్చాపురం, మార్చి 16 ప్రభాతవార్త:

మున్సిపాల్టీ మండల పరిధిలో గల ఏడు సెంటర్లలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తెలుగు, ఒరియా సబ్జెక్టులకు 1416మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 1410మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ సూర్యారావు తెలిపారు. మొదటి రోజు కేవలం ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు విద్యార్థులు 8.30గంటలకే పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్ గేట్లు 9గంటల వరకు తీయకపోవటంతో విధ్యార్థులు కొద్దిగా ఇబ్బందులు పడ్డారు. డొంకూరు జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన దున్న సమీర అనే విద్యార్థిని ఈమధ్య వెన్ను సమస్య రావటంతో కాళ్లు చేతులు సరిగ్గా పనిచేయక పోవడంతో స్క్రబ్ సహకారంతో వీల్‌ఛైర్‌లో ఈదుపురం పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చారు.



నేడు మంగళవారం రాజాం పాత బస్టాండ్ ఆవరణంలో ఉన్న శ్రీ నవ దుర్గ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్యామలరావుతోపాటు ఆలయ వంశీకులు వానపల్లి నర్సింగరావు తెలిపారు.ప్రభాతవార్త-రాజాం

17-3pg10.qxdo/p:17-3pg10.qxd 1/1/02 6:49 AM Page 1



## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్: లవ్లీ వర్సిటీకి మహిళలకు రన్నరప్ ట్రోఫీ

**న్యూఢిల్లీ:** అద్భుతమైన బలం, నైపుణ్యం మరియు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ మహిళల బాక్సింగ్‌లో శక్తి కేంద్రంగా ఉద్భవించింది, ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2025-26లో మొదటి రన్నరప్ ట్రోఫీని సాధించింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో పది పోటీ బరువు విభాగాలలో హై ఆక్టేన్ బౌట్‌లు జరిగాయి, పంజాబ్ విశ్వవిద్యాలయం ఓవరాల్ ఛాంపియన్ టైటిల్‌ను కైవసం చేసుకోగా, గురు కాశీ విశ్వవిద్యాలయం ఓవరాల్‌గా రెండవ రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకుంది. మహిళల లైట్ హెవీ (75-80 కిలోలు) విభాగంలో నైనా



బంగారు పతకాన్ని సాధించగా, మహిళల ఫ్లై (48-51 కిలోలు) విభాగంలో తమన్నా బంగారు పతకాన్ని సాధించింది. మహిళల వెల్టర్ (60-65 కిలోలు) విభాగంలో నిషా రజత పతకాన్ని, మహిళల మిడిల్ (70-75 కిలోలు) విభాగంలో సవితా ఖత్రి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

## ఎన్‌సిఎఎ ఛాంపియన్‌లో.. సెల్వ ప్రభు జాతీయ రికార్డు

**న్యూఢిల్లీ:** అమెరికాలోని ఫాయెట్‌విల్లేలో జరిగిన ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన సెల్వ ప్రభు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి జాతీయ రికార్డు నెలకొల్పాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో 17.05 మీటర్ల వ్యక్తిగత ఉత్తమ ప్రయత్నంతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న 21 ఏళ్ల ఈ జంప్ తన కెరీర్‌లో తొలిసారిగా 17 మీటర్ల మార్కును అధిగమించాడు. 2022లో ప్రపంచ అథ్లెటిక్స్ అండర్ 20 ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత మరియు మాజీ అండర్ 20 జాతీయ రికార్డు హోల్డర్ అయిన ప్రభు ప్రదర్శన వేగంగా అభివృద్ధి చెందుతున్న అతని కెరీర్‌లో మరో ప్రధాన మైలురాయిగా నిలిచింది.



ఆట



## సబలెంకాకు పారిబాస్ కిరీటం

**న్యూఢిల్లీ:** రైబాకినాను ఓడించి సబలెంకా బిఎన్‌పి పారిబాస్ ఓపెన్ టైటిల్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో అరినా సబలెంకా తన ఇండియన్ వెల్స్ ప్రత్యర్థిని 3-6, 6-3, 7-6(6) తేడాతో ఓడించి, తొలిసారిగా డెజర్ట్ టైటిల్‌ను గెలుచుకుని, తన కెరీర్‌లో 23వ కిరీటాన్ని కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో రైబాకినా ఆధిపత్యం చెలాయించి సబలెంకాను అధిగమించి 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టోర్నమెంట్‌లో సబలెంకా ఒక సెట్‌ను కోల్పోవడం ఇదే మొదటిసారి. రెండవ సెట్ అంత సజావుగా ప్రారంభం కాలేదు. సబలెంకా ప్రదర్శన ఆశాజనకంగా లేకపోవడంతో రైబాకినా తొలి గేమ్‌లో ఆమెను బ్రేక్ చేసింది. కానీ నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన సబలెంకా ఆటను మలుపు తిప్పి 6-3తో సెట్‌ను కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మ్యాచ్ కూడా సబలెంకా ప్రారంభంలోనే బ్రేక్ వేసి 3-1 ఆధిక్యంలో నిలిచింది. కానీ రైబాకినా మాత్రం తిరిగి 5-5తో సమం చేసి సెట్‌లో మొదటిసారి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సబలెంకా వెంటనే స్పందించి టైబ్రేక్‌ను బలవంతం చేయడంతో స్కోరు 6-6కి చేరుకుంది. తదుపరి ఆమె 8-6తో మ్యాచ్‌ను ముగించింది.

# రికార్డుల జాతర

### ఐపిఎల్ -26: బౌలర్ల రికార్డులకు కేరాఫ్ అడ్రస్.. 200 వికెట్ల క్లబ్‌పై కన్నేసిన ముగ్గురు దిగ్గజాలు



**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఐపీఎల్ 19వ సీజన్ (2026) ముంగిట ఉంది. ఈ నెల 28 నుంచి టీ20 క్రికెట్ పండుగ షురూ కాబోతోంది. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా ఎన్నో రికార్డులు బద్ధలు కావడానికి సిద్ధంగా ఉన్నాయి. సాధారణంగా ఐపీ ఎల్ అనగానే ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించే బ్యాటర్లు గుర్తుకొస్తుంటారు. కానీ, ఈ సీజన్ మాత్రం బౌలర్ల రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా మారనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 200 వికెట్ల క్లబ్‌లో చేరిన బౌలర్ ఒక్క యుజ్వేంద్ర చహల్ మాత్రమే. అయితే ఈ 2026 సీజన్‌లో చహల్ సరసన మరో ముగ్గురు దిగ్గజ బౌలర్లు చేరే అవకాశం పుష్కలంగా కనిపిస్తోంది. ఈ అరుదైన మైలురాయికి అత్యంత చేరువలో ఉన్న బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ అందరికంటే ముందున్నారు. ప్రస్తుతం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతున్న భువీ 200 వికెట్ల మార్కును చేరుకోవడానికి కేవలం 2 వికెట్ల దూరంలోనే ఉన్నారు. ఇప్పటివరకు ఆడిన 190 మ్యాచ్‌ల్లో భువనేశ్వర్ 198 వికెట్లు పడగొట్టారు. ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లోనే భువీ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇద్దరు పర్పుల్ క్యాప్‌లు గెలిచిన ఏకైక భారతీయ బౌలర్‌గా భువీకి ఐపీఎల్‌లో తిరుగులేని రికార్డు ఉంది. ఇక రెండో వ్యక్తి కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్ మాంత్రికుడు సునీల్ నరైన్. నరైన్ 200 వికెట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టాలంటే మరో 8 వికెట్లు తీయాల్సి ఉంది. 189 మ్యాచ్‌లలో 192 వికెట్లు తీసిన నరైన్ ఎకానమీ రేటు విష యంలో కూడా అందరికంటే ముందుంటారు. కేకేఆర్ జట్టులో కీలక బౌలర్‌గా ఉన్న నరైన్, ఈ సీజన్ మధ్యలోపు ఈ ఘనత సాధించే అవకాశం ఉంది. 200 వికెట్లు తీసిన తొలి విదేశీ బౌలర్‌గా చరిత్ర సృష్టించేందుకు నరైన్ తహతహలాడుతున్నారు.

ముంబై ఇండియన్స్ గన్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా ఈ రేసులో ఉన్నారు. అయితే భువీ, నరైన్‌లతో పోలిస్తే బుమ్రా కొంచెం దూరంలో ఉన్నారు. బుమ్రా 200 వికెట్ల మార్కును తాకడానికి మరో 17 వికెట్లు కావాలి. ప్రస్తుతం ఆయన ఖాతాలో 145 మ్యాచ్‌లకు గానూ 183 వికెట్లు ఉన్నాయి. బుమ్రా ఉన్న ఫామ్ చూస్తుంటే ఒక సీజన్‌లో 17 వికెట్లు తీయడం అతనికి పెద్ద కష్టమేమీ కాదు. ఈ ముగ్గురూ గనుక 200 వికెట్లు తీస్తే, ఐపీఎల్ చరిత్రలో చహల్ (221 వికెట్లు) తర్వాత ఈ ఘనత సాధించిన బౌలర్లుగా నిలిచిపోతారు.



## నేషనల్ టెన్‌పిన్ ఛాంపియన్‌షిప్‌లో కిషన్, ప్రీమల్‌కు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** ఎఆర్‌సి 34వ జాతీయ టెన్‌పిన్ బౌలింగ్ ఛాంపియన్‌షిప్‌లో కిషన్ ఆర్, ప్రీమల్ జె ఛాంపియన్‌లుగా నిలిచారు. కర్ణాటకకు చెందిన కిషన్ ఆర్ పురుషుల విభాగంలో తన రెండవ జాతీయ టైటిల్‌ను సాధించగా, ప్రీమల్ జె తన తొలి మహిళల జాతీయ కిరీటాన్ని కైవసం చేసుకుంది. మహిళల విభాగంలో కర్ణాటక కోసం 15 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికింది. రెండు ఆటలలో సంచిత పిన్‌ఫాల్ ఆధారంగా నిర్ణయించబడిన ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో టాప్‌సీడ్ కిషన్ ఆర్ ఆకాష్ అశోక్ కుమార్‌ను ఓడించడానికి చక్కటి ప్రదర్శన ఇచ్చాడు. మొదటి గేమ్‌ను 208-191తో గెలుచుకోవడం ద్వారా కిషన్ తొలి ఆధిక్యాన్ని పొందాడు, 17పిన్ ఆధిక్యాన్ని నెలకొల్పాడు. రెండవ గేమ్‌లో అతను మ్యాచ్‌లో అత్యధిక స్కోరు 244తో ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. అయితే ఆకాష్ 238 స్కోరు చేసి 452-429 విజయంతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. అంతకుముందు పురుషుల స్టెప్‌లాడర్ రౌండ్‌లో, ఆకాష్ అశోక్ కుమార్ 358-308తో షణ్ముగానందను ఓడించి, ఆ తర్వాత ధ్రువ్ సర్దాను 476-374తో ఓడించి ఫైనల్‌కు చేరుకున్నాడు. మహిళల ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో, నాల్గవ సీడ్ ప్రీమల్ జె తొలి గేమ్‌లో 188 పరుగులు చేసి, తమిళనాడుకు చెందిన సబీనా అథికాపై 168 పరుగులు చేయడం ద్వారా తొలి దశలోనే నియంత్రణ సాధించింది. రెండవ గేమ్ గట్టి పోటీనిచ్చినప్పటికీ, ప్రీమల్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. 24 పిన్‌ల తేడాతో గెలిచి 332-308 స్కోరుతో టైటిల్‌ను కైవసం చేసుకుంది.

# వారం ప్రారంభంలో లాభాల బోణీ

### సెన్సెక్స్, నిఫ్టీల్లో షేర్ల ర్యాలీ




**ముంబయి, మార్చి 16:** వరుసనష్టాలతో ఊగిస లాడిన సెన్సెక్స్, నిఫ్టీలు వారం ప్రారంభంలో లాభాల్లో ముగిసాయి. ఓవక్క మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు కొనసాగుతున్న ఎంపికచేసిన రం గాల్లో కొనుగోళ్లతో సూచీలు ర్యాలీ తీసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స 938.93 పాయింట్లుపెరిగి 75,502.85కి చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 257.70 పాయింట్లు పెరిగి 23,408.80కి చేరింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 4.85శాతం, నిఫ్టీ 4.57శాతంచొప్పున క్షీణించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.88శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.49శాతం, రిలయన్స్ 1.05శాతం చ్పొన ర్యాలీతీసాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 0.42శాతం, స్మాల్‌క్యాప్ 205 సూచీ 0.47శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 1470 షేర్లు పెరిగాయి. 2910 షేర్లు క్షీణించాయి. 169 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో డాలరుతో భారత్ రూపాయి మారకం విలువలు 92.40 కి చేరింది. అంతకుముందురోజు 92.30వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌రెండోతేదీ సెటిల్‌మెంట్లు 1.93శాతం క్షీణించి రూ.1,55,400కి చేరింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లలో 73 సెంట్లు పెరిగి 103.87 డాలర్లకు చేరింది. ఇక స్టాక్స్‌పరంగా బంధన్‌బ్యాంకు 7.46శాతం, ఐడిబిఐ బ్యాంకు 16.49శాతం క్షీణించాయి. తేజాస్ నెట్‌వర్స్ 5.44శాతం, బాజెల్‌ప్రాజెక్ట్స్ 20శాతంచొప్పున పెరిగాయి. ఓమ్నిటెక్ ఇంజినీరింగ్ 0.66శాతం క్షీణిస్తే విఏటెక్ వాబాగ్ 0.2శాతం పెరిగింది ఇక ఆదానిపవర్ 5.04శాతం, సీమాక్ 3.31శాతం, ఇజ్మో 3.71శాతం, డిఎం హెల్త్‌కేర్ 2.64శాతం, జైడస్ లైఫ్ సైన్సెస్ 2.17శాతం, ఆలక్కెమ్ ల్యాబ్స్ 0.56శాతం చొప్పున క్షీణించాయి. ఇక ఐపిఒలపరంగా జిఎస్‌పిక్రాప్ సైన్స్ 0.47రెట్లు మాత్రమే బిడ్లు సాధించింది. 16వ తేదీ ప్రారంభం అయి 18న బిడ్ల ప్రక్రియ ముగుస్తుంది. ఇష్యూధర రూ.304 నుంచి రూ.320గా ఉంది. ఇన్నోవిజన్‌కూడా 1.20రెట్లు బిడ్లు సాధించింది. పదిన ప్రారంభం అయిన బిడ్లప్రక్రియ 17న ముగుస్తుంది. ఇష్యూధర రూ.494నుంచి రూ.519గా ఉంది.



## రూ.2575 కోట్లకు వేదాంత డిబెంచర్ల ఇష్యూ

**న్యూఢిల్లీ, మార్చి 16:** వేదాంత గ్రూపు తొలిసారిగా రూ.2575 కోట్లరూపాయలు డిబెంచర్లద్వారా నిధులసమీకరణకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. వేదాంత తన నిధుల సమీకరణ వనరులను మరిన్ని వర్గాలకు విస్తరించడంతో పాటు కంపెనీ మరింత విస్తరణకుగాను ఈ నిధులు వినియోగిస్తామని, ప్రస్తుతం ఉన్న రుణాల చెల్లింపుతోపాటు రుణ వ్యయాలను కూడా తగ్గించుకునేందుకు ఈనిధులు విని యోగిస్తామని వెల్లడించింది. ముందుగా 2,57, 500 అరక్షిత, విముక్తికి ఆస్కారం ఉన్న రేటింగ్ ఉనన లిస్టింగ్ అయిన ఎన్‌సిడి అంటే నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లను జారీచేస్తుంది. ఒక్కొక్కటీ రూ.1లక్ష విలువతో మొత్తం 2575 కోట్లు ప్రైవేటు ప్లేస్‌మెంట్ పద్ధతిలో సమీక రించ నున్నట్లు వేదాంత బిఎస్‌ఇకి ఫైలింగ్ చేసింది. ఇటీవల డెట్ ఇష్యూల్లో వేదాంత ఇన్వెస్టర్ ఆసక్తితో ఉంది. గత ఏడాది అక్టోబరులో 500 మిలియన్ డాలర్ల బాండ్ ఇష్యూ చేస్తే మూడు రెట్లు అమ్మకాలు సాగాయి. ఎన్సీడీ ఆఫర్ దద ఏబివా జూన్‌నెలలో 60శాతం కొనుగోళ్లు జరి గాయి. వేదాంత రీసోర్సెస్ తమ రుణభా రాన్ని 4.8 బిలియన్ డాలర్లు తగ్గించుకోగలి గింది. రెండేళ్లక్రితం వరకూ 8.9 బిలియన్ డాలర్లు ఉన్న రుణభారం ఇపుడు 4.8 బిలియన్ డాలర్లకు తగ్గింది.

# నెమ్మదించిన బులియన్ మార్కెట్

### రూ.2950 తగ్గిన తులం బంగారం

### రూ.9 వేలు తగ్గిన కిలో వెండి



**ముంబయి, మార్చి 16:** కరెన్సీ పెట్టుబడులు, బాండ్లవైపు ఇన్వెస్టర్లు మొగ్గచూపిస్తుండటంతో బంగారం వెండిధరలు సోమవారం స్వల్పంగా తగ్గాయి. వెండిధరలు అయితే ఢిల్లీమార్కెట్‌లో ఏకంగా కిలోకు రూ.9వేలు తగ్గిరూ.2.56 లక్ష లుగా నడిచింది. బంగారం ధరలు కూడా రూ. 2950 తగ్గిరూ.1.60లక్షలకు చేరింది. ఆలిం డియా సరాఫా అసోసియేషన్ అంచనాల ప్రకా రం గ్లోబల్‌ధోరణులు క్షీణించడం, డాలర్ పటిష్టం కావడంతో ఈ ప్రభావం బులియన్‌పై పడిందని చెపుతున్నారు. ముందురోజు కిలో వెండి 2.65, 500గా ఉన్న సంగతి తెలిసిందే. 99.9 కేరట్ల బంగారం రూ.2950 తగ్గి రూ.1,60,250గా కొనసాగిందని చెపుతు న్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో బులియన్‌ధరలు కూడా దిగువ స్థాయిలో ఉన్నాయి. స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ ఒక్కింటికి 5వేల డాలర్లుగా ఉంది. వెండిధరలు కూడా ఔన్స్‌కు 80 డాలర్లుగానే నడిచాయి. బంగారం ధరలు 20.94 డాలర్లు క్షీణించి 4,998.31 డాలర్లుగా కొనసాగితే వెండిధరలు కూడా 2.25 శాం క్షీణించి 78.76 డాలర్లుగా ఉందని సరాఫా అసోసియేషన్ ప్రకటించింది. రానున్నకాలంలో బులియన్‌ధరలు కొంతవరకూ అందుబాటులోనే ఉండవచ్చని కయ్‌నత్ చైన్‌వాలా కోటక్ సెక్యూరిటీస్‌ప్రతినిధి చెప్పారు. ఫెడ్‌రిజర్వు పాలకవర్గం ఫెడరల్‌ఓపెన్ మార్కెట్‌కమిటీ పాలసీ మీటింగ్‌కూడా కొంతమేర బులియన్ రంగంపై ప్రభావంచూపిస్తుందని ఫెడ్‌రిజర్వు యధాతథ స్థితిని ప్రకటించవచ్చని అంచనా వేసారు. ఇక వివిధ మార్కెట్లలో కూడా ధరలు వేరువేరుగా ఉన్నాయి. కొన్నిచోట్ల 24 కేరట్ల బంగారం పదిగ్రాములు రూ.1,59, 660గా కొనసాగింది. అలాగే 22 కేరట్లు కదూఅ రూ.1,46,350గాను 18 కేరట్ల బంగారం రూ.1,19,740గాను కొనసాగింది. ఇదిలా ఉంటే వెండిధరలు కూడా కిలో ఒక్కింటికి రూ.2.76 లక్షలుగా కొనసాగాయి. కొన్నిచోట్ల 9 వేలు తగ్గితే కొన్నిచోట్ల నాలుగువేలే తగ్గినట్లు బులియన్ నిపుణులు చెపుతున్నారు. ముందురోజు అయితే రూ.2.80 లక్షలుగా కొనసాగిన సంగతి తెలిసిందే.

## డాలర్ వర్సెస్ రూపాయి రూ.92.40



**ముంబయి, మార్చి 16:** డాలరుతో రూపాయి మా రకం విలువలు పది పైసలు క్షీణించి రూ. 92.40వద్ద ముగిసింది. సోమవారం విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్లలో భారత్‌రూపాయి కరెన్సీ విలువలపై ముడిచమురుధరల పెరుగు దల ప్రభావంతోపాటు విదేశీ నిధులు విత్‌డ్రా కూడా ఎక్కువ చూపించింది. అయితే దేశీయ ఈక్విటీ మార్కెట్లలో కొంత రికవరీ కనిపించడంతో రూపాయి క్షీణతకు కట్టడిపడింది. ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్లలో స్థానిక రూపాయి 92.44వద్దకు పతనం అయింది. ఇంట్రాడేలో 92.47కు కూడా చేరింది క్రమేపీ బలపడి చివరకు 92.40వద్ద ముగి సింది. ముందురోజుకంటే 10పైసలు క్షీణించింది. మారాయ్ అసెట్ షేర్‌ఖాన్ విశ్లేషకుడు అనూజ్‌చౌదరి మాట్లాడుతూ అమెరికా డాలర్ సూచీలో కొంత నెమ్మదింపు కనిపించింది. హార్ముజ్ జలసంధి పునఃప్రారంభం చేస్తామన్న ట్రంప్‌ప్రకటనలు కూడా డాలర్‌పై చూపించింది. ఇండస్ ఇండ్ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు జిగార్ త్రివేది రూపీ రికార్డు దిగువస్థాయిల్లో కదలాడిందని, ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ ఈక్విటీ ఫండ్స్ విత్‌డ్రాలే ఇందుకు కారణమని అన్నారు. దీనికితోడు మార్కెట్లు బలపడి లాభాల దౌడుతీయడం కూడా రూపాయి క్షీణతకు కట్టడి పడినట్లయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.10,716.64 కోట్లు విత్‌డ్రాచేసినట్లు తేలింది. ఇన్వెస్టర్లు ఫెడ్‌రిజర్వు, యూరోపియన్ సెంట్రల్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ల మానిటరీ పాల సీల నిర్ణయాలపైనా ఎక్కువ ఆసక్తిచూపి స్తున్నారు. రానున్న కాలంలో రూపాయి విలు వలు రూ.92.10 నుంచి రూ.92.75 మధ్యలో ఉంటాయని షేర్‌ఖాన్ అనలిస్టు అనూజ్‌చౌదరి అన్నారు.

## ఫిబ్రవరిలో నిరుద్యోగిత రేటు 4.9%



**న్యూఢిల్లీ, మార్చి 16:** భారత్ నిరుద్యోగిత గణాంకాలు ఫిబ్రవరిలో 4.9శాతంగా నమోదయ్యాయి. కేంద్ర అర్థగణాంకశాఖ సోమవారం నిరుద్యోగం డేటాను విడుదలచేసింది. గ్రామీణ భారతావనిలో నిరుద్యోగం 4.2శాతంతో స్థిరంగానే కనిపించింది. అర్బన్ నిరుద్యోగిత రేటు మాత్రం ఏడు శాతంనుంచి 6.6శాతానికి క్షీణించింది. 15 ఏళ్లు అంతకుపైబడినవారిలో ఉపాధి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కార్మికశక్తి భాగస్వామ్యరేటు ఎల్‌ఎఫ్‌పిఆర్ 15 ఏళ్లకుపైబడిన వారి ఉపాధి 55.9శాతంగానే ఉంది. ఇక గ్రామీణ ప్రాంతాలు, పట్టణప్రాంతాల్లో వరుసగా 15 ఏళ్లకుపైబడిన వారు 58.7శాతం, 55.9శాతంగా ఉంది. మహిళా కార్మికశక్తి ఉపాధి లబ్ది 15 ఏళ్లకుపైబడినవారిశాతం 35.3శాతంగా ఉంది. గ్రామీణ పట్టణప్రాంతాల్లోనూ అలాగే ఉంది.జనవరిలో మహిళల ఉపాధి గణాంకాలు 5.6శాతంగా ఉంటే ఫినరబవరిలో 5.1 శాతానికి తగ్గింది. పట్టణప్రాంతాల్లోనే మహిళా ఉపాధి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. మొత్తంగాచూస్తే కార్మిక జనాభా నిష్పత్తి ఫినరబవరిలో 53.2శాతంగా ఉంది.

## 27.1 బిలియన్ డాలర్లకు తగ్గిన వాణిజ్యలోటు

**న్యూఢిల్లీ, మార్చి 16:** భారత్ వాణిజ్యలోటు ఫిబ్రవరిలో 27.1 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందునెలలో 34.68 బిలియన్ డాలర్లు ఉన్న లోటు ఫిబ్రవరిలో గణనీయంగా తగ్గింది. అమెరికానుంచి భారీస్థాయి సుంకాలనుంచి ఉపశమనం లభించడం, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం లేకపోవడంతో ఫిబ్రవరిలో లోటు తగ్గింది. వాణిజ్య దిగుమతులు వార్షిక పద్ధతిలో 24శాతం పెరిగి 63.71 బిలియన్ డాలర్లకు చేరింది.ఎగుమతులు కూడా గతనెలలో 36.61 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖప్రకటించింది. మొత్తం ఎగుమతులు వార్షిక పద్ధతిలోచూస్తే 11శాతంపెరిగి 76.13 బిలియన్ డాలర్లుచేరితో దిగుమతులు కూడా 22శాతం పరిగి 80.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరివరకూ ఉన్న ఎగుమతులు, సేవలరంగ ఎగుమతులు మొత్తం 790.86 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 747.58 బిలియన్ డాలర్లతోపోలిస్తే స్వల్పంగా వృద్ధి నమోదు చేసింది. ఇప్పటికీ అమెరికాకే భారత్ ఎగుమతులు అత్యధికంగా కొనసాగుతున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.